


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 180

బుధవారం 20-9-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వరల్డ్‌కప్ ఆడతాడా!

ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు అశ్విన్ ఎంపిక.. సత్తా చాటేందుకు అవకాశం

- 14లో



జియో ఎయిర్‌ఫైబర్ వచ్చేసింది

దేశవ్యాప్తంగా 8 నగరాల్లో ఆవిష్కరణ.. రూ.599 నుంచి ప్లాన్లు ప్రారంభం

-15లో



నంద్యాల జిల్లా డోన్‌లో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

నీటి బొట్టు.. విలువ తెలుసు

వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యం

డోన్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- రాయలసీమ బిడ్డగా కన్నీటి కష్టాలు తీర్చేందుకే హెచ్ఎన్ఎస్ఎస్ పంప్‌హౌస్
- రూ.253 కోట్లతో లక్కసాగరం వద్ద నాలుగేళ్లలోనే సాకారం.. కరువుకు శాశ్వత విముక్తి
- కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 77 చెరువులకు సాగునీరు.. 10 వేలకు పైగా ఎకరాలు సస్యశ్యామలం
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను 80 వేల క్యూసెక్కులకు పెంచేలా అడుగులు

2లో



- 800 అడుగుల్లోనే శ్రీశైలం నీళ్లు తీసుకునేలా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్
- వెలిగొండ మొదటి టన్నెల్ ఇప్పటికే పూర్తి.. రెండో టన్నెల్ అక్టోబర్‌లో జాతికి అంకితం
- గండికోట, చిత్రావతి, బ్రహ్మంసాగర్ క్యారీయింగ్ కెపాసిటీ పెంపు, ఆర్ అండ్ ఆర్ డబ్బులివ్వడంతో పూర్తి స్థాయిలో నీటి నిల్వ
- గాలేరు -నగరి సుజల స్రవంతిలో అవుకు రెండో టన్నెల్ పనులను పూర్తి చేసింది ఈ ప్రభుత్వమే

"రాష్ట్రంలో నాలుగేళ్లలో సాకారమైన మార్పులు కళ్లెదుటే కనిపిస్తున్నాయి. ఈ ప్రభుత్వంలో మంచి జరిగిందా? లేదా? అని మనస్సాక్షిని ప్రశ్నించుకోవాలి. ఆపై ఓట్లు వేసేందుకు ఎన్నికల్లో అడుగులు వేయాలి. గతంలోనూ ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్! మారిందల్లా సీఎం మాత్రమే. కానీ అప్పుల రేటు గతంలో కంటే ఇప్పుడు చాలా తక్కువ. మీ బిడ్డ వచ్చాక అక్క చెల్లెమ్మల ఖాతాల్లో ఏకంగా రూ.2.35 లక్షల కోట్లు జమ చేశాడు. చంద్రబాబు హయాంలో ఇది ఎందుకు జరగలేదు? నాడు జన్మభూమి కమిటీల నుంచి ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, దత్తపుత్రుడి దాకా దోచుకోవడం, పంచుకోవడమే! మన పాలనలో ప్రతి అడుగు మంచి కోసమే. విద్య, వైద్యంతోపాటు మహిళా సాధికారత దిశగా వేగంగా అడుగులు వేశాం. సామాజిక న్యాయంలో మన ప్రభుత్వానికి ఎవరూ సాటి లేరు. మీకు మంచి జరిగి ఉంటే సైనికుల్లా మీ బిడ్డకు తోడుగా నిలబడి ప్రోత్సహించండి. దేవుడి దయతో మీకు ఇంకా మంచి చేసే పరిస్థితి రావాలని కోరుకుంటున్నా." - సీఎం జగన్

శ్రీవారి సేవలో సీఎం

- వివరాలు 2లో

బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పించిన సీఎం వైఎస్ జగన్

నారీ శక్తికి వందనం

లోక్‌సభలో మహిళా బిల్లును ప్రవేశపెట్టిన కేంద్రం.. అతివల దశాబ్దాల నిరీక్షణకు తెర

పార్లమెంట్ నూతన భవనంలో ఉభయ సభలు కొలువుదీరిన తొలిరోజే మోదీ సర్కార్ కీలక నిర్ణయం

- బిల్లుపై నేడు దిగువ సభలో కీలక చర్చ
- గురువారం రాజ్యసభ ముందుకు..
- బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లాంఛనమే
- 2027 తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమలు!
- రిజర్వేషన్లలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు కోటా
- ఓబీసీ మహిళలకు ప్రత్యేకంగా రిజర్వ్‌డ్ సీట్లు లేనట్లే

6లో

"అన్ని రంగాల్లోనూ మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు. చట్టసభల్లోనూ వారి ప్రాతినిధ్యం మరింత పెరగాలన్న సంకల్పంతోనే మహిళా రిజర్వేషన్ బిల్లు 'నారీశక్తి వందన్ అధినియమ్'ను తీసుకువచ్చాం. దీనిద్వారా భారత ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుంది. ఈ బిల్లును పార్లమెంట్‌లో ఎంపీలంతా ఏకగ్రీవంగా ఆమోదించాలి.

పార్లమెంట్‌లో కొత్త భవనంలో కొలువుదీరాం. ఎంపీలందరూ పాత చేదు అనుభవాలను, జ్ఞాపకాలను మర్చిపోవాలి. నూతన అధ్యాయాన్ని ప్రారంభించాలి. కొత్త భవనంలో ఎంపీలు ఏం చేసినా సరే అది దేశ పౌరులకు స్ఫూర్తిదాయకంగా ఉండాలి."

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ


ఆ(మె) బిల్లు వెనుక..

6లో

పార్లమెంట్ నూతన భవనంలో...

- ప్రధాని మోదీ సారథ్యంలో పార్లమెంట్ నూతన భవనంలోకి ఎంపీలు
- కార్యకలాపాలను ప్రారంభించిన స్పీకర్ బిర్లా
- పార్లమెంట్ పాత భవనం ఇక 'సంవిధాన్ సదన్' అంటూ నోటిఫికేషన్

6లో



మంగళవారం ఢిల్లీలోని పార్లమెంట్ పాత భవనం నుంచి నూతన భవనంలోకి సహచర మంత్రులు, ఎంపీలతో కలసి వెళ్తున్న ప్రధాని మోదీ

కోలుకుంటున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆరోగ్యం క్రమంగా కుదుటపడుతోంది. ఆయనకు తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రిలో అపెండిసైటిస్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు.గవర్నర్‌ను సీఎం జగన్ పరామర్శించి.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

2లో

ప్రజాధనాన్ని లూటీ చేశారు

ఇదంతా అప్పటి సీఎం చంద్రబాబుకు తెలిసే జరిగింది

స్వలాభాపేక్షతో ఖజానాకు రూ.371 కోట్ల నష్టం

ఐటీ శాఖ, ఈడీ సైతం దర్యాప్తు చేస్తున్నాయి

అసలు దర్యాప్తు ఇప్పుడే మొదలైంది.. దీన్ని అడ్డుకోవద్దు

హైకోర్టుకు నివేదించిన సీఐడీ తరపు న్యాయవాదులు

తీర్పు రిజర్వ్ చేసిన జడ్జి

10లో

ఫైబర్ నెట్ కేసులోనూ చంద్రబాబుపై పీటీ వారెంట్

విజయవాడ ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన సీఐడీ

ఫైబర్ నెట్ ప్రాజెక్టులోనూ బాబు అవినీతి దందా

10లో

శాస్త్రీయంగా.. సమర్థంగా..

ఏపీపీఎస్సీ పరీక్షలు, మూల్యాంకనంలో నూతన విధానాలపై కసరత్తు

గ్రూప్-1 ప్రిలిమ్స్ ఒక పేపర్, మెయిన్స్‌లో 4 పేపర్లు

ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్ వెల్లడి

11లో

జేఈఈ మెయిన్ తేదీలు ఖరారు

11లో

క్లుప్తంగా...

మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడం గర్వంగా ఉంది

సీఎం వైఎస్ జగన్ ట్వీట్

సాక్షి, అమరావతి: లోక్‌సభలో కేంద్రం మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడం గర్వంగా ఉందని సీఎం వైఎస్ జగన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్వీట్ చేశారు. 'మహిళా రిజర్వేషన్ బిల్లుకు వైఎస్సార్‌సీపీ తరఫున మద్దతు తెలుపుతున్నందుకు చాలా గర్వపడుతున్నాను. మహిళలకు సాధికారత కల్పించడం మనందరికి చాలా ముఖ్యం. ఏపీలో గత నాలుగేళ్లలో ప్రవేశపెట్టిన పథకాలు, పలు కార్యక్రమాల ద్వారా మాత్రమే కాకుండా, సమాన ప్రాతినిధ్యాన్ని నిర్ధారించడం ద్వారా కూడా దీనిని సాధించాం. కలిసికట్టుగా ప్రకాశవంతమైన, మరింత సమానమైన భవిష్యత్తును సృష్టిద్దాం!' అని సీఎం పేర్కొన్నారు.

కోలుకుంటున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

సీఎం వైఎస్ జగన్ పరామర్శ

సాక్షి, అమరావతి: గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆరోగ్యం కుదుటపడుతోంది. ఆయనకు తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రిలో సోమవారం అపెండిసైటిస్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. పొత్తి కడుపులో తీవ్రమైన నొప్పి రావడంతో గవర్నర్‌ను మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం అపెండిసైటిస్‌గా నిర్ధారించి వెంటనే శస్త్రచికిత్స నిర్వహించారు. ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉందని.. త్వరగా కోలుకుంటున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

గవర్నర్‌ను పరామర్శించిన సీఎం

గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సీఎం జగన్ పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను వాకబు చేశారు. గవర్నర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తిరుపతి, కర్నూలు, నంద్యాల పర్యటన ముగించుకుని తాడేపల్లి చేరుకున్న సీఎం, గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి మణిపాల్ ఆస్పత్రికి వెళ్లి గవర్నర్‌ను పరామర్శించారు. ఈ నెల 18న తిరుమల పర్యటనలో ఉన్న సీఎం వైఎస్ జగన్ గవర్నర్ పరిస్థితి తెలిసిన వెంటనే అక్కడి నుంచే గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

నేడు కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన బుధవారం ఉదయం 11 గంటలకు సచివా లయంలోని మొదటి బ్లాక్‌లో కేబినెట్ సమా వేశ మందిరంలో రాష్ట్ర మంత్రిమండలి భేటీ కానుంది. ఇందులో గురువారం నుంచి అసెంబ్లీ సమావేశాలు నేపథ్యంలో అక్కడ ప్రవేశపెట్టాల్సిన కీలక ముసాయిదా బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలపడంతో పాటు పలు కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం.

కనీస వేతన సలహా మండలి సభ్యుల నియామకం

సాక్షి, అమరావతి: కనీస వేతన సలహా మండలి ఇండిపెండెంట్ సభ్యులుగా ఎం.వెంకటరమణ(వైఎస్సార్ జిల్లా), పి.వెంకటరావు (తూర్పు గోదావరి జిల్లా)లను ప్రభుత్వం నియమించింది. రెండేళ్ల పాటు వీరు సభ్యులుగా కొనసాగనున్నారు. ఈ మేరకు కార్మిక శాఖ కార్యదర్శి డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.




నంద్యాల జిల్లా డోన్ బహిరంగ సభ ప్రాంగణం నిండిపోవడంతో బయటే నిలుచుని సీఎం ప్రసంగం వింటున్న ప్రజలు

నీటి బొట్టు.. విలువ తెలుసు

డోన్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కర్నూలు: వినాయక చవితి సందర్భంగా కర్నూలు, నంద్యాల జిల్లాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విలువైన వరాలను అందించారు. 2 జిల్లాల్లో 77 చెరువులకు హంద్రీ–నీవా నీటితోపాటు తాగునీటిని కూడా అందించే ప్రాజెక్టును సీఎం మంగళవారం ప్రారంభించారు. పత్తికొండ నియోజకవర్గం లక్కసాగరం సమీపంలోని అలంకొండ పంప్‌హౌస్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించి నీటిని విడుదల చేశారు. అక్కడ పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం డోన్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు.

పక్కనే శ్రీశైలం ఉన్నా..

ఇది నీటి విలువ తెలిసిన మనందరి ప్రభుత్వం. రాయలసీమ నీటి కష్టాలు తెలిసిన మీ బిడ్డగా శాశ్వత మార్పులు తెచ్చేందుకు నాలుగేళ్లుగా అడుగులు వేస్తున్నాం. అందులో భాగంగానే కర్నూలు, నంద్యాల జిల్లాలకు మంచి జరిగే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ నుంచి మెట్ట ప్రాంతాలకు తాగు, సాగు నీటిని అందించేందుకు లక్కసాగరం వద్ద పంప్ హౌస్ ఏర్పాటు చేసి 77 చెరువులను నింపుతున్నాం. రోజుకు 160 క్యూసెక్కుల చొప్పున 90 రోజుల్లో 1.24 టీఎంసీల హంద్రీ–నీవా జలాలతో చెరువులను నింపుతాం. ఆశ్చర్యమేంటంటే పక్కనే శ్రీశైలం ఉన్నా మెట్ట ప్రాంతాలైన పత్తికొండ, డోన్‌కు సాగునీరు అందని దుస్థితి నెలకొంది. డోన్ చరిత్రలో ఇప్పటివరకూ ఒక్క ఎకరాకు కూడా నికరజలాలు లేని పరిస్థితి. ఇంత దారుణ పరిస్థితులున్నా గతంలో ఎవరూ పట్టించుకున్న పరిస్థితులు లేవు. 2019 ఎన్నికలకు కేవలం 4–5 నెలల ముందు చంద్రబాబు ఒక జీవో ఇచ్చి టెంకాయ కొట్టారు. కనీసం పైపులు వేసేందుకు భూసేకరణ కూడా జరగలేదు. హడావుడిగా టెంకాయలు కొట్టేందుకు మాత్రం 8 ఎకరాలు కొనుగోలు చేశారు. అలాంటి దారుణమైన మోసాలకు పాల్పడ్డారు. చంద్రబాబు మాదిరిగా ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హడావుడిగా పనులు చేపట్టే ప్రభుత్వం మాది కాదు. మనందరి ప్రభుత్వం ఏర్పాటయ్యాక నీటి విలువ తెలిసిన రాయలసీమ బిడ్డగా రూ.253 కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన చేపట్టాం. నాలుగేళ్లలోనే ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశాం. ఈ ప్రాంతంలో 8 మండలాలు కరువుతో ఉన్నాయి. మొత్తం 10,130 ఎకరాలకు సాగునీటితోపాటు ఈ ప్రాంతంలోని గ్రామాలకు తాగునీరు అందించే పనులు పూర్తి చేశాం. ఈ ప్రాజెక్టుతో డోన్, పత్తికొండ నియోజకవర్గాలకు మంచి జరుగుతుంది. ఆలూరు, పాణ్యం నియోజకవర్గాలకు కూడా మేలు జరుగుతుంది. వెల్దుర్తి, కల్లూరు మండలాల్లో 22 చెరువులకు హంద్రీ–నీవా కాలువ నుంచి ఇప్పటికే పైపులైన్ కనెక్టివిటీ పూర్తయింది. ట్రైల్ రన్ చేస్తున్నాం. కృష్ణగిరి, తుగ్గలి, మద్దికెర, దేవనకొండ, పత్తికొండ మండలాల్లోని 14 చెరువులకు కూడా పైపులైన్ కనెక్టివిటీ పూర్తయి ట్రైల్ రన్ జరుగుతోంది. ప్యాపిలి, డోన్ మండలాల్లో 19 చెరువులకు పైపులైన్ పూర్తయింది. జొన్నగిరి, డోన్, తుగ్గలి మండలాల్లోని మరో 7 చెరువులకు ట్రైల్‌రన్ పూర్తయి చెరువులకు నీళ్లు ఇస్తున్నాం. డోన్ నియోజకవర్గంలో అదనంగా అవసరాన్ని బట్టి మరో 8 చెరువులకూ నీరిస్తున్నాం. మొత్తంగా 77 చెరువులకు సంబంధించి ప్రాజెక్టు పనులను పూర్తి చేశాం.



కర్నూలు జిల్లా లక్కసాగరంలో కర్నూలు–నంద్యాల జిల్లాల పశ్చిమ ప్రాంత 77 చెరువులకు హంద్రీ- నీవా కాలువ నుంచి తాగు, సాగునీరు అందించే పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్

గాజులదిన్నె సామర్థ్యం పెంపుతో సాగుకు భరోసా..

ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండలం గాజులదిన్నె వద్ద ఉన్న సంజీవయ్యసాగర్ ప్రాజెక్టు సామర్థ్యం 4.5 టీఎంసీలు. 24,372 ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు వర్షాధారంతో నిండాల్సిందే. కృష్ణా జలాల కేటాయింపు లేదు. పత్తికొండ నియోజకవర్గంలోని 27 గ్రామాలకు, కృష్ణగిరి మండలంలో 55 ఆవాసాలకు, గోనెగండ్ల మండలంలోని 10 ఆవాసాలకు, డోన్ మునిసిపాలిటీకి ఇది తాగునీరు అందిస్తోంది. కర్నూలు కార్పొరేషన్‌కు కూడా తాగునీటిని అందిస్తోంది. ఇన్ని రకాలుగా ఉపయోగపడే ఈ ప్రాజెక్టు సామర్థ్యాన్ని మనం వచ్చిన తర్వాత 4.5 నుంచి 5 టీఎంసీలకు పెంచాం. హంద్రీ–నీవా ప్రధాన కాలువ నుంచి తూము నిర్మించి రూ.57 కోట్లతో నీళ్లు ఇస్తున్నాం. ఆ పనులు కూడా పూర్తి చేసినందుకు గర్వపడుతున్నా. ఈ ప్రాంతానికి ఇంత ఉపయోగపడే ఈ ప్రాజెక్టుపై గతంలో ఎప్పుడూ ఎవరూ ఆలోచన చేయలేదు. ఇక్కడ వర్షాలు పడితేనే వ్యవసాయం. చెరువులున్నా నింపాలనే ఆలోచన ఎవరూ చేయలేదు. ఎన్నికల సమయంలోనే కొందరికి టెంకాయలు, జీవోలు గుర్తొస్తాయి. ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన రాదు. నా 3,648 కిలోమీటర్ల పాదయాత్రలో ఇక్కడకు వచ్చినప్పుడు మీ కష్టాలు చూశా. మీకు నేనున్నానని చెప్పా. మాట ప్రకారం నాలుగేళ్లలో పూర్తి చేసి ఆశీస్సుల కోసం మీ ముందు నిలబడుతున్నా.



మా నమ్మకం నువ్వే జగన్ అంటూ సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రజలు

ఆ రోజు వైఎస్సార్.. ఈ రోజు మీ బిడ్డ ప్రభుత్వం

రాయలసీమలో ఎంత దుర్భిక్ష పరిస్థితులున్నాయో నాకు తెలుసు. ఈ రోజు హంద్రీ–నీవా నుంచి తూము పెట్టి 77 గ్రామాలకు జలాలు ఎత్తిపోస్తున్నాం. ఆ ప్రాజెక్టు కట్టింది ఎవరు? అని అడుగుతున్నా. చంద్రబాబు 9 ఏళ్లు సీఎంగా ఉండి ఖర్చు చేసింది కేవలం రూ.13 కోట్లు. దివంగత వైఎస్ రాజ శేఖరరెడ్డి సీఎం అయ్యాక రూ.6 వేల కోట్లతో హంద్రీ–నీవా కాలువ నిర్మించారు. అందువల్లే ఈ రోజు కాలువలపై తూములు ఏర్పాటు చేసి లిఫ్టులు పె ట్టుకుంటున్నాం. రాయలసీమ సాగునీటి కష్టాల ను తీర్చేందుకు పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 11 వేల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచారు. ప్రజల గురించి ఎవరైనా ఆలోచించారంటే అప్పుడు వైఎస్సార్ హయాంలో.. ఆ తర్వాత దేవుడి దయ, మీ అందరి దీవెనలతో ఏర్పడ్డ మీ బిడ్డ ప్రభుత్వంలోనే. పోతిరెడ్డిపాడును 80 వేల క్యూసెక్కులకు తీసుకెళ్లేలా అడుగులు పడుతున్నాయి. గత పాలకుల నిర్వాకా లను మనమంతా చూశాం. పోతిరెడ్డిపాడుకు నీళ్లు వదలాలంటే శ్రీశైలం నిండాలి. 881 అడుగులకు చేరితే తప్ప నీళ్లు రాని పరిస్థితి. శ్రీశైలం నిండేదెప్పుడు? నిండినా ఎన్ని రోజులు నీళ్లు ఉంటాయి? తెలంగాణ ప్రాజెక్టులకు 800 అడుగుల్లోనే నీళ్లు తీసుకుంటున్నారు. 790 అడుగులకే పవర్ జనరేషన్ చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మీ బిడ్డ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాయలసీమ లిఫ్ట్ గురించి ఆలోచించాం. 800 అడుగుల్లోనే నీళ్లు తీసుకునేలా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు జరుగుతున్నాయి.



డోన్ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సీఎం జగన్

ప్రకాశం కరువూ తీరుస్తాం

కరువుతో అల్లాడుతున్న ప్రకాశం జిల్లా కరువు కూడా తీరుస్తాం. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితేనే నీళ్లు వస్తాయి. ఇక్కడ రెండు టన్నెళ్లు ఉన్నాయి. వైఎస్సార్ హయాంలో ఒక్కో టన్నెల్ 18 కిలోమీటర్లతో పనులు ప్రారంభించారు. ఆయన హయాంలోనే టన్నెల్–1లో 12 కిలోమీటర్లు, టన్నెల్–2లో 8 కిలోమీటర్లు మేర పనులు జరిగా యి. ఆ తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. కరు వుతో అల్లాడుతున్న ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు మీ బిడ్డ మొదటి టన్నెల్ పూర్తి చేశాడు. రెండో టన్నెల్‌ను అక్టోబర్‌లో జాతికి అంకితం చేస్తున్నాం.

నాడు వెలవెల.. నేడు కళకళ

బాబు హయాంలో రాయలసీమలో ఏ ప్రాజెక్టు తీసుకున్నా నీటిని పూర్తి స్థాయిలో నిల్వ చేయలేదు. గండికోటకు 27 టీఎంసీల సామర్థ్యం ఉంటే 10–12 టీఎంసీలు కూడా నిల్వ చేయలేదు. చిత్రావతి సామర్థ్యం 10 టీఎంసీలు కాగా 2–3 టీఎంసీలను కూడా నిల్వ చేయని దుస్థితి. బ్రహ్మంసాగర్‌కు 17 టీఎంసీల సామర్థ్యం ఉంటే నాడు నీళ్లు అందని పరిస్థితి. మీ బిడ్డ సీఎం అయ్యాక కాలువల సామర్థ్యాన్ని పెంచాం. ప్రతి ప్రాజెక్టుకు ఆర్ అండ్ ఆర్ కోసం డబ్బులిచ్చాం. దీంతో పూర్తి స్థాయిలో నీళ్లు నిల్వ చేయగలుగుతున్నాం. గాలేరు –నగరి సుజల స్రవంతిలో అవుకు రెండో టన్నెల్ పనులను పూర్తి చేసింది కూడా ఈ ప్రభుత్వమే. ఇవన్నీ మంచి మనసు పెట్టి చేసిన పనులు. గతానికి, ఇప్పటికీ తేడా గమనించాలి. ఈ ప్రభుత్వం వచ్చాక రూ.2.35 లక్షల కోట్లను అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశాం. మరి నాడు బాబు ఎందుకు చేయలేకపోయారు? ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడితో కలసి దోచుకో, పంచుకో, తినుకో (డీపీటీ) లక్ష్యంగా వ్యవహరించారు.

కళ్లెదుటే మార్పులు..

గ్రామ స్థాయిలో మీ స్కూళ్లలో గతానికి, ఇప్పటికీ మధ్య తేడాను గమనించండి. స్కూళ్లలో ఇంగ్లిషు మీడియం వచ్చింది. బైలింగ్యువల్ టెక్ట్స్ బుక్స్ ఇస్తున్నాం. ఆరో తరగతి నుంచి ఐఎఫ్‌బీ ప్యానెళ్లతో డిజిటల్ బోధన, 8వ తరగతిలో ట్యాబ్‌లు ఇస్తున్నాం. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, అభివృద్ధి చేసిన పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులు ఎప్పుడూ చూడని విధంగా కనిపి స్తున్నాయి. 17 కొత్త మెడికల్ కాలేజీలను నిర్మిస్తు న్నాం. 53 వేల మంది డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బందిని నియమించాం. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టాం. ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇస్తున్నాం. వ్యవసాయంలో ఆర్బీకేలు రైతన్నలను చేయి పట్టుకుని నడిపి స్తున్నాయి. ఈ– క్రాపింగ్ నుంచి పంట కొనుగోలు వరకు మంచి జరుగుతోంది. ప్రతి అడుగులోనూ మంచి చేస్తున్న మన ప్రభుత్వానికి ఆశీస్సులు అందించాలని కోరుతున్నా.

కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్ బాషా, మంత్రులు గుమ్మనూరు, అంబటి, ఎంపీలు పోచా బ్రహ్మానందరెడ్డి, సంజీవ్, ఎమ్మెల్యేలు ఆర్థర్, శిల్పా రవి, కంగాటి శ్రీదేవి,రాంభూపాల్‌రెడ్డి, చక్రపాణి రెడ్డి, బాలనాగిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, హఫీజ్‌ఖాన్, చెన్నకేశవరెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు ఇషాక్, మధుసూదన్, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుగుణాల మారాజు

- బుగ్గన రాజేంద్రనాథ్, ఆర్థిక శాఖ మంత్రి

'కరువు సీమకు పండుగ పూట బహుమానం ఇచ్చేందుకు సీఎం జగన్ వచ్చారు. కర్నూలు జిల్లా శతాబ్దాలుగా ఎన్నో కరువులు చూసింది. ఒక్క ఎకరాకూ నీటి పారుదల లేని ప్రాంతం డోన్. రెయిన్‌గన్ ద్వారా నీళ్లిస్తామని గత పాలకులు బూటకపు మాటలు చెబితే ఈ రోజు 77 చెరువులు, వంద గ్రామాలకు సాగు, తాగునీరు అందిస్తున్న ప్రభుత్వం మాది. చెరువులకు నీళ్లు ఇవ్వడంతో భూగర్భ జలాలు పెరిగి భూములు సస్యశ్యామలం కానున్నాయి. సుగుణాలన్నీ ఉన్న మారాజు మన జగన్. అవినీతికి పాల్పడి చంద్రబాబు జైలుకు వెళితే నిరసన దీక్షలు ఏమిటి? రాజకీయాల్లోకి కొత్తగా వచ్చిన ఓ వ్యక్తి దీనికి మద్దతు ప్రకటించడం ఎంత దారుణం? ప్రజలకు చైతన్యం లేదని, పిరికి వాళ్లు కాబట్టే తాను రాజకీయాల్లోకి వచ్చానని ఆయన చెబుతున్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ కుంభకోణాలు, కుట్రలను చట్ట సభల సాక్షిగా ప్రజలకు తెలియచేస్తాం'



శ్రీవారికి సమర్పించడానికి పట్టువస్త్రాలను తీసుకువస్తున్న సీఎం జగన్

శ్రీవారి సేవలో సీఎం




ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఎం జగన్‌కు వేదాశీర్వచనాన్ని అందజేస్తున్న టీటీడీ వేద పండితులు

- బ్రహ్మోత్సవాల తొలిరోజు ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలను సమర్పించిన సీఎం జగన్
- బేడి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ముఖ్యమంత్రికి పరివట్టం
- పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయంలోకి..
- రూ.313 కోట్లతో 3,518 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

సాక్షి, తిరుపతి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టువస్త్రాలను సమర్పించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండుసార్లు శ్రీవారిని దర్శించుకున్నారు. రెండు రోజుల పాటు తిరుపతి, తిరుమలలో గడిపిన సీఎం జగన్ శ్రీవారి సేవలో పాల్గొనడంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తిరుపతిలో నూతనంగా నిర్మించిన శ్రీనివాస సేతు ఫ్లైఓవర్, ఎస్వీ హాస్టల్ నూతన భవనాలను ప్రారంభించడంతోపాటు టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు.

మంగళ వాయిద్యాల నడుమ...

మొదటి రోజైన సోమవారం రాత్రి శ్రీవారికి సీఎం జగన్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పించారు. తొలుత తిరుపతి నుంచి రోడ్డు మార్గాన తిరుమల చేరుకున్న సీఎం జగన్ భక్తుల కోసం దాతల సహకారంతో టీటీడీ నిర్మించిన రెండు విశ్రాంతి గృహాలను ప్రారంభించారు. పద్మావతి అతిథి గృహంలో కొద్దిసేపు గడిపారు. అనంతరం శ్రీవారి ఆలయానికి ఎదురుగా కొలువై ఉన్న శ్రీ బేడి ఆంజనేయస్వామివారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రధాన అర్చకులు ముఖ్యమంత్రికి పరివట్టం కట్టారు. అనంతరం సీఎం జగన్ ప్రభుత్వం తరఫున తీసుకొచ్చిన పట్టువస్త్రాలను తలపైన పెట్టుకుని మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. ధ్వజ స్తంభానికి నమస్కరించి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వకుళమాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు సీఎం జగన్‌ను ఆశీర్వదించి శ్రీవారి తీర్థ ప్రసాదాలు, శ్రీవేంకటేశ్వర స్వామివారి కలంకారీ చిత్రపటాన్ని అందజేశారు. టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, కార్య నిర్వహణాధికారి ఏవీ ధర్మారెడ్డి సీఎం వెంట ఉన్నారు.

మరోసారి శ్రీవారిని దర్శించుకున్న సీఎం

సోమవారం రాత్రి పద్మావతి అతిథి గృహంలో బస చేసిన ముఖ్యమంత్రి జగన్ మంగళవారం ఉదయం ప్రాతః కాల సమయంలో తిరుమల శ్రీవారిని మరోసారి దర్శించుకున్నారు. ఆలయ మహద్వారం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో ముఖ్యమంత్రి జగన్‌కు వేదపండితులు వేదాశీర్వచనం అందచేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాన్ని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ముఖ్యమంత్రికి అందించారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, కొట్టు సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రులు కొడాలి నాని, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, ఈవో ఏవీ ధర్మారెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన సంప్రదాయాన్ని పాటిస్తూ గంగమ్మకు పూజలు

ముఖ్యమంత్రి జగన్ సోమవారం సాయంత్రం తిరుమలకు బయలుదేరే ముందు ప్రాచీన సంప్రదాయాన్ని పాటిస్తూ తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మంత్రులు పెద్దిరెడ్డి, ఆదిమూలపు సురేష్, రోజా, తుడా చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గంగమ్మను శ్రీవేంకటేశ్వరుని సోదరిగా పురాణాలు చెబుతున్నాయి. ఏటా గంగమ్మ జాతర సందర్భంగా తిరుమల శ్రీవారి తరఫున సంప్రదాయంగా గంగమ్మకు సారె పంపుతారు. సీఎం తిరుమల చేరుకునే ముందు గంగమ్మను దర్శించుకునే సంప్రదాయం చాలా దశాబ్దాల తరువాత గత సంవత్సరం నుంచి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి కృషితో పునఃప్రారంభమైంది.

- తిరుమలలోని పద్మావతి అతిథి గృహం ప్రాంతంలో దాతలు రాజేష్‌శర్మ, నరేంద్ర చౌదరి ఇచ్చిన విరాళాలతో టీటీడీ వేర్వేరుగా నిర్మించిన 2 అతిథి గృహాలు వకుళామాత నిలయం, రచన విశ్రాంతి గృహాలను సీఎం ప్రారంభించారు.
- సోమవారం రాత్రి స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో టీటీడీ ముద్రించిన 2024 డైరీలు, క్యాలెండర్లను సీఎం జగన్ ఆవిష్కరించారు. ఇవి సెప్టెంబరు 22 నుంచి తిరుమల, తిరుపతిలో అందుబాటులో ఉంటాయి. అక్టోబరు రెండో వారం నుంచి ఇతర ప్రాంతాల్లో భక్తులకు అందుబాటులో ఉంటాయి.

టెంకాయ కొట్టి వదిలేసిన టీడీపీ సర్కారు

తిరుపతిలో గత ప్రభుత్వం టెంకాయ కొట్టి వదిలేసిన ప్రాజెక్టుని నాలుగేళ్లుగా చేయి పట్టుకుని నడిపిస్తూ శ్రీనివాస సేతుని పూర్తి చేసినట్లు ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. సోమవారం సాయంత్రం శ్రీనివాస సేతు వంతెనను ప్రారంభించిన సీఎం జగన్ ప్రజలకు అంకితం చేశారు. విద్యార్థులకు మరింత మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు నిర్మించిన శ్రీవేంకటేశ్వర కళాశాల హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. 'శ్రీనివాస సేతు ప్రాజెక్టుకు 2019లో ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం టెంకాయ కొట్టి, జీవో ఇచ్చి వదిలేసింది. నాలుగేళ్లలో చిత్తశుద్ధితో పూర్తిచేసి ఇవాళ తిరుపతి ప్రజలకు అంకితం చేస్తున్నాం. దాదాపు రూ.650 కోట్ల వ్యయంతో నిర్మించిన 7 కి.మీ. పొడవైన ఈ ఫ్లైఓవర్‌తో భక్తులకు ఎంతో మేలు జరుగుతుంది. శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కాలేజీ హాస్టళ్లకు సంబంధించి రూ.37.80 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన భవనాలను కూడా ఇవాళ ప్రారంభించుకుంటున్నాం. దీనివల్ల విద్యార్థులకు మరింత మెరుగైన వసతి అందుబాటులోకి రానుంది' అని సీఎం పేర్కొన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..



తిరుపతిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం శిలాఫలకం వద్ద సీఎం

రూ.600 కోట్లతో 7 వేల మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు

అన్నింటికన్నా సంతోషించే విషయం.. టీటీడీలో పనిచేస్తున్న దాదాపు 6,700 మంది ఉద్యోగులకు కచ్చితంగా ఇళ్ల స్థలాలు ఉండాలని, వారికి మంచి చేయాలన్న తపనతో వేగంగా అడుగులు వేశాం. రూ.313 కోట్లను ఖర్చు చేసి 3,518 మందికి ఇవాళ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నాం. మరో రూ.280 కోట్లు ఖర్చు చేసి ఇంకో 3,500 మందికి కూడా ఇళ్ల పట్టాలు ఇవ్వబోతున్నాం. నెల నుంచి 45 రోజుల్లోగా ఇది కూడా పూర్తి చేస్తామని కలెక్టర్ చెప్పారు. దాదాపుగా రూ.600 కోట్లతో సుమారు 7 వేల మంది టీడీపీ ఉద్యోగులందరికీ ఇళ్ల పట్టాలిచ్చి వారి మొహాల్లో సంతోషం చూసే మంచి కార్యక్రమం చేస్తున్నాం.

22 ఏ నుంచి తొలగించి పూర్తి హక్కులు

తిరుపతిలో దాదాపు 8,050 మంది ఇళ్లు కట్టుకుని 22 ఏ సమస్యలో ఇరుక్కుని అమ్ముకోవాలనుకున్నా, పిల్లలకు ఇవ్వాలనుకున్నా కుదరక ఇబ్బంది పడుతున్నారు. కొద్ది రోజుల కిందట వరదల సమయంలో నేను ఇక్కడికి వచ్చినప్పుడు దీన్ని నా దృష్టికి తెచ్చారు. ఆ సమస్యను పరిష్కరించి తిరుపతి ప్రజలకు మంచి చేస్తూ 22–ఏ నుంచి వాటిని డిలీట్ చేయించాం. చంద్రగిరిలో కూడా 2,500 మందిని 22–ఏ నుంచి డిలీట్ చేసి వారికి కూడా ఉపశమనం కలిగించాం. దేవుడి దయతో వీటన్నింటి వల్లా మంచి కోరుకుంటూ దాదాపు రూ.1,300 కోట్లకు సంబంధించిన పలు కార్యక్రమాలను ప్రారంభించుకుంటున్నాం.

యువతిని ఆదుకున్న 'దిశ'

కందుకూరు: దిశ యాప్ ఆపదలో ఉన్న మహిళల పట్ల ఆపద్బాంధవునిగా మారింది. సోమవారం అర్ధరాత్రి నెల్లూరు జిల్లా కందుకూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దూబగుంట గ్రామం వద్ద ఓ యువతి అనుమానాస్పదంగా తిరుగుతుందని బ్రహ్మయ్య అనే యువకుడు దిశ యాప్‌కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. వెంటనే రూరల్ పోలీస్ సిబ్బంది అక్కడికి వెళ్లి ఆ యువతిని ప్రశ్నించారు. తాను మదనపల్లి నుంచి విజయవాడ వెళ్తూ కందుకూరులో బస్సు దిగానని, ఎటువెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపింది. పోలీసులు.. ఆమెను ఒంగోలులోని సఖి సెంటర్‌కు తరలించి మదనపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు.


యువతి నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

పోలీసులపై టీడీపీ గూండాల దాడి

- నరసరావుపేటలో అనుమతి లేకుండా ర్యాలీ
- అడ్డుకున్న పోలీసులపై దౌర్జన్యం..
- ఏఎస్‌ఐ సహా పలువురు పోలీసులకు గాయాలు
- 20 మందిపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: పోలీసులపై మరోసారి టీడీపీ గూండాలు దాడులకు పాల్పడ్డారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన ఈ ఘటనలో పలువురు పోలీసులు గాయపడ్డారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మంగళవారం నరసరావుపేట ప్రకాశ్‌నగర్‌లో డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావుకు చెందిన వైద్యశాల ప్రాంగణంలో హోమం చేపట్టారు. ఒక్కసారిగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవిందబాబు, కడియాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు హోమం జరుగుతున్న స్థలం నుంచి మెయిన్‌రోడ్డు పై ఓవర్ బ్రిడ్జి వైపునకు వచ్చేందుకు ప్రయత్నించారు. అక్కడ విధుల్లో ఉన్న సీఐ అశోక్‌కుమార్, సిబ్బంది అడ్డుకుని అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించవద్దని కోరారు. టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయి పోలీసుల చొక్కాలు పట్టుకుని నెట్టివేశారు. దీంతో కిందపడిన స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బందితోపాటు వన్‌టౌన్ ఏఎస్‌ఐ మీరావలికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులను నెట్టివేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేసుకూంటూ ర్యాలీగా పై ఓవర్ బ్రిడ్జిపైకి చేరారు. అక్కడ నిలువరించేందుకు ప్రయత్నించిన స్పెషల్ పార్టీ పోలీసులపైనా దాడికి పాల్పడ్డారు. అనుమతి లేకుండా టీడీపీ చేపట్టిన ర్యాలీ కారణంగా ఆర్టీసీ బస్టాండ్, మల్లమ్మ సెంటర్, ఓవర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు దాడికి పాల్పడిన 20 మంది టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరసరావుపేట వన్‌టౌన్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

డోలీ కష్టాలకు చెక్

గిరిశిఖర గ్రామాల్లో ప్రగతి బాటలు • శరవేగంగా రోడ్డు పనులు

శృంగవరపుకోట: గిరిశిఖర గ్రామాల్లో డోలీ మోతలు ఇకపై కనిపించవని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ కృషితో గిరిశిఖర గ్రామాలకు చేరుకునేందుకు మార్గం సుగమమవుతోందని చెప్పారు. కొండ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు చకచకా సాగుతున్నాయని, దీనికి విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలోని దబ్బగుంట నుంచి పల్లపుదుంగాడకు వేస్తున్న రోడ్డే నిదర్శనమని అన్నారు. ధారపర్తి పంచాయతీ పరిధిలోని గిరిశిఖర గ్రామాలైన దారపర్తి, పల్లపుదుంగాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరించారు. పథకాల అందుతున్న తీరును గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. పల్లపుదుంగాడలో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ 2019లో ఎన్నికల సమయంలో గ్రామానికి వచ్చినపుడు ప్రాణాల మీదికి వస్తే డోలీ మోతలే దిక్కు అని, దబ్బగుంట నుంచి పల్లపుదుంగాడకు రోడ్డు వేయమని గిరిజనులు అడిగారన్నారు. ఆ మేరకు అటవీశాఖ అనుమతులు సాధించి దబ్బగుంట నుంచి పల్లపుదుంగాడకు ఐదు కిలోమీటర్ల రోడ్డును రూ.4.50 కోట్లతో ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. పల్లపుదుంగాడ నుంచి దారపర్తి వరకూ మరో 6 కి.మీ మేర రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. జల్‌జీవన్ మిషన్ కింద పల్లపుదుంగాడలో ప్రతి ఇంటికి కుళాయిలు వేసి తాగునీరు ఇచ్చామని.. పొర్లు, కురిడి, గూనపాడు, ధారపర్తి గ్రామాల్లో కుళాయిలు వేసే పనులు జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం ధారపర్తి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు పాల్గొన్నారు.


దబ్బగుంట-పల్లపుదుంగాడ రోడ్డుపై బైక్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

వాల్తేర్ రైల్వే డివిజన్‌కు అవార్డు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ప్రసుత ఆర్థిక సంవత్సరం ఆగస్టు నెల ముగిసే నాటికి వాల్తేర్ రైల్వే డివిజన్ అత్యధిక సరకు రవాణా చేసి ఉత్తమ అవార్డు దక్కించుకుంది.మంగళవారం న్యూఢిల్లీలోని రైల్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి దర్శనా జర్దోష్ చేతుల మీదుగా వాల్తేర్ డివిజన్ తరఫున సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్ అవార్డు (ప్రశంసాపత్రం) అందుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు వాల్తేర్ డివిజన్ 33.37 మిలియన్ టన్నుల సరుకును లోడింగ్ చేసింది. గతేడాది ఇదే సమయంతో పోల్చితే ఇది 10.35 శాతం అధికమని రైల్వే అధికారులు తెలిపారు. లోడింగ్ ఆదాయం విషయంలోనూ ఇప్పటివరకు వాల్తేర్ డివిజన్ రూ.3,653 కోట్లు ఆర్జించింది. గత సంవత్సరం ఈ సమయానికి ఇది కేవలం 3,103 కోట్లు మాత్రమే. ఈ ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఈ రికార్డును బట్టి వాల్తేర్ డివిజన్‌ను, ప్రత్యేకంగా ఆపరేషన్స్ బృందాన్ని వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ అభినందించారు.



నిన్ను ద్వేషించేవాళ్ల కన్నా, నీ అందరి శత్రువుల కన్నా, నీకు ఎక్కువ కీడు చేసేది నీ క్రమశిక్షణ లేని మనసే.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 20 సెప్టెంబర్ 2023

సరికొత్త సంకల్పంతో...

ఎన్నో కీలక ఘట్టాలకు వేదికైన పాత పార్లమెంటు భవనం చరిత్ర ముగిసి, కొత్త పార్లమెంటు భవనం అందుబాటులోకొచ్చింది. అయిదురోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు సోమవారం పాత భవనంలోనే ప్రారంభమైనా, రెండోరోజు కొత్త భవనంలోకి మారాయి. ఇకపై పాత భవనం సంవిధాన్ భవన్‌గా పేరు మార్చుకుని భవిష్యత్తు తరాలకు ఉత్తేజాన్నందిస్తూంటుందని మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆయనన్నట్టు దేశ ప్రజాతంత్ర యాత్రలో సామాన్య పౌరుల సంపూర్ణ విశ్వాసాన్ని చూరగొన్న చరిత్ర పార్లమెంటుది. ఇక్కడే వేలాది చట్టాలపై ఎడతెగని చర్చలు జరిగాయి. ఎన్నో కీలక నిర్ణయాలు రూపుదిద్దుకున్నాయి. ఈ క్రమంలో రాజకీయ పక్షాల మధ్య వాగ్యుద్ధాలు చోటుచేసుకున్నాయి. రాజీలేని ధోరణిలో వాద ప్రతివాదాలు సాగాయి. ఎన్నెన్నో భావోద్వేగాలకు అది వేదికైంది. అదే సమయంలో కీలక సందర్భాల్లో బలమైన స్వరాన్ని వినిపించలేని దాని అశక్తత నిరంకుశ చట్టాలకు కూడా కారణమైంది. అది మౌనం వహించటంవల్ల పాలకపక్షం ఆత్యయిక స్థితి పేరిట దేశ ప్రజల గొంతు నొక్కటానికి అవకాశం ఏర్పడింది. తొలినాళ్లలో ఆరోగ్యకరమైన చర్చలకు చోటిచ్చిన సభే రాను రాను ఉత్త ఉపన్యాస వేదికగా, అప్పుడప్పుడు బలప్రదర్శన రంగస్థలిగా మారుతోంది. దేశ ప్రజాస్వామ్య నిర్మాణంలో తమకూ భాగస్వామ్యం ఉన్నదని... తమ ఆశలూ, ఆకాంక్షలూ వ్యక్తమవుతున్నాయని సామాన్యులు భావించటానికి వీల్లేని స్థితిగతులు నెలకొంటున్నాయి. ఏ విధాన నిర్ణయంలోని మంచిచెడ్డలనైనా ఆరోగ్యకరమైన చర్చల ద్వారా నిగ్గుతేల్చాల్సి వుండగా చాలా నిర్ణయాలు అరుపులూ, కేకల మధ్య మూజువాణి ఓటుతో గట్టెక్కుతున్నాయి. అంతకన్నా దారుణం లక్షల కోట్ల రూపాయలు వ్యయం కాగల ఆర్థిక పద్దులు సైతం గిలెటిన్ అవుతున్నాయి. అవతలి పక్షాన్ని అవహేళన చేయటం, స్వోత్కర్షలకు పోవటం నిత్యకృత్యమైంది. ఇవన్నీ గమనిస్తే నూతన పార్లమెంటు భవనం సరికొత్త ఆశలకూ, విశ్వాసాలకూ అద్దం పడుతుందా అన్నది సందేహాస్పదమే. అది సాధ్యమేనని ప్రధాని తన ప్రసంగంలో బలంగా చెప్పారు. కానీ అధికార, విపక్షాల మధ్య అంతటి సామరస్యత ఏర్పడుతుందా? మన పార్లమెంటు నడతను నిర్దేశిస్తున్న నిబంధనలు సంతృప్తికరంగా లేకపోవటం కూడా సమస్యలకు దారితీస్తోంది. దేన్ని చర్చించాలి...ఏ రూపంలో చర్చించాలన్న అంశాలు తరచు వివాదాస్పదమవుతున్నాయి. సభాధ్యక్షులకుండే విచక్షణాయుత అధికారాలు ఇందుకు దోహదపడుతున్నాయి.

గడిచిన కాలాన్ని బేరీజు వేసుకోకుండా, జరిగిన తప్పొప్పులను నిజాయితీగా సమీక్షించుకోకుండా సరికొత్త ప్రయాణం సులభం కాదు. అధికార, విపక్షాల మధ్య విభేదాలుండటం, అవి ఒక్కోసారి తీవ్ర రూపం దాల్చటం అసాధారణమేమీ కాదు. కానీ సమష్టిగా ఉండటానికి ముందుకు రావలసిన తరుణంలో సైతం పాక్షిక దృక్పథంతో వ్యవహరించే ధోరణి ప్రబలుతోంది. ఎదురు పడినప్పుడు మర్యాదపూర్వకంగా పలకరించుకునే సంస్కృతి కూడా ఆవిరవుతోంది. ఇవన్నీ పార్లమెంటుపై దేశ ప్రజలకుండే విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. మొన్నటికి మొన్న దేశం మొత్తం సిగ్గుతో తలవంచుకోవాల్సిన మణిపూర్ అకృత్యాలపై చర్చ సందర్భంగా అధికార, విపక్షాలు రెండూ వ్యవహరించిన తీరు దిగ్భ్రాంతి కలిగించింది. దీన్ని తప్పించుకునే ధోరణిగా చూడాలా లేక ప్రజల మనోభావాలను అవగాహన చేసుకోవటంలోని అశక్తతగా పరిగణించాలా? సమాజంలో భిన్న వర్గాలున్నప్పుడూ, వాటికి భిన్న ప్రయోజనాలున్నప్పుడూ పార్లమెంటులో అవి ప్రతిబింబించటం వింతేమీ కాదు. నిజానికి అలాంటి వైరుధ్యాలకు సామరస్యపూర్వక పరిష్కారాన్ని కనుగొనటమే ప్రజాతంత్ర సంస్థల లక్ష్యం. కానీ బలం ఉంది కదా అని ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవటం, వాటి మంచిచెడ్డల విశ్లేషణకు అవకాశమీయకుండా అసమ్మతికి పాతరేయటం ఇటీవలి కాలంలో రివాజైంది. పార్లమెంటు సజావుగా సాగటానికి, అక్కడ ఆరోగ్యవంతమైన చర్చలు జరగటానికి ప్రస్తుత పాలక్ష పక్ష కూటమికి నేతృత్వం వహిస్తున్న పార్టీగా బీజేపీపై ఎక్కువ బాధ్యత ఉంటుంది. అధికార పక్షంనుంచి అలాంటి ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు దాన్ని స్వాగతించి తమ వంతుగా సకారాత్మక దృక్పథాన్ని ప్రదర్శించటం విపక్షాల వంతు.

స్వరూపం, సదుపాయాల కోణంలో మాత్రమేకాదు...స్వభావరీత్యా వర్తమాన ప్రగాఢ ఆకాంక్షలకు కూడా నూతన పార్లమెంటు భవనం అద్దం పడుతుందన్న గ్రహింపు ఏర్పడినప్పుడు ఇరు పక్షాలూ విజ్ఞతతో మెలుగుతాయి. ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయంటే, ఒక బిల్లు విషయంలో, ఒక విధాన నిర్ణయం విషయంలో అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయంటే దాన్ని కేవలం రాజకీయ కోణంలో కాక, ప్రజానీకంలో ఏర్పడిన అభిప్రాయానికి ప్రతిబింబంగా చూడగలిగితే చాలా సమస్యలకు పరిష్కారాలు సాధ్యమవుతాయి. ప్రస్తుత పార్లమెంటు భవనం లోక్‌సభలో 888 మంది, రాజ్యసభలో 384 మంది కూర్చొనటానికి అనువుగా ఉంది. సెంట్రల్ హాల్ లేకున్నా, ఉభయసభల ఉమ్మడి సమావేశాల సమయంలో 1,272 మంది కూర్చొనేందుకు లోక్‌సభలో అవకాశం ఉంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం స్థానాలు కల్పించే బిల్లు రాజ్యసభలో మంగళవారం ప్రవేశించటం శుభపరిణామం. బిల్లు ఆమోదం పొంది చట్టమైనా నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే ఇది అమల్లోకి వస్తుందనటం కొంత నిరాశ కలిగిస్తుంది. ఏదేమైనా కొత్త సభా భవనం సరికొత్త ఆచరణకు, సమున్నత సంప్రదాయాలకు వేదిక కాగలదని దేశ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. దాన్ని నెరవేర్చవలసిన బాధ్యత శాసనకర్తలదే.

విప్లవాగ్ని జ్వలితుడు

తలవంచని విప్లవ కవిగా, పెక్కు నిర్బంధాల మధ్యనే ముందుకు సాగుతున్నారు వరవరరావు! 1957–2017 మధ్య కాలంలో ఆయన రాసిన సుమారు 50 కవితలను పెంగ్విన్ రాండమ్ హౌస్ 'వరవరరావు – ఎ లైఫ్ ఇన్ పొయెట్రీ' పేరుతో ఆంగ్లంలో ప్రచురించింది. 'బానిస సమాజం నుంచి బానిస భావం కూడా లేని కమ్యూనిజం' వైపు పయనిస్తున్న 'వరవర'కు తగిన గౌరవం.




ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"లోకంలో మేధావులనుకుంటున్నవారు సహితం పిరికిపందలుగా ఉంటారు. అలాంటి పిరికి పందలకన్నా మనోధైర్యంతో, దమ్ములతో బతకనేర్వడం అతి అరుదైన లక్షణంగా భావించాలి."
– 'వికీలీక్స్' వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజ్

ప్రపంచ దేశాలపై అమెరికా నిరంతర కుట్రలను బహిర్గతం చేసినందుకు జీవితమంతా కష్టాలను కాచి వడబోస్తున్న మహాసంపాదకుడు, ప్రపంచ పాత్రికేయ సింహం... జూలియన్ అసాంజ్. అలాంటి ఒక అరుదైన సింహంగా, తలవంచని విప్లవ కవిగా ఈ క్షణం దాకా పెక్కు నిర్బంధాల మధ్యనే ముందుకు సాగుతున్న కవి వరవరరావు! దఫదఫాలుగా దశాబ్దాలకు మించిన జైళ్ల జీవితంలో ఆయనను (1973లో తొలి అరెస్టు మొదలు) 25 కేసులలో కేంద్ర, రాష్ట్ర పాలకులు ఇబ్బందులు పెట్టారు. అలాంటి విప్లవకవి వరవరరావు తెలుగులో 1957–2017 మధ్య కాలంలో రాసిన సుమారు 50 కవితలను ఎంపిక చేసి... కవి, సాహితీ విమర్శకులు, మానవ హక్కుల పరిరక్షణా ఉద్యమాలకు నిరంతరం చేయూతనందిస్తున్న పాత్రికేయులు ఎస్.వేణుగోపాల్, నవలాకారిణి, కవయిత్రి మీనా కందసామి ఇండియాలోని సుప్రసిద్ధ పెంగ్విన్ రాండమ్ హౌస్ కోరికపై అందజేసిన గ్రంథమే 'వరవరరావు – ఎ లైఫ్ ఇన్ పొయెట్రీ'!

సర్వత్రా 'సామ్యవాద రంకె' వినిపించిన వరవరరావు 1972 లోనే:

'దోపిడీకి మతం లేదు, దోపిడీకి కులం లేదు
దోపిడీకి భాష లేదు, దోపిడీకి జాతి లేదు
దోపిడీకి దేశం లేదు
తిరుగుబాటుకూ, విప్లవానికీ
సరిహద్దులు లేవు' అని చాటుతూనే, తనను శత్రువు కలమూ, కాగితమూ ఎందుకు బంధించాయో తెగేసి చెప్తాడు: 'ప్రజలను సాయుధులను కమ్మన్నందుకు గాదు/ నేనింకా సాయుధుణ్ణి కానందుకు' అన్నప్పుడు జూలియన్ అసాంజ్ చేసిన హెచ్చరికే జ్ఞాపకం వస్తుంది. అంతేగాదు, 'వెనక్కి కాదు, ముందుకే' అన్న కవితలో 'వరవర':



'బానిస సమాజం నుంచి
బానిస భావం కూడా లేని కమ్యూనిజం దాకా
పయనించే ఈ కత్తుల వంతెన మీద
ఎంత దూరం నడిచి వచ్చావు –
ఇంకెంత దూరమైనా ముందుకే సాగు' గాని
వెనకడుగు వెయ్యొద్దని ఉద్బోధిస్తాడు!

ధనస్వామ్య రక్షకులైన పాలకుల దృష్టిలో 'ప్రజాస్వామ్యా'నికి అర్థం లేదని–

'పార్లమెంటు పులి కూడ /పంజాతోనే పాలిస్తూ
సోషలిజం వల్లించుతూనే / ప్రజా రక్తాన్ని తాగేస్తుంద'నీ
నాగుబాము పరిపాలనలో / ప్రజల సొమ్ము పుట్ట పాల'వుతున్న చోటు –
'జలగల్ని వీకేయందే – శాంతి లేదు/ క్రాంతి రాద'ని
నిర్మొహమాటంగా ప్రకటిస్తాడు.

'జీవశక్తి' అంటే ఏమిటో కవితాత్మకంగా మరో చోట ఇలా స్పష్టం చేస్తాడు:

'అన్ని రోజులూ కన్నీళ్లవి కావు / అయినా ఆనంద తీరాలు
ఎప్పుడూ తెలియకుండా / దుఃఖం లోతెట్లా తెలుస్తుంది?
ఆ రోజులూ వస్తాయి / కన్నీళ్లు ఇంద్రధనుస్సులవుతాయి
నెత్తురు వెలుగవుతుంది / జ్ఞాపకం చరిత్ర అవుతుంది
బాధ ప్రజల గాథ అవుతుంది!'

జైలు జీవితానుభవాన్ని సుదీర్ఘ అనుభవం మీద ఎలా చెప్పాడో!

'జైలు జీవితమూ అంగ వైకల్యం లాంటిదే
నీ కంటితో ఈ ప్రపంచాన్ని చూడలేవు
నీ చెవితో వినలేవు, నీ చేయితో స్పృశించలేవు
నీ ప్రపంచంలోకి నువ్వు నడవలేవు
నీవుగా నీ వాళ్ళతో నువ్వు మాట్లాడలేవు
ఎందుకంటే – అనుభూతి సముద్రం పేగు తెగిన అల ఇక్కడ హృదయం!'

ఇప్పటికీ దేశవ్యాపితంగా ప్రజా కార్యకర్తలపైన, పౌరహక్కుల నాయకులపైన యథాతథంగా హింసాకాండ అమలు జరుగుతూనే ఉంది. దానికి ఉదాహరణగా, అనేక రకాలుగా వికలాంగుడైన ప్రజా కార్యకార్త ప్రొఫెసర్ సాయిబాబానే కార్పొరేట్ శక్తుల కన్నా ప్రమాదకరం అన్నట్టుగా పాలకులు వ్యవహరించడం ఏమాత్రం క్షంతవ్యం గాదు!

abkprasad2006@yahoo.co.in

శతవర్ష శోభితుడు

తొంభై మూడేళ్ల వరకూ నిరవధికంగా నటిస్తూ సినీ ప్రేమికుల్ని అలరించిన ఎవర్ గ్రీన్ హీరో అక్కినేని నాగేశ్వరరావు. గుండెకి ఆపరేషన్ జరిగినా నటనలో, నాట్యంలో ఉత్సాహం మరింత పెరిగిందే కానీ, ఇసుమంతైనా తగ్గకపోవడం ఆయన మానసిక స్థైర్యానికి మచ్చుతునక. తెలుగు సినీరంగంలో అక్కినేని 'ఎక్కని ఎత్తుల్లేవు. వెళ్లలేని దూరాల్లేవు.'

సందర్భం



వి.ఎన్. ఆదిత్య

జనన మరణాల మధ్య రెప్పపాటు జీవితకాలంలో, మన చూపు తిప్పుకోకుండా మన నలరించిన ఎందరో మహానుభావుల్లో ప్రముఖులు... తెలుగు సినిమా ఎవర్ గ్రీన్ హీరో అక్కినేని నాగేశ్వరరావు. నాటక రంగం నుంచి నటరాజు వరప్రసాదమైన 'అభినయ' కళ ద్వారా సినిమా రంగంలోకి ప్రవేశించి, తొంభై మూడు సంవత్సరాల వయసు వరకూ నిరవధికంగా నటిస్తూ సినీ ప్రేమికుల్ని, తెలుగు ప్రేక్షకుల్ని అలరించి, తెలుగు హృదయాలలో చిరంజీవిగా కొలువై ఉన్న నటనావతంసుడీయన. పద్మవిభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం వంటివి అక్కినేనిని అలంకరించి తమ గౌరవాలను ఇనుమడింప చేసుకున్నాయి. తన కళని తర్వాత తరాలకి కూడా వారసత్వంగా అందించి అక్కినేని నాగార్జున వంటి సూపర్ స్టార్‌ని, నాగచైతన్య, అఖిల్, సుమంత్, సుశాంత్ వంటి స్టార్లని తయారు చేసి 'అక్కినేని' జయభేరి తరతరాలుగా నినదించేలా చేయడం సామాన్యమైన విషయం కాదు.



1950 నుంచి 60ల మధ్యలోనే 'నాతో సినిమాలు తీయాలనుకుంటే దర్శక, నిర్మాతలు హైదరాబాద్‌కి వచ్చి తీయా'లని నిర్దేశించ గలిగిన 'ఖలేజా' ఉన్న ఏకైక తెలుగు సూపర్ స్టార్ అక్కినేని.

1970ల మధ్య గుండెకి ఆపరేషన్ జరిగినా నటనలో, నాట్యంలో ఉత్సాహం మరింత పెరిగిందే కానీ, ఇసుమంతైనా తగ్గకపోవడం ఆయన మానసిక స్థైర్యానికి మచ్చుతునక. అదే 'గుండె ధైర్యం'తో తన తొంభై ఏళ్ల వయసులో ప్రెస్ మీట్ పెట్టి తనకు క్యాన్సర్ సోకిందనీ, మరెంతో కాలం బతకననీ చెప్పగలగడం స్ఫూర్తిదాయకం. పై మూడు సంఘటనలూ, వయసు మారిందే గానీ, ఆయన వన్నె ఏ మాత్రం తగ్గలేదని నిరూపించాయి.

'ఆడపిల్లలకి చదువులెందుకు? పెళ్లిళ్లు చేసి ఓ అయ్య చేతిలో పెట్టి పంపెయ్యక' అనే పాత కాలపు భావజాలం సమాజంలో అధికంగా ఉన్న రోజుల్లో 'చదువుకున్న అమ్మాయిలు' అనే టైటిల్‌తో స్త్రీలకు విద్య యొక్క ప్రాధాన్యతను తెలిపేలా చిత్రం చేయడం ఆయన ప్రోగ్రెసివ్ థాట్ ప్రాసెస్‌కి తార్కాణం. ఈనాటి 'వుమెన్ ఎంపవర్‌మెంట్' ట్రెండ్‌కి బీజం వేసిన సాంఘిక కార్యకర్తల్లో అక్కినేని కూడా ఒకరు.

విగ్గు, మేకప్పు లేకుండా ఇంట్లోంచి కాలు కూడా బైటికి కదపలేని కళాకారులకి ఆయన 'సీతారామయ్య గారి మనవరాలు' మారుతున్న సినిమా మేకింగ్ విలువలకి ఒక గొప్ప పాఠం. స్టార్ హీరోగా అత్యధిక పారితోషికం అందుకుంటున్న రోజుల్లో 'సుడిగుండాలు' వంటి చిన్న పిల్లల మానసిక సమస్య మీద చిత్రాన్ని నిర్మించి, నటించడం ఆయన సామాజిక బాధ్యతకి, ప్రభావవంతమైన ఆలోచనా పరిణతికి నిదర్శనం. దసరా బుల్లోడు, ప్రేమనగర్, ప్రేమాభిషేకం, ఆత్మగౌరవం, అగ్నిపుత్రుడు, సూత్ర ధారులు, డాక్టర్ చక్రవర్తి, మూగ మనసులు, దేవదాసు, మాంగల్యబలం, విప్రనారాయణ, సువర్ణ సుందరి, కీలుగుర్రం... ఇలా ఏ జోనర్‌లో చూసినా తెలుగు సినిమా కీర్తి కిరీటంలో అక్కినేని పొదుకొచ్చిన కలికి తురాళ్లు కనిపిస్తాయి. మిస్సమ్మ, గుండమ్మ కథ, శ్రీకృష్ణార్జున యుద్ధం వంటి మల్టీ స్టారర్‌లతో తెలుగు సినిమా మార్కెట్ పరిధిని ఇతోధికంగా పెంచడం కూడా ఆయన చేసిన కృషిలో ఒక భాగం. హైదరాబాద్‌లో అన్నపూర్ణ స్టూడియోస్ నెలకొల్పడం, చలన చిత్ర నిర్మాణ సంస్థని ప్రారంభించడం... కొన్ని లక్షలమంది కళాకారుల కలలని సాకారం చేయడానికి ఆయన ఏర్పాటు చేసిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అని చెప్పాలి.

"అక్షరం నేర్చుకోలేదని బాధ ఉంది" అని చెప్తూనే, నిరంతర విద్యార్థిగా తెలుగు, తమిళ, హిందీ, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో అనర్గళంగా మాట్లాడడం, రాయడం, నేర్చుకుని, 'అక్కినేని ఆలోచనలు (అ, ఆలు)' వంటి వచన కవితా సంపుటిని ప్రచురించడం ఆయనలోని క్రమశిక్షణకి, విద్యారంగం పట్ల గౌరవానికి దర్పణం. ముళ్లపూడి వెంకటరమణ గారన్నట్లు–

అక్కినేని నాగేశ్వరరావు / ఎక్కని ఎత్తుల్లేవు / వెళ్లలేని దూరాల్లేవు.

ఆయన కీర్తి, ప్రభావం, ప్రతిభ ప్రయాణించే కాలంలో మన జీవిత కాలం ఒక చిన్న మజిలీ మాత్రమే. ఆయనే శాశ్వతం. శతమానం భవతి. అక్కినేని అభిమానులకి ఆయన శత సంవత్సర జయంతి శుభాకాంక్షలు.

వ్యాసకర్త ప్రముఖ సినీ దర్శకుడు
(నేటి నుంచి అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సంవత్సరం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, **తిథి:** శు.పంచమి ఉ.10.40 వరకు
తదుపరి షష్ఠి, **నక్షత్రం:** విశాఖ ప.12.43 వరకు
తదుపరి అనూరాధ, **వర్జ్యం:** సా.4.43 నుండి 6.21 వరకు,
దుర్ముహూర్తం: ప.11.31 నుండి 12.19 వరకు,
అమృత ఘడియలు: రా.2.23 నుండి 3.56 వరకు.

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.57
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సోషల్ మీడియా

నమ్మితే చాలా?



ఈ రెండు దేశాలు తీవ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నాయని ఇండియా నమ్ముతోంది: పాకిస్తాన్, కెనడా.
– డెరెక్ జె. గ్రాస్‌మన్, ప్రొఫెసర్

సంబంధాలకు దెబ్బ



కెనడా, ఇండియా శత్రుదేశాలు కాదు, మిత్రులు. కానీ కెనడాలోని సిక్కు రాడికల్స్‌తో తన రాజకీయ మైత్రి వల్ల ప్రధాని జస్టిన్ ట్రూడో ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీశారు.
– బ్రహ్మ చెల్లానీ, విశ్లేషకుడు

ఎందుకు చేస్తుంది?



అసలు కెనడాలోని ఒక సిక్కు యాక్టివిస్టును చంపాల్సిన అవసరం ఇండియాకు ఎందుకుంటుంది? ఇది తర్కానికి అందని విషయం. పైగా, పంజాబ్ వేర్పాటువాద ఉద్యమం కూడా ఇప్పుడు అంత చురుగ్గా లేదు కదా!
– ముర్తజా హుస్సేన్, కాలమిస్ట్

రెండు రకాలుగానూ శిక్ష తప్పదు!

అభిప్రాయం



కైలే అనిల్‌కుమార్

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో విద్యార్థులు, ఉద్యోగార్థులకు నాణ్యమైన శిక్షణ ఇచ్చి ఉంటే కొన్ని లక్షల ఉద్యోగాలు వచ్చేవి. ఆ అవకాశాన్ని లేకుండా 'స్కిల్ కుంభకోణాని'కి చంద్రబాబు పాల్పడటంతో లక్షల కుటుంబాలు శాశ్వతంగా నష్టపోయాయి. యువతకు చంద్రబాబు చేసిన అన్యాయం క్షమించరానిది. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను చీకటిమయం చేసిన పాపం ఊరికే పోదు. పక్కా ఆధారాలతో 'స్కిల్ కుంభకోణం'లో దొరికిపోవడంతో చంద్రబాబును ప్రభుత్వం చట్టం ముందు నిలబెట్టింది. 2014–19 మధ్య ఐదు సంవత్సరాల్లో కేవలం విద్యార్థుల జీవితాలనే కాకుండా రాష్ట్ర భవిష్యత్‌నూ సర్వనాశనం చేశారాయన. రాజధాని నుంచి ఫైబర్ గ్రిడ్ వరకు... ఆయన ప్రభుత్వం చేపట్టిన అన్ని కార్యక్రమాలూ, పథకాల్లో అవినీతి, ఆశ్రిత పక్ష పాతం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

ప్రజల సొమ్మును అడ్డంగా దోచేసి దాచేసుకోవాలనే లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం పథకాలూ, కార్యక్రమాలూ చేపట్టినట్లు తేటతెల్లం అవుతోంది. స్కిల్ కుంభకోణం కేవలం తీగ మాత్రమే. ఈ తీగను పట్టుకొని లాగితే చంద్రబాబు అవినీతి సామ్రాజ్యం కదులుతుంది. బాబు నిర్మించిన అవినీతి సామ్రాజ్యం కూలిపోయే రోజు ఎంతో దూరంలో లేదని ప్రజలు విశ్వాసంతో ఉన్నారు. న్యాయస్థానాల్లో శిక్ష పడకుండా బాబు తప్పించుకోలేరు. విద్యార్థుల భవిష్యత్‌ను ఫణంగా పెట్టి స్కిల్ కుంభకోణానికి పాల్పడిన కేసులో న్యాయస్థానం తప్పకుండా శిక్ష విధిస్తుందని విశ్వాసం ఇప్పుడు అందరిలోనూ ఉంది. ప్రజా కోర్టులోనూ శిక్ష తప్పదనే విషయాన్ని బాబు గుర్తించాలి.

ఇప్పటి వరకు వ్యవస్థలను మేనేజ్ చేసే టక్కు టమార విద్య బాబును ఆదుకొంది. ప్రతి దానికీ ఎక్స్‌పైరీ డేట్ అనేది ఒకటి ఉన్నట్లే చంద్రబాబు గజకర్ణ గోకర్ణ విద్యకూ ఎక్స్‌పైరీ డేట్ ముగిసింది. అందుకే రూ. కోట్లు పుచ్చుకొనే బడా అడ్వొకేట్లను ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానాల్లో దించినా, కొమ్ములు తిరిగిన లాయర్లు తమ వాదనా పటిమను న్యాయస్థానాల్లో జడ్జి ముందు ప్రదర్శించినా చంద్రబాబును చట్టం ముందు నిలబెట్టకుండా అడ్డుకోవడం సాధ్యం కాలేదు. అద్భుత వాదనా పటిమ కనపరిచే సామర్థ్యం ఉన్న బడా లాయర్లు కూడా కేసు లోతుపాతుల్లోకి వెళ్లకుండా కేవలం సాంకేతిక పరమైన అంశాలకే పరిమితం కావడం చూస్తుంటే.. అవినీతి చేసి దొరికిపోయామనీ, లోతుపాతుల్లోకి వెళ్లకుండా సాంకేతిక అంశాల మీద బయట పడాలనేది చంద్రబాబు బృందం ఆలోచన అనీ చిన్న పిల్లలకూ తెలిసిపోతోంది.

ఐదేళ్ల రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నాశనం చేసినందుకు ప్రజా న్యాయస్థానంలో టీడీపీకి శిక్ష విధించడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా తన 14 సంవత్సరాల పాలనలో కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా భారీ రిక్రూట్‌మెంట్ చేపట్టలేదు. ప్రాథమిక, సెకండరీ, ఇంటర్ విద్యను పూర్తిగా ప్రయివేటుకు కట్టబెట్టారు. విద్యారంగంలో 'చై–నా' వేళ్లూనుకోవడానికి చంద్రబాబు అనుసరించిన విధానాలు కారణమయ్యాయి. ఫలితంగా విద్య వ్యాపార వస్తువుగా మారిపోవడం, పేద–మధ్య తరగతి ప్రజల రక్తాన్ని పీల్చేయడం మన కళ్లముందు కనిపించిన వాస్తవం. విశ్వవిద్యాలయాలనూ నాశనం చేసి నాణ్యత లేని చదువులతో పేదలకు తీరని అన్యాయం చేసిన బాబుకు ప్రజా కోర్టులో 2019లో ప్రజలు విధించిన శిక్షనే 2024 ఎన్నికల్లోనూ మరోసారి విధించనున్నారు. స్కిల్ కుంభకోణంలోనే కాదు మిగతా కుంభకోణాల్లోనూ కోర్టులు విధించే శిక్షలు అనుభవించడమే చంద్రబాబు ముందున్న ఏకైక మార్గం.

వ్యాసకర్త పామర్రు ఎమ్మెల్యే,
వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు

వారెక్కాల్సిన రైలు జీవిత కాలం లేటు!

సందర్భం



జాన్సన్ చోరగుడి

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థలో జరిగిన ఆర్థిక అవకతవకలు జాతీయ స్థాయి వార్తల్లో చర్చనీయాంశం అయ్యింది. ఈ సంస్థ పనిలో లొసుగులు విషయం అటుంచితే, దీని స్థాపనకు ముందు మూడు దశాబ్దాల కాలం పాటు కుంటుకుంటూ సాగి... గిడసబారిన బడుగు బలహీన నిమ్న వర్గాల యువత ఉపాధి దీన చరిత్రను చూడాల్సి ఉంది.

రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న కాలంలో 1985లో ఇండియాలో కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ఏర్పడింది. ఇది జరిగాక, విద్యను ఉపాధి కేంద్రిత దృష్టితో చూడడం మొదలయింది. అంతకు ముందు అది– 'జ్ఞానం' కేంద్రంగా ఉండేది. ఈ శాఖ ఏర్పడిన తర్వాత మానవీయ శాస్త్రాల నుండి వాణిజ్య, శాస్త్ర– సాంకేతిక విద్య వరకు అన్నింటినీ ఒక గొడుగు కింది చేర్చి చూడడం మొదలయింది. అలా తొలి మానవ వనరుల శాఖ మంత్రి పీవీ నరసింహారావు ఆ తర్వాత ప్రధానమంత్రి అయ్యాక, 1991లో మొదలైన ఆర్థిక సంస్కరణలలో మన– 'మానవ వనరుల' దృష్టికి ద్రవరూపం ఏర్పడి, అది అన్ని అభివృద్ధి – సంక్షేమ పార్శ్వాల్లోకి ప్రవహించడం మొదలయింది. చివరిగా అప్పటి ప్రధాని మన్మోహన్ 'సీఐఐ' వంటి వేదికల మీద ఉపాధి అవకాశాల కల్పన పెంచమని పారిశ్రామిక వేత్తలను కోరడం ఈ మొత్తం పరిణామాలకు ముగింపుగా చూడాల్సి ఉంటుంది.

ఈ కాలంలోనే పట్టణాభివృద్ధి, విద్యుత్తు, కమ్యూనికేషన్స్, పారిశ్రామిక, ఇరిగేషన్ రంగాల్లో 'ఇంజనీరింగ్' విద్య అవసరం బాగా పెరిగింది. దాంతో మానవ వనరుల అవసరాన్ని 'డిమాండ్ – సప్లయ్' దృష్టితో చూడడం మొదలయింది. రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు, వనరుల సహకారంతో ప్రయివేట్ రంగంలో ఇంజనీరింగ్ కాలేజీలు మొదలై అవి లాభసాటి వ్యాపారంగా మారడంతో మన (ఉమ్మడి) రాష్ట్రంలో ఆ కోర్సుల్లోకి ప్రవేశం ఖరీదు అయ్యింది. దాంతో 2000 నాటికి ఇంజనీరింగ్ కాలేజీల 'గ్రేడింగ్'ను బట్టి ఎంపిక చేసుకున్న వాటిలో తల్లితండ్రులు తమ పిల్లల్ని చేర్చడం మొదలయింది. ఆ దశలో స్థోమతు లేని పిల్లలకు 2004 తర్వాత వైఎస్సార్ ప్రభుత్వంలో– 'ఫీజ్ రీయింబర్స్‌మెంట్' పథకం అందు బాటులోకి వచ్చాక; పెద్ద ఎత్తున అన్ని ఆర్థిక స్థాయుల్లోని పిల్లలు వీటిలో చదివి దేశ విదేశాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందారు.

ఎప్పుడైతే సాంకేతిక విద్య 'మార్కెట్' ప్రతిపాదికగా



మారిందో, అప్పుడు వీరి ఉపాధి అవకాశాలు 'ఫస్ట్–కమ్–ఫస్ట్' వడ్డనగా తయారైంది. అప్పటికే ఇంజనీరింగ్ డిగ్రీ మాత్రమే చాలదు ఎంబీఏ ఉండాలనీ, ఎమ్‌టెక్ తప్పనిసరి అనీ, కాదు అమెరికాలో ఎమ్ఎస్ ఉండాలి అనే భిన్న ధోరణులు సాంకేతిక విద్య మార్కెట్లో వ్యాపించాయి. చివరికి ఇంజనీరింగ్ డిగ్రీ ఉన్నప్పటికీ పలు స్థాయుల్లో జరిగే 'ఎలిజిబిలిటీ టెస్ట్' పాసైతేనే ఉద్యోగం అనే పరిస్థితి దాపురించింది. ఫలితంగా ఆలస్యంగా ఇందులోకి వచ్చిన అంతంత మాత్రపు చదువులున్న తల్లిదండ్రులకు వారి పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. అప్పటికే 'హ్యూమానిటీస్' డిగ్రీలకు ఉద్యోగ మార్గాలు మూసుకు పోయాయి. ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లీష్ మీడియం చదువు పునాది లేకపోవడం, కమ్యూనికేషన్ స్కిల్స్ కరవు కావడం, గ్రామీణ నేపథ్యం, వంటివి వీరి ఉపాధికి అవరోధాలు అయ్యాయి. 2007లో శేఖర్ కమ్ముల తీసిన 'హేపీ డేస్' సినిమాలో 'కేంపస్ సెలక్షన్స్'లో ఉత్తరాంధ్ర గ్రామీణ విద్యార్థి పడిన పాట్లు ఈ పరిస్థితికి అద్దం పట్టాయి.

డిగ్రీ 'సర్టిఫికెట్' ఉండికూడా కేవలం 'స్కిల్స్' లేక కుటుంబ పోషణార్థం 'మార్కెటింగ్ ఎగిక్యూటివ్', 'రియల్ ఎస్టేట్ ప్రమోటర్' వంటి దుఃస్థితిలో వీరు ఉండిపోయారు. ఇటువంటి ఉపాధి దుఃస్థితి నేపథ్యంలో 2014లో రాష్ట్ర విభజన జరిగాక, టీడీపీ ఏపీలో తన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇటువంటి చర్యను సంక్షేమం అనుకుందో లేదా అభివృద్ధి అనుకుందో తెలియదు గానీ; పైన చెప్పుకున్న దయనీయ స్థితిలో ఉంటూ ఉపాధి వెతుక్కుంటున్న యువత కోసం 'ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్' ఏర్పాటు చేసింది. చివరికి 2014–19 మధ్య ఈ కార్పొరేషన్ నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు వచ్చాయి. అయితే కాలం ఎవరి కోసం ఆగదు కనుక 'ఫస్ట్–కమ్–ఫస్ట్' అనేది అన్ని కాలాల్లోనూ ఉంటుంది.

ఈ జూలై రెండో వారంలో జరిగిన యూనివర్సిటీ వైస్–ఛాన్సలర్ల సమావేశంలో సీఎం జగన్ మాట్లాడుతూ – సాంకేతిక విద్యా రంగంలో నూతన పోకడలతో (ఎమర్జింగ్ టెక్నాల జీస్) సిలబస్‌లను రూపొందించాలని కోరారు. ప్రపంచం ఇలా ముందుకు పోతుంటే, కేవలం 'స్కిల్స్' లేక మిగిలిపోతున్న పిల్లలు భవిష్యత్తు ఒక జీవిత కాలం లేటు కావడం అనేది, ఇప్పటికైనా ఈ 'స్కిల్' కుంభకోణం ఉదంతంలో మనకు కనిపిస్తుందా?

వ్యాసకర్త అభివృద్ధి–సామాజిక అంశాల వ్యాఖ్యాత

15 నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు

9 రోజులు 10 అలంకారాల్లో అమ్మవారి దర్శనం



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 15–23 వరకు దసరా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ తెలిపారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లు, అమ్మవారి అలంకరణ వివరాలను చైర్మన్, ఈవో, వైదిక కమిటీ సభ్యులు మంగళవారం ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో మీడియాకు చెప్పారు. దసరా ఉత్సవాలకు 6 లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశముందన్నారు. 9 రోజుల పాటు అమ్మవారు 10 విశేష అలంకారాల్లో దర్శనమిస్తారని తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా మహాచండీదేవిగా అలంకరించనున్నారు. 20న మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారికి సీఎం వైఎస్ జగన్ పట్టువస్త్రాలను సమర్పిస్తారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొండ చరియలు విరిగి పడటంతో ఆయా ప్రదేశాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.

దసరా ఉత్సవాల విశేష అలంకారాలివే..

15వ తేదీ శ్రీబాలా త్రిపుర సుందరీదేవి, 16న గాయత్రీదేవి, 17న శ్రీ అన్నపూర్ణాదేవి, 18న శ్రీమహాలక్ష్మీదేవి, 19న శ్రీమహాచండీదేవి, 20న మూలా నక్షత్రం శ్రీ సరస్వతీదేవి, 21న శ్రీ లలితాత్రిపుర సుందరీదేవి, 22న శ్రీ దుర్గాదేవి, 23న ఉదయం 12 గంటల వరకు శ్రీ మహిషాసురమర్దినీదేవి, మధ్యాహ్నం 2 గంటల నుంచి శ్రీ రాజరాజేశ్వరీదేవి.

'కుబేర' గణపతి



ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పాతబస్తీలోని బాలగణపతి మందిరంలో స్వామి వారు సోమవారం కుబేర గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోటి రూపాయల విలువైన బంగారు ఆభరణాలతో స్వామిని అలంకరించారు. శేష వాహనంపై స్వామిని వేంచేయించి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి లక్ష్మీవెంకటకృష్ణారావు పర్యవేక్షించారు.

– వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ)

'విజయోస్తు జగన్' సైకత శిల్పం



వినాయక చవితి పండుగ నాడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి పర్యటనను పురస్కరించుకుని తిరుపతి జిల్లాకు చెందిన సైకత శిల్పకారుడు మంచాల సనత్‌కుమార్ ఏరూరు సమీపంలోని సముద్ర తీరంలో సోమవారం 'విజయోస్తు జగన్' అంటూ ఏర్పాటు చేసిన సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. గణపతి తన తొండంతో వైఎస్ జగన్‌ను ఆశీర్వదిస్తున్నట్లుగా ఆ సైకత శిల్పాన్ని రూపొందించారు.

– చిల్లకూరు(తిరుపతి జిల్లా)

బ్రహ్మోత్సవ వైభవం చూతము రారండి..!

తిరుమలలో ధ్వజారోహణంతో ముక్కోటి దేవతలకు ఆహ్వానం

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల ఆరంభానికి నాందిగా ఆలయంలో సోమవారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు సాయంత్రం మీన లగ్నంలో వైఖానస ఆగమోక్తంగా పవిత్ర గరుడ పతాకాన్ని (ధ్వజపటం) బంగారు ధ్వజస్తంభ శిఖరాగ్రానికి ఆవిష్కరించి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. నిర్ణీత కొలతతో కూడిన కొత్త వస్త్రం మీద స్వామి వాహనమైన గరుడ బొమ్మను చిత్రీకరించారు. ఉత్సవమూర్తులైన మలయప్ప, శ్రీదేవి, భూదేవి సమక్షంలో గోధూళి వేళలో కంకణ భట్టాచార్యులుగా రామకృష్ణ దీక్షితులు క్రతువును నిర్వహించి పతాకావిష్కరణ చేశారు. అంతకుముందు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన మలయప్ప పరివార దేవతలైన ఆదిశేషుడు, గరుత్మంతుడు, విష్వక్సేనుడు, గరుడ ధ్వజం, సుదర్శన చక్రత్తాళ్వార్‌తో కలిసి ఆలయ పురవీధుల్లో ఊరేగారు.



పెద్ద శేష వాహనంపై పురుషోత్తముని అభయం

సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజైన సోమవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు 7 తలల స్వర్ణశేషవాహనంపై (పెద్ద శేషవాహనం) వైకుంఠనాథుని అలంకారంలో మాడవీధుల్లో భక్తులను అనుగ్రహించారు. మంగళవారం ఉదయం స్వామివారు 5 తలల చిన్నశేష వాహనంపై ద్వారక కృష్ణుడి అలంకారంలో, రాత్రి హంస వాహనంపై సరస్వతిదేవి రూపంలో భక్తులను కటాక్షించారు. అంతకుముందు కొలువు మండపంలో స్వామివారు ఊయలూగుతూ దర్శనమిచ్చారు.

నేటి నుంచి 'వైజాగ్ ఓపెన్ గోల్ఫ్'

విశాఖ స్పోర్ట్స్: ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఇండియా(పీజీటీఐ) ఆధ్వర్యంలో వైజాగ్ ఓపెన్ గోల్ఫ్ 2023 టోర్నీ బుధవారం ప్రారంభం కానుంది. ప్రొఫెషనల్ గోల్ఫ్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో పీజీటీఐ టోర్నీలు నిర్వహిస్తుండగా, విశాఖ ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ వేదికగా నాలుగు రోజుల పాటు నాలుగు రౌండ్ల స్ట్రోక్ ప్లే ప్రధాన టోర్నీ జరగనుంది. భారత్‌తో పాటు శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌కు చెందిన మేటి గోల్ఫర్స్ 126 మంది పాల్గొనున్నారు. మెరిట్ చాంపియన్‌గా ఉదయాన్ మనే తలపడనుండగా టోర్నమెంట్ విన్నర్స్ హోదాలో మరో పది మంది పోటీపడనున్నారు. వీరంతా పీజీటీఐ గత టోర్నీల్లో విజేతలుగా నిలిచిన వారే. వీరంతా భారత్‌కు చెందిన వారే కానుండగా, గతవారం కోయంబత్తూరులో జరిగిన టోర్నీలో సమఉజ్జీగా నిలిచిన హర్షజీత్, ఓం ప్రకాష్ ఈ కేటగిరిలోనే తలపడుతున్నారు. మెరిట్ ఆర్డర్‌లో శ్రీలంకకు చెందిన తంగరాజా 24వ స్థానంలో, మిథున్ పెరీరా 26వ స్థానంలో, బంగ్లాదేశ్‌కు చెందిన బాదన్ హుస్సేన్ 34వ స్థానంలో, నేపాల్‌కు చెందిన సుక్రా బహదూర్ రాయ్ 63వ స్థానంలో పోటీకి సిద్ధమయ్యారు. బుధవారం 42 మ్యాచ్‌లు రెండు సెషన్స్‌గా జరగనుండగా.. ప్రతీ టీలో ముగ్గురు ఆటగాళ్లు పోటీపడనున్నారు. ప్రతీ టీ పది నిమిషాల విరామంతో ప్రారంభం కానుండగా, 42వదైన చివరి టీ 12.50కి ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో సత్తాచాటిన వారికి కోటి రూపాయల ప్రైజ్‌మనీ అందించనున్నారు. అలాగే గోల్ఫర్స్ తమ ర్యాంకింగ్‌ను మెరుగుపర్చుకునేందుకు, అంతర్జాతీయ టోర్నీలో అర్హత సాధించేందుకు దోహదపడనుంది.

• దివంగత మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు సోదరుడు, ప్రముఖ పర్యావరణవేత్త కెప్టెన్ జి.రామారావు (94) మంగళవారం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు బుధవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో జరుగుతాయని వెంగళరావు తనయుడు జలగం ప్రసాదరావు వెల్లడించారు.

సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

నేటి నుంచి 4 రోజుల పాటు నిర్వహణ

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో బుధవారం నుంచి నాలుగు రోజులపాటు ప్రత్యేక ఆధార్ క్యాంపులను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ మేరకు 20, 21, 22, 23 తేదీల్లో క్యాంపుల నిర్వహణ కోసం సచివాలయాల్లో తగిన ఏర్పాట్లు చేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ లక్ష్మీశ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్యాంపుల్లో కొత్త ఆధార్ కార్డుల జారీతో పాటు ఇప్పటికే ఆధార్ కార్డులు ఉన్నవారు తమ వివరాలను మార్పులు, చేర్పులు చేసుకునేందుకు వీలుగా సేవలు అందిస్తారు. ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు పూర్తయినా ఒక్కసారి కూడా తమ ఫొటో, అడ్రస్ వంటి వివరాలు అప్‌డేట్ చేసుకోనివారు భవిష్యత్ అవసరాల దృష్ట్యా తప్పనిసరిగా మార్పులు, చేర్పులు చేసుకోవాలని ఆధార్ కార్డులను జారీచేసే సంస్థ యూఐడీఏఐ ఉత్తర్వులు చేసిన విషయం తెలిసిందే. ఆధార్ కార్డు తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే అడ్రస్‌లో ఉన్నప్పటికీ అప్‌డేట్ చేసుకోవాలని స్పష్టంచేసింది. అయితే మన రాష్ట్రంలో ఇప్పటికీ 1,49,05,982 మంది ఆధార్ కార్డుల్లో తమ అడ్రస్, ఫొటో వివరాలు ఒక్కసారి కూడా అప్‌డేట్ చేసుకోలేదని లక్ష్మీశ తెలిపారు. ప్రభుత్వం సచివాలయాల ద్వారా ప్రతి నెలా నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపులను ఉపయోగించుకుని వందశాతం ఆధార్ అప్‌డేట్ ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్లకు సూచించారు.

గణనాథుని బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

- మూషిక పటాన్ని ఎగురవేసిన ఆలయ అర్చకులు
- హంస వాహనంపై విహరించిన వినాయకుడు

యాదమరి (చిత్తూరు జిల్లా): కాణిపాక శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో మంగళవారం ప్రారంభమయ్యాయి. 9 రోజుల పాటు నవరాత్రి బ్రహ్మోత్సవాలు, 12 రోజుల పాటు ప్రత్యేక ఉత్సవాలకు అర్చకులు శేఖర్ గురుకుల్, వేదపండితులు సుబ్బారావు పూజలు చేశారు. ఉదయం ఆలయ ప్రాంగణంలోని అన్వేటి మండపంలో స్వర్ణ ధ్వజస్తంభం వద్ద మూషికపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానించడం కోసం ధ్వజస్తంభానికి క్షీర, చందన, ఇతర ద్రవాలతో అభిషేకం చేశారు. ఈ ఉత్సవాలకు ఉభయదారులుగా కాణిపాకం, అగరంపల్లె, కారకాంపల్లె, వడ్రాంపల్లె, తిరువణంపల్లె గ్రామాలకు చెందిన శీర్ కరుణీక వంశస్తులు వ్యవహరించారు. సిద్ధి, బుద్ధి, వినాయక స్వామి ఉత్సవమూర్తులను ఆలయ అన్వేటి మండపంలో పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించి పుర వీధులలో ఊరేగించారు. రాత్రి ఆలయాధికారులు ఉభయదారులు మేళతాళాలతో ఊరేగింపుగా స్వామివారిని తీసుకువచ్చి పుష్పాలతో అలంకరించిన హంస వాహనంపై ఆసీనులు చేయగా... స్వామివారు దానిపై విహరించారు.



స్వామివారికి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు బాబు, వెంకటేగౌడ్ తదితరులు

పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పెద్దిరెడ్డి

వినాయకుడికి సోమవారం ప్రభుత్వం తరఫున రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో చవితిరోజు రాష్ట్ర ప్రభుత్వం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఈ ఏడాది మంత్రి పెద్దిరెడ్డితో పాటు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఎమ్మెల్యే వెంకటేగౌడ్ ఊరేగింపుగా పట్టువస్త్రాలను తీసుకువెళ్లారు. వీరికి ఆలయ చైర్మన్, ఈవో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వాదాలు చేయించి, ప్రసాదం, చిత్రపటం అందించారు. మంత్రి పెద్దిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించడం తన పూర్వజన్మ సుకృతమన్నారు.

సత్యదేవుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయంలో కుటుంబ సభ్యులతో న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

అన్నవరం: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ సోమవారం కాకినాడ జిల్లా రత్నగిరిపై సత్యదేవుడిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేశారు.

శ్రీవారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు

తిరుమల: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం తరువాత ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన చిన్న శేష వాహన సేవలో పాల్గొన్నారు.

గాజువాకలో 117 అడుగుల భారీ గణపతి



పాతగాజువాక లంకా మైదానంలో ఎస్‌వీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో 117 అడుగుల భారీ పంచముఖ మహాగణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే ఎత్తయిన విగ్రహం కావడంతో భక్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ విగ్రహానికి 21 రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ నిర్వాహకుడు కొసిరెడ్డి గణేష్‌కుమార్ తెలిపారు.

– గాజువాక

నకిలీ ఎన్‌వోసీలు సృష్టించిన 'సినర్జీ'

విచారణ చేపట్టాలని సీబీఐ, కస్టమ్స్ అధికారులకు వీపీఏ లేఖ

దొండపర్తి: విశాఖ పోర్టులో ఫోర్జరీ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ల (ఎన్‌వోసీ) వ్యవహారం కలకలం రేపుతోంది. సినర్జీ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పోర్టు లెటర్ హెడ్‌తో పాటు సంతకాలను ఫోర్జరీ చేసినట్లు పోర్టు అధికారులు గుర్తించారు. దీనిపై సదరు షిప్పింగ్ సంస్థకు షోకాజ్ నోటీసు జారీ చేసి హార్బర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై లోతైన విచారణ చేపట్టాలని కస్టమ్స్, సీబీఐను అభ్యర్థించారు. సినర్జీ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కస్టమ్స్ కమిషనర్ నుంచి పబ్లిక్ బాండింగ్ లైసెన్స్ పొందేందుకు విశాఖ పోర్టు అథారిటీ(వీపీఏ) ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్ జారీ చేసినట్లు నకిలీ లెటర్‌హెడ్, సంతకాలతో ఎన్‌వోసీలను తయారు చేసి వాటిని కస్టమ్స్ అధికారులకు సమర్పించింది. ఇలా ఇచ్చిన 7 ఎన్‌వోసీల వాస్తవికతను ధ్రువీకరించాలని కస్టమ్స్ కమిషనర్ పోర్టు అధికారులకు లేఖ రాశారు. వాటిని పరిశీలించిన పోర్టు అధికారులు 7 ఎన్‌ఓసీల్లో 6 ఫోర్జరీవిగా గుర్తించారు. పోర్ట్ లెటర్ హెడ్‌తో పాటు అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మకం

సాక్షి, అమరావతి: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చేపట్టిన బిల్లు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదం పొందటం చరిత్రాత్మకమని రాష్ట్ర డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఈమేరకు ప్రధాని మోదీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే రాజ్యసభలో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో కూడా ఆమోదం పొందుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందటం ద్వారా చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం మరింత పెరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారత కోసం అనేక చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత నిస్తుందని పేర్కొన్నారు.


సెంట్రల్ హాల్‌లో శరద్‌పవార్ తదితరులతో మోదీ


ఖర్గేతో కరచాలనం


మోదీకి సోనియా అభివాదం. చిత్రంలో అధీర్, మిథున్‌రెడ్డి తదితరులు


రాజ్యాంగ ప్రతితో కొత్త భవనంలోకి వెళ్తున్న విపక్ష నేతలు

నారీ శక్తికి వందనం

దశాబ్దాల ఎదురు చూపులకు తెరదించిన కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ ముందుకు మహిళా రిజర్వేషన్ బిల్లు


మంగళవారం కొత్త ప్రాంగణంలో కొలువు దీరిన లోక్‌సభ

న్యూఢిల్లీ: దేశంలో మహిళల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, వారి ఆకాంక్షను నెరవేరుస్తూ, లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 'నారీశక్తి వందన్ అధినియమ్' బిల్లును కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో రెండో రోజు, పార్లమెంట్ నూతన భవనంలో ఉభయ సభలు కొలువుదీరిన మొదటి రోజు మంగళవారం కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ మహిళా రిజర్వేషన్లకు సంబంధించి 'రాజ్యాంగ(128వ సవరణ) బిల్లు–2023'ను దిగువ సభలో ప్రవేశపెట్టారు. ముందు రోజే.. అంటే సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఆమోద ముద్ర వేశారు. బిల్లుపై బుధవారం లోక్‌సభలో కీలక చర్చ జరుగనుంది. గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. పార్లమెంట్ నూతన భవనంలో లోక్‌సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొట్టమొదటి బిల్లుగా మహిళా రిజర్వేషన్ బిల్లు రికార్డు కెక్కింది. ఉభయ సభల ఆమోదం, ఆ తర్వాత రాష్ట్రపతి సంతకంతో బిల్లు చట్టంగా మారనుంది.

మహిళా కోటా ఇప్పుడే కాదు

జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్ల చట్టం అమల్లోకి రానుంది. అంటే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలయ్యే అవకాశం లేదు. 2029 లోక్‌సభ ఎన్నికల్లో అమల్లోకి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. 2027 తర్వాతే చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు అమలవుతాయని ప్రధాని నరేంద్ర మోదీ సంకేతాలిచ్చారు. మహిళల కోటా బిల్లు చట్టంగా మారిన తర్వాత 15 సంవత్సరాలపాటు అమల్లో ఉంటుంది. ఆ తర్వాత కాల వ్యవధిని పొడిగించవచ్చు. 1996 నుంచి.. గత 27 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఎట్టకేలకు మోక్షం లభిస్తుండడం పట్ల ప్రజాస్వామ్యవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికార ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతోపాటు పలు విపక్షాలు సైతం ఈ బిల్లుకు మద్దతు ప్రకటించాయి. పార్లమెంట్‌లో బిల్లు సునాయాసంగా ఆమోదం పొందడం ఖాయమేనని చెప్పొచ్చు. మహిళా రిజర్వేషన్ బిల్లు ముమ్మాటికీ తమదేనని కాంగ్రెస్ పార్టీ ఎంపీ సోనియా గాంధీ వ్యాఖ్యానించడం గమనార్హం. ప్రస్తుత లోక్‌సభలో 82 మంది మహిళలున్నారు. రిజర్వేషన్ల చట్టంతో ఈ సంఖ్య 181కి చేరుతుందని మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ చెప్పారు.

ఉభయ సభలు వాయిదా

పార్లమెంట్ నూతన భవనంలో మంగళవారం ఉభయ సభల కార్యకలాపాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. అనంతరం సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అదేవిధంగా, రాజ్యసభలో ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. సమాఖ్య వ్యవస్థ, రాష్ట్రాలకు జీఎస్టీకి సంబంధించిన చెల్లింపులపై ఖర్గే లేవనెత్తిన అంశాలపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం రాజ్యసభ బుధవారానికి వాయిదా పడింది.

బిల్లులో ఏముంది?

- మహిళా రిజర్వేషన్లకు సంబంధించి ఆరు పేజీల బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది.
- లోక్‌సభలో, శాసనసభల్లో 33 శాతం సీట్లను మహిళలకు రిజర్వ్ చేస్తారు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఈ సీట్లను భర్తీ చేస్తారు. రాజ్యసభలో, రాష్ట్రాల శాసన మండలిలో ఈ రిజర్వేషన్లు వర్తించవు.
- మహిళల కోటాలో మూడో వంతు సీట్లను ఎస్సీలు, ఎస్టీలకు కేటాయిస్తారు.
- నియోజకవర్గాల పునర్విభజన జరిగిన ప్రతిసారీ మహిళల రిజర్వ్‌డ్ సీట్లు రొటేషన్ అవుతుంటాయి. అంటే మహిళకు కేటాయించిన నియోజకవర్గాలు స్థిరంగా ఉండవు.
- బిల్లులో ఓబీసీ(ఇతర వెనుకబడిన తరగతులు)లను చేర్చడంపై ఎలాంటి ప్రస్తావన లేదు. ఓబీసీ మహిళలకు ప్రత్యేకంగా రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు ఉండవు.
- ఆంగ్లో–ఇండియన్ మహిళలకు కూడా ప్రత్యేకంగా రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు ఉండవు.
- ప్రస్తుతం లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభల్లో మహిళా సభ్యుల సంఖ్య 14 శాతం ఉంది. ప్రపంచ సగటుతో పోలిస్తే చాలా తక్కువ.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 ప్రకారం.. రాజ్యాంగ సవరణ బిల్లును కనీసం 50 శాతం రాష్ట్రాలు అంగీకరించాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఆ(మె) బిల్లు వెనక..

- దశాబ్దాలుగా చర్చలకే పరిమితమైన మహిళా బిల్లు
- పార్టీలన్నీ సమర్థిస్తున్నా పార్లమెంట్ ఆమోదం మాత్రం ఇన్నాళ్లుగా ఎండమావే

మహిళలకు చట్ట సభల్లో, ముఖ్యంగా లోక్‌సభ, అసెంబ్లీల్లో మూడో వంతు రిజర్వేషన్లు.. దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా చర్చలో ఉన్న అంశం. అదే సమయంలో, అంతేకాలంగా విజయవంతంగా పెండింగ్‌లోనూ ఉన్న అంశం. అన్ని పార్టీలూ ఇందుకు మద్దతు తెలిపేవే. కానీ తీరా సదరు పార్లమెంటులో బిల్లు రూపంలో ప్రస్తావనకు వచ్చినప్పుడు మాత్రం ఆమోదం పొందకపోవడం, చివరికి సంబంధిత లోక్ సభ కాలపరిమితి తీరడం, దాంతో బిల్లుకు కూడా కాలదోషం పట్టడం... ఇదీ వరస!



1989లో తెరపైకి...

మహిళలకు చట్ట సభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నం దివంగత ప్రధాని రాజీవ్ గాంధీతో మొదలైంది. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో వారికి 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆయన హయాంలో, అంటే 1989లో పార్లమెంటులో బిల్లు పెట్టారు. అయితే అది లోక్ సభలో ఆమోదం పొందింది గానీ రాజ్యసభలో గట్టెక్కలేదు. అనంతరం తెలుగు తేజం పీవీ నరసింహారావు ప్రధానిగా ఉండగా 1992, 1993లో ఈ మేరకు 72 73వ రాజ్యాంగ సవరణ బిల్లులు ప్రవేశపెట్టారు. వాటిని ఉభయ సభలూ ఆమోదించాలి. అలా గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లోని స్థానాలు, చైర్ పర్సన్ పదవుల్లో మహిళలకు 33 శాతం రిజర్వ్ అయ్యాయి. దేశవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు స్థానిక సంస్థలకు ఎన్నికయ్యేందుకు ఇది దోహదం చేసింది.

దేవెగౌడ నుంచి మన్మోహన్ దాకా..

లోక్ సభ, అసెంబ్లీల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదిస్తూ తొలిసారిగా 1996లో దేవేగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ సర్కారు పార్లమెంటులో 81వ రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టింది. కానీ లోక్ సభా ఆమోదం పొందలేక అది కాలగర్భంలో కలిసిపోయింది. అనంతరం అటల్ బిహారీ వాజ్‌పేయి సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం 1998, 1999ల్లోనూ, ఆ తర్వాత 2002, 2003ల్లోనూ నాలుగుసార్లు బిల్లు పెట్టినా మోక్షానికి నోచుకోలేదు. 2004లో యూపీయే ఈ అంశాన్ని తమ కనీస ఉమ్మడి ప్రణాళికలో చేర్చింది. అధికారంలోకి వచ్చాక 2008లో మన్మోహన్ సింగ్ సర్కారు ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టింది. అక్కడినుంచి స్టాండింగ్ కమిటీకి వెళ్ళడం, దాని నివేదికను కేంద్రం ఆమోదించడం, చివరికి రాజ్యసభ మహిళా బిల్లును ఆమోదించడం జరిగిపోయాయి. అయితే అదంతా సులువుగా ఏమీ జరగలేదు. బిల్లును వ్యతిరేకించిన పలువురు ఎంపీలను మార్షల్స్ సాయంతో బయటికి పంపి మరీ ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది. ఇంతా చేస్తే, ఆ బిల్లు దిగువ సభ అయిన లోక్ సభ ముందుకు రానే లేదు. చివరికి 2009లో 15వ లోక్ సభ రద్దుతో అలా పెండింగులోనే ఉండిపోయింది. కాకపోతే శాశ్వత సభ అయిన రాజ్యసభ ఆమోదం పొందింది గనక నేటికీ కాలదోషం పట్టకుండా అలాగే ఉంది.

ఏమిటీ మహిళా రిజర్వేషన్ల బిల్లు?

లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీ స్థానాల్లో మహిళలకు మూడింట ఒక వంతు, అంటే 33 శాతం స్థానాలను కేటాయించడం దీని ముఖ్యోద్దేశం. ఈ మేరకు వారికి రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకోవడం, లోక్ సభలో మంగళవారం ఈ మేరకు ప్రవేశపెట్టడం తెలిసిందే.

ఆ మూడు అసెంబ్లీల్లో అత్యధికం...

అసెంబ్లీలో మహిళలకు అత్యధిక ప్రాతినిధ్యం కల్పించిన ఘనత ఛత్తీస్‌గఢ్‌దే! అయితే అక్కడ వారు ఎందరున్నారో తెలుసా? కేవలం 14.4 శాతం! 13.7 శాతంతో పశ్చిమ బెంగాల్ రెండో స్థానంలో, 12.35 శాతంతో జార్ఖండ్ మూడో స్థానంలో ఉన్నాయి.

15 అసెంబ్లీల్లో 10% కన్నా తక్కువ...

గోవా, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, ఒడిశా, సిక్కిం, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, అసోం.

7 అసెంబ్లీల్లో 10–12% కన్నా తక్కువ...

బిహార్, హరియాణా, పంజాబ్, రాజస్తాన్, ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ.

లోక్‌సభలో 15 శాతమైనా లేరు...

- లోక్ సభలో ప్రస్తుతం మహిళా ఎంపీల సంఖ్య 78. మొత్తం సంఖ్య 543లో ఇది 15 శాతం కూడా కాదు.
- రాజ్యసభలో కూడా మహిళా ఎంపీలు 14 శాతమే ఉన్నారు.

సాక్షి, నేషనల్ డెస్క్

ప్రజాస్వామ్యం బలోపేతం

- చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న సంకల్పంతోనే బిల్లు
- బిల్లును పార్లమెంట్‌లో ఎంపీలంతా ఏకగ్రీవంగా ఆమోదించాలి
- లోక్‌సభలో ప్రధాని మోదీ విజ్ఞప్తి


కొత్త భవంతిలోని లోక్‌సభలో మాట్లాడుతున్న మోదీ

న్యూఢిల్లీ: చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం మరింత పెరగాలన్న సంకల్పంతోనే మహిళా రిజర్వేషన్ బిల్లు 'నారీశక్తి వందన్ అధినియమ్'ను తీసుకొచ్చినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో భారత ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఉభయ సభల్లో బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ మంగళవారం పార్లమెంట్ నూతన భవనంలో లోక్‌సభలో మొదటి సెషన్‌లో తొలిసారిగా ప్రసంగించారు. సమాజం ప్రభావవంతంగా పరివర్తన చెందడం వెనుక రాజకీయాల పాత్రను వివరించారు. ఆధునిక యుగంలో మహిళలు ముందంజ వేస్తున్నారని ప్రశంసించారు. అంతరిక్షం నుంచి క్రీడల దాకా, స్టార్టప్ కంపెనీల నుంచి స్వయం సహాయ సంఘాల దాకా అన్ని రంగాల్లో వారు కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. పార్లమెంట్‌లో ప్రధాని ఇంకా ఏం మాట్లాడారంటే..

'మహిళల సారథ్యంలో అభివృద్ధి'

''నారీశక్తి వందన్ అభియాన్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిన సందర్భంగా మన తల్లులకు, సోదరీమణులకు, బిడ్డలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా చట్టంగా మార్చడానికి కట్టుబడి ఉన్నామని మహిళలకు హామీ ఇస్తున్నా. ఈ బిల్లుతో మన ప్రజాస్వామ్యం మరింత బలం పుంజుకుంటుంది. 'మహిళల సారథ్యంలో అభివృద్ధి' అనే విధానాన్ని మనం అనుసరిస్తున్నాం. జీ20 శిఖరాగ్ర సదస్సులో ప్రపంచ దేశాలు ఈ విధానాన్ని ప్రశంసించాయి. అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యం నానాటికీ ఇనుమడిస్తోంది. ప్రభుత్వ విధాన నిర్ణయాల రూపకల్పనలోనూ వారి భాగస్వామ్యం పెరగాలి. తద్వారా దేశ అభివృద్ధిలో వారి పాత్ర, సహకారం పెరుగుతుంది. ఈ చారిత్రక దినాన మహిళామణుల కోసం అవకాశాల ద్వారాలు తెరవాలని ఎంపీలను కోరుతున్నా.

శుభప్రదమైన ప్రారంభానికి శ్రీకారం

మహిళల సారథ్యంలో ప్రగతి అనే తీర్మానాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్తున్నాం. ఇందులో భాగంగా రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెడుతున్నాం. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళల భాగస్వామ్యాన్ని విస్తృత పర్చడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. శుభప్రదమైన ప్రారంభానికి శ్రీకారం చుడుతున్నాం. మహిళా రిజర్వేషన్ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని పార్లమెంట్ సభ్యులందరికీ నా విజ్ఞప్తి. మహిళా రిజర్వేషన్ బిల్లుపై చాలా ఏళ్లపాటు ఎన్నో చర్చలు, సంవాదాలు, సంప్రదింపులు జరిగాయి. బిల్లు చుట్టూ వివాదాలు ఏర్పడ్డాయి. పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించడానికి చాలా ప్రయత్నాలు జరిగాయి. మొట్టమొదటిసారిగా 1996లో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో పలు సందర్భాల్లో బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ అంకెలు సహకరించకపోవడంతో ఆమోదం పొందలేదు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అనే స్వప్నం నెరవేరలేదు.

ఈ రోజు.. చరిత్రలో నిలిచిపోతుంది

మహిళలకు హక్కులు కల్పించడం, వాటిని కాపాడడం, వారి శక్తిసామర్థ్యాలను ఉపయోగించుకోవడం వంటి గొప్ప పనుల కోసం భగవంతుడు నన్ను ఎన్నుకున్నాడేమో! అందుకే ఆ దిశగా మన ప్రభుత్వం అడుగు ముందుకేసింది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మంత్రివర్గం నిన్న(సోమవారం) ఆమోదముద్ర వేసింది. ఈ రోజు(సెప్టెంబర్ 19) చరిత్రలో నిలిచిపోతుంది. ఏ దేశ అభివృద్ధి ప్రయాణంలోనైనా చరిత్రను సృష్టించే సమయం వస్తుంది. అలాంటి సమయం ఇప్పుడు భారత్‌కు వచ్చింది.

లక్ష్మణ రేఖ దాటొద్దు

పార్లమెంట్‌లో కొత్త భవనంలో కొలువుదీరాం. ఎంపీలందరూ పాత చేదు అనుభవాలను, జ్ఞాపకాలను మర్చిపోవాలి. నూతన అధ్యాయాన్ని ప్రారంభించాలి. కొత్త భవనంలో ఎంపీలు ఏం చేసినా సరే అది దేశ పౌరులకు స్ఫూర్తిదాయకంగా ఉండాలి. పార్లమెంట్ సమావేశాలను ప్రజలు ప్రత్యక్షంగా తిలకిస్తున్నారు. సభ్యులు అధికార పక్షంలో ఉంటారా? లేక ప్రతిపక్షంలో ఉంటారా? అనేది వారి ప్రవర్తనే నిర్దేశిస్తుంది. పార్లమెంట్ సంప్రదాయాలను సభ్యులంతా పాటించాలి. లక్ష్మణ రేఖ దాటకుండా జాగ్రత్తపడాలి. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మనమంతా కలిసికట్టుగా పనిచేయాలి. ఈ పార్లమెంట్ ఏర్పాటైంది కేవలం దేశ ప్రగతి కోసమే తప్ప ఏదో ఒక రాజకీయ పార్టీ ప్రయోజనం కోసం కాదు. దేశానికి సేవలందించే విషయంలో పార్లమెంట్ స్థానం అత్యున్నతం. పార్లమెంట్ కొత్త భవనం 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలకు ప్రతిబింబం. ఇంజినీర్లు, శ్రామికుల శ్రమతోనే ఈ భవనం రూపుదిద్దుకుంది. 30 వేల మందికిపైగా కార్మికులు స్వేదం చిందించారు. వారి వివరాలతో డిజిటల్ బుక్ తీసుకొచ్చాం. పవిత్ర 'సెంగోల్'ను పార్లమెంట్ నూతన భవనంలో ప్రతిష్ఠించుకున్నాం. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ సెంగోల్‌ను స్వీకరించారు. ఎన్నో ఘట్టాలు సెంగోల్‌తో ముడిపడి ఉన్నాయి'' అని ప్రధానమంత్రి మోదీ వివరించారు.

గొప్ప ఆలోచనలతోనే 'బలమైన భారత్'

న్యూఢిల్లీ: బలమైన భారత్ నిర్మాణం కోసం వేదికను విస్తరింపజేసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలు, కొత్త చట్టాలు దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం కోసమేనని స్పష్టం చేశారు. మంగళవారం పార్లమెంట్ పాత భవనంలోని సెంట్రల్ హాల్‌లో లోక్‌సభ, రాజ్యసభ సంయుక్త సమావేశంలో మోదీ మాట్లాడారు. చిన్నపాటి కాన్వాస్ వస్త్రంపై పెద్ద చిత్రం గీయలేమని అన్నారు. పార్లమెంట్ సభ్యులు పెద్ద ఆలోచనలు చేయకపోతే 'మహోన్నత భారత్' అనే ఆశయం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. మనకు గొప్ప సంస్కృతి, సంప్రదాయం, వారసత్వం ఉన్నాయన్నారు. వీటికి మన కలలను, తీర్మానాలను జోడించాలని చెప్పారు. అప్పుడు పెద్ద కాన్వాస్‌పై భవ్య భారత్ చిత్రం సాకారం అవుతుందన్నారు.

ఎంపీలు పునరంకితం కావాలి

2047 నాటికి మన దేశాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసుకోవాలని, అందుకోసం ఎంపీలంతా పునరంకితం కావాలని మోదీ సూచించారు. పార్లమెంట్ పాత భవనం నుంచి కొత్త భవనంలోకి ప్రవేశించబోతున్నామని, ఇది నూతన భవిష్యత్తు దిశగా నూతన ప్రారంభంగా అభివర్ణించారు. కొత్త భవనంలో కొత్త భవిష్యత్తుకు శ్రీకారం చుట్టబోతున్నామని చెప్పారు. పాత పార్లమెంట్ భవనం విశిష్టతను ప్రధానమంత్రి వివరించారు. 1952 నుంచి ఇప్పటిదాకా ఈ భవనంలో 41 దేశాల అధినేతలు ప్రసంగించారని తెలిపారు. 4,000కు పైగా చట్టాలు ఈ భవనంలోనే రూపుదిద్దుకున్నాయని వివరించారు.

గడువులోగా లక్ష్యాలు సాధించాలి

దేశ నిర్మాణంలో నారీశక్తిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడానికి మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలపాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. ఆయన మంగళవారం పార్లమెంట్ కొత్త భవనంలో రాజ్యసభలో ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చిన ఈ రోజు చరిత్రాత్మకం, చిరస్మరణీయమని అన్నారు. రాజ్యసభను ఎగువ సభగా పరిగణిస్తుంటారని, మేధావులు ఉండే ఈ సభలో దేశ ప్రగతికి ఉపయోగపడేలా అర్థవంతమైన చర్చలు జరగాలని రాజ్యాంగ రూపకర్తలు భావించారని చెప్పారు. నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను సాధించాల్సి ఉందని, ఇంకా నిరీక్షించడానికి దేశం సిద్ధంగా లేదని వ్యాఖ్యానించారు. దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నూతన ఆలోచనా ధోరణితో ముందుకెళ్లాల్సిన సమయం వచ్చిందన్నారు.

వికసిత్ భారత్ వేడుక

75వ స్వాతంత్య్ర దినోత్సవాలను పార్లమెంట్ పాత భవనంలో నిర్వహించుకున్నామని, 100వ స్వాతంత్య్ర వేడుకలను 2047లో కొత్త భవనంలో జరుపుకుంటామని ప్రధాని మోదీ చెప్పారు. అది వికసిత్ భారత్ వేడుక కాబోతోందని అన్నారు.


లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో మోదీ గ్రూప్ ఫొటో

పార్లమెంట్ నూతన భవనంలో...

- కార్యకలాపాలను ప్రారంభించిన స్పీకర్ బిర్లా
- పార్లమెంట్ పాత భవనం ఇక 'సంవిధాన్ సదన్' అంటూ నోటిఫికేషన్
- సభ్యులకు ప్రారంభోత్సవ కానుకలు..

న్యూఢిల్లీ: దేశ పార్లమెంటరీ చరిత్రలో నూతన అధ్యాయం మొదలయింది. మంగళవారం పార్లమెంట్ పాతభవనంలోని సెంట్రల్ హాల్‌లో ఉద్విగ్న భరితంగా ప్రసంగించిన పిమ్మట సభ్యులంతా పార్లమెంట్ నూతన భవనంలోకి పాదయాత్రగా తరలివెళ్లారు. పాత భవనం నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందు నడవగా, మంత్రివర్గ సహచరులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, ఎంపీలు భారత్ మాతాకీ జై, వందేమాతరం అని నినదిస్తూ ఆయన్ను అనుసరించారు. అలాగే, పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఉండే భారత రాజ్యాంగ ప్రతిని నూతన భవనంలోకి తరలించారు. అదేవిధంగా, లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌధురి, రాహుల్ గాంధీ, పార్టీకి చెందిన ఎంపీలు, ప్రతిపక్ష నాయకులతో కలిసి పాత భవనం నుంచి కొత్త భవనంలోకి అడుగుపెట్టారు. అధిర్, రాహుల్‌లు భారత రాజ్యాంగ ప్రతిని చూపుతూ నడిచారు. సభ్యులంతా సభలోకి వెళ్లిన వెంటనే జాతీయ గీతాలాపన జరిగింది. ఆ తర్వాత సభ్యులు తమతమ సీట్లలో ఆసీనులు కావడంతో స్పీకర్ ఓం బిర్లా నూతన సభలో మొదటి రోజు కార్యకలాపాలను మొదలుపెట్టారు. ప్రజల సమస్యలను చర్చకు తెచ్చి పార్లమెంట్‌లో నూతన ప్రమాణాలను నెలకొల్పాలని సభ్యులను ఆయన కోరారు. గణేశ్ చతుర్థి శుభాకాంక్షలు తెలుపుతూ పార్లమెంట్ నూతన భవనంలో సభను నిర్వహించుకోవడం ఒక చారిత్రక సందర్భమన్నారు. దేశాన్ని సాధించి, రాజ్యాంగానికి రూపకల్పన చేసిన మహామహులకు ఓం బిర్లా ఘన నివాళులర్పించారు.

ఆ చారిత్రక భవనం ఇక 'సంవిధాన్ సదన్'


పార్లమెంట్ పాత భవనాన్ని ఇకపై సంవిధాన్ సదన్‌గా పిలుచుకుందామని స్పీకర్ బిర్లా చెప్పారు. హౌస్, లాబీ, గ్యాలరీస్ వంటి పదాలు కొత్త భవనం పార్లమెంట్ హౌస్ ఆఫ్ ఇండియాలోని లోక్‌సభ కార్యకలాపాల విషయంలో ఇకపై వర్తిస్తాయన్నారు. సాయంత్రం ఈ మేరకు ఆయన ఒక నోటిఫికేషన్ విడుదల చేశారు. పార్లమెంట్ పాత భవనానికి ఇచ్చే గౌరవాన్ని ఇకపైనా కొనసాగించాలని, సంవిధాన్ సదన్‌గా పిలుచుకుందామని సెంట్రల్ హాల్‌లో ప్రధాని మోదీ కూడా పేర్కొన్నారు.

పార్లమెంట్ నూతన భవనంలోకి ప్రవేశించిన ఎంపీలందరికీ ప్రత్యేక కానుకలు అందజేశారు. ఆయా సభ్యుల పేర్లతో ప్రత్యేకంగా ముద్రించిన జూట్ బ్యాగ్‌లో రాజ్యాంగ ప్రతి, ఒక స్టాంప్, స్మారక నాణెం ఉన్నాయి.

ఫొటో సెషన్‌కు తరలివచ్చిన ఎంపీలు

అంతకుముందు ఉదయం, పాత భవనంలో జరిగిన ఫొటో సెషన్‌కు ఉభయ సభల సభ్యులు రంగురంగుల దుస్తులతో ముస్తాబై వచ్చారు. ఈ సెషన్‌లో ముందు వరసలో ప్రధాని మోదీ, ఆయనకు ఒకవైపు ఉపరాష్ట్రపతి, రాజ్యసభ సభ్యుడు జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌స్పీకర్ ఓం బిర్లా, మరో వైపు రాజ్‌నాథ్ సింగ్ ఆసీనులయ్యారు. హోం మంత్రి అమిత్ షా, మల్లికార్జున ఖర్గే, అధిర్ రంజన్, సోనియా గాంధీ, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన లోక్‌సభ సీనియర్ సభ్యుడు షఫీక్ ఉర్ రెహమాన్(93), శరద్ పవార్, ఫరూక్ అబ్దుల్లా, జేపీ నడ్డా ముందు వరసలో కూర్చున్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చివరి వరసలో మనీష్ తివారీతో కలిసి కూర్చున్నారు. కొందరు సభ్యులు నేలపై కూర్చుని ఫొటోలు దిగారు. మహిళా సభ్యుల్లో ఎక్కువమంది రంగురంగుల చీరలు ధరించగా, పురుషుల్లో ఎక్కువ మంది తెల్లటి కుర్తా–పైజామా ఆకర్షణీయమైన జాకెట్లు ధరించారు. ఫొటో సెషన్ సందర్భంగా బీజేపీ రాజ్యసభ సభ్యుడు నరహరి అమీన్(68) స్పృహతప్పి పడిపోయారు. ఆయన కొంతసేపటి తర్వాత కోలుకుని, గ్రూప్ ఫొటో తీయించుకున్నారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు వేర్వేరుగా గ్రూప్ ఫొటోలు దిగారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
బుధవారం ׀ 20 ׀ సెప్టెంబర్ ׀ 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 524.90 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 3,773 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పాండిచ్చేరి డీజీపీ బి. శ్రీనివాసన్ మంగళవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

గణేష్ లడ్డూ.. రూ.1.10 లక్షలు



తోట్లవల్లూరు: చాగంటిపాడులో ఐదున్నర కేజీలు ఉన్న 'చవితి' లడ్డూను స్థానికులు బొట్టా వెంకటరెడ్డి, అనూరాధ, కుమారులు వంశీకృష్ణారెడ్డి, దొరస్వామిరెడ్డి రూ. 1.10 లక్షలకు దక్కించుకున్నారు.

న్యూస్‌రీల్

23న మైలవరంలో జాబ్‌మేళా

మైలవరం/గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి మైలవరంలోని లకిరెడ్డి హనిమిరెడ్డి గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా జరుగుతుందని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ అర్హత కలిగిన అభ్యర్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. జాబ్‌మేళాలో 20 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. వారు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని కలెక్టర్ వివరించారు. పూర్తి వివరాలకు 95027 57755/ 97000 92606/ 96033 68324 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

రేపు ఫుడ్‌కోర్టు నుంచి 2కే రన్

కృష్ణలంక(విజయవాడతూర్పు): గురజాడ అప్పారావు 161వ జయంతి సందర్భంగా ఈ నెల 21వ తేదీ ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు 2కే రన్ నిర్వహిస్తున్నట్లు జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాషువా సాంస్కృతిక వేదిక, అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జీఆర్‌కే–పోలవరపు కళా సమితి, సేఫ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న 2కే రన్ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం సమీపంలోని ఫుడ్‌కోర్టు నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ ఢిల్లీరావు జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. ఫుడ్‌కోర్టు వద్ద ప్రారంభమై గాంధీ బొమ్మలు సెంటర్, మధు గార్డెన్స్, శిఖామణి సెంటర్ మీదుగా బిషప్ అజరయ్య హైస్కూల్ వద్ద ముగుస్తుందని వివరించారు.

హెచ్‌ఐవీ నివారణకు యువ సమ్మేళనం



లబ్బీపేట(విజయవాడతూర్పు): యువతలో హెచ్‌ఐవీపై అవగాహన పెంపొందించడానికి యువ సమ్మేళనం నిర్వహించనున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అధ్యక్షతన మంగళవారం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం పాత ప్రభుత్వాసుపత్రిలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జరిగింది. డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ యువ సమ్మేళనంలో భాగంగా 5కే, 3కే మారథాన్, నాటికలు, క్విజ్ పోటీలు, రీల్ మేకింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 24వ తేదీ 17 నుంచి 25 ఏళ్ల మధ్య విద్యార్థులకు బీఆర్టీఎస్ రోడ్డులో 5కే, విద్యార్థినిలకు 3కే మారథాన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 20, 21 తేదీల్లో మాచవరంలోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 25న బిషప్ అజరయ్య హైస్కూల్లో హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణ, నివారణలో విద్యార్థుల పాత్రపై క్విజ్ పోటీలు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు తమ స్కూల్ ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు. నాటిక, రీల్ మేకింగ్ పోటీలు ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న నిర్వహిస్తామని డాక్టర్ ఉషారాణి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు తాము చదువుతున్న కళాశాలలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో యువజన సంక్షేమ శాఖ అధికారులు, నెహ్రూ యువకేంద్రం ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెజ్లింగ్ పోటీలు

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ ఆధ్వర్యాన వికాస్ కాలేజీ గ్రౌండ్‌లో ఈ నెల 21వ తేదీ నుంచి 23 వరకు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు జరుగుతాయని ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి తెలిపారు. అండర్–14, 17 బాలబాలికల కోసం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌ను నిర్వహించనున్నట్లు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్ఎం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికలను స్కూల్ ఫిజికల్ డైరెక్టర్లు విజయవర్మ, శ్రీలతతో కలిసి విడుదల చేశారు. ఈ టోర్నీలో మొత్తం 13 జిల్లాల నుంచి 650మంది రెజ్లర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. వీరికి వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు.


దసరాకు సన్నాహాలు

- రూ.7 కోట్లతో ఉత్సవాలు
- 9 రోజుల్లో దుర్గమ్మకు 10 అలంకారాలు
- ఉత్సవాల్లో తొలిసారి మహాచండీ అలంకారం
- 6 లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా
- భక్తుల కోసం 20 లక్షల లడ్డూలు
- ఆలయ కమిటీ చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ



మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ తదితరులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలకు సన్నాహాలు జరుగుతున్నాయని సుమారు రూ.7 కోట్లతో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ తెలిపారు. ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే దసరా ఉత్సవాల ఏర్పాట్లను వారు మంగళవారం మీడియా సమావేశంలో వివరించారు.



ఉత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు 10 విశేష అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రూ.2.50 కోట్లతో ఇంజినీరింగ్ పనులు చేస్తున్నామని చెప్పారు. ఉత్సవాల్లో గతేడాది ఆరు లక్షలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుంటే ఈ ఏడాది అంతకు మించి వస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. గత ఏడాది ఉత్సవాల్లో 16 లక్షలకు పైగా లడ్డూలను దేవస్థానం అందించిందని, ఈ ఏడాది సుమారు 20 లక్షల లడ్డూలను భక్తులకు అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు.

మూలా నక్షత్రం రోజున రూ.500 వీఐపీ టికెట్లు

ఉత్సవాల్లో ముఖ్యమైన మూలా నక్షత్రం రోజున రూ. 500 వీఐపీ టికెట్లను విక్రయించాలని దేవస్థానం నిర్ణయించింది. భక్తుల రద్దీ దృష్ట్యా అంతరాలయ దర్శనం నిలిపివేస్తారని తెలిపారు. రూ.500 వీఐపీ టికెట్ తీసుకున్నా ముఖమండపం దర్శనం మాత్రమే కల్పిస్తామని వివరించారు. మిగిలిన రోజుల్లో రూ. 100, రూ.300, రూ. 500 టికెట్ల విక్రయాలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు సుమారు రెండు వందల మంది పని చేస్తున్నారని, భక్తుల తలనీలాలు తీసేందుకు ఇతర ఆలయాలు, బయట నుంచి ఆరు వందల మంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

22న వేదసభ

ఉత్సవాల్లో ప్రత్యేకంగా నిర్వహించే ఆది దంపతుల నగరోత్సవం మల్లేశ్వరస్వామి ఆలయం మెట్ల వద్ద యాగశాల నుంచి ప్రారంభమవుతుందన్నారు. మహా మండపం, కనకదుర్గనగర్, దుర్గాఘాట్, దేవస్థాన ఘాట్‌రోడ్డు మీదగా అమ్మవారి ఆలయానికి చేరుకుంటుందన్నారు. రాజగోపురం ఎదుట పూజతో నగరోత్సవం ముగుస్తుందన్నారు. 21న అర్చక సభ, 22న వేద సభ జరుగుతుందని పేర్కొన్నారు. ఉత్సవాల్లో చివరి రోజు 23వ తేదీ నుంచి భవానీల రాక ప్రారంభమవుతుందని భావిస్తున్నామని, మూడు రోజుల పాటు తాకిడి ఉండే అవకాశాలున్నాయన్నారు. సమావేశంలో పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బచ్చు మాధవీకృష్ణ, చింకా శ్రీనివాసులు, తొత్తడి వేదకుమారి, వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణ శర్మ, మురళీధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 20న పట్టువస్త్రాల సమర్పణ

ఉత్సవాల్లో తొలిసారిగా అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరిస్తామని దుర్గగుడి వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య పేర్కొన్నారు. తొలిరోజున అమ్మవారి శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారన్నారు. 20వ తేదీ మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలను సమర్పించనున్నారన్నారు. 23వ తేదీ రెండు అలంకారాల్లో అమ్మవారిని భక్తులు దర్శించుకోవచ్చునన్నారు. ఉదయం మహిషాసురమర్దని, మధ్యాహ్నం నుంచి శ్రీ రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. 23వ తేదీ సాయంత్రం శ్రీ గంగాపార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వరస్వామి వార్లకు పవిత్ర కృష్ణా నదిలో తెప్పోత్సవం జరుగుతుందన్నారు.

వందశాతం ఫలితాలకు కృషి

ఎన్టీఆర్ జిల్లా డీఈఓ రేణుక



మాట్లాడుతున్న డీఈవో సీవీ రేణుక

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 2023–24 పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలను సాధించడానికి ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక చెప్పారు. విజయవాడ డివిజన్‌లోని ఎయిడెడ్, జెడ్పీ, మున్సిపల్ తదితర యజమాన్యాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో స్థానిక కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నా ఫలితాల్లో కొంత వెనుకబాటు కనిపిస్తోందన్నారు. దాన్ని అధిగమించడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. పాఠశాల నుంచి వెళ్లే విద్యార్థులకు టీసీ ఇచ్చినప్పుడు వారి వివరాలను జీఈఆర్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఆ విద్యార్థి ఎక్కడ ఉన్నది తదితర అంశాలనూ సైతం పరిశీలించి నమోదు చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయన్నారు. వాటిని అందరూ అనుసరించాలన్నారు. వివిధ పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అత్యంత మేలైన సేవలందిస్తోందని తెలిపారు. ఫలితాల్లోనూ ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో విజయం సాధించడానికి ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం సూచిస్తున్న వివిధ అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని సూచించారు. నాడు–నేడు ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించాలని ఆదేశించారు. మిగిలిన పాఠశాలలకు సంబంధించి రెండో విడత నాడు–నేడు పనులు పూర్తికాగానే ఆన్‌లైన్ బోధనకు పరికరాలను అందజేస్తారన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్లక్ష్యం వద్దని సూచించారు. వెనుకబాటు ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకొని సాధారణ విద్యార్థులతో సమానంగా వారిని తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో డీవైఈవో కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం, నవరాత్రుల ఏర్పాట్లు పరిశీలన



వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీపీ టీకే రాణా

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): వినాయక విగ్రహాల నిమజ్జనం, దసరా పండుగకు చేస్తున్న ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా మంగళవారం పరిశీలించారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతమ్మవారి పాదాలు సమీపంలోని ఘాట్‌ను పరిశీలించి, బందోబస్త్ నిర్వహించే అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. దసరా మహోత్సవాల సందర్భంగా వినాయక గుడి నుంచి రథం సెంటర్ మీదుగా దుర్గాఘాట్, టెంపుల్ మీద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఇటీవల దుర్గాఘాట్ వద్ద వర్షానికి కొండరాళ్లు జారిపడిన ప్రాంతంలో జరుగుతున్న పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విగ్రహ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిసేలా ఏర్పాట్లు చేసినట్లు, పోలీస్ శాఖతోపాటు, మునిసిపాలిటీ, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేసుకుని నిమజ్జన ఘట్టానికి ఏర్పాట్లు చేశామన్నారు. అక్టోబర్ 15 నుంచి జరిగే దసరా మహోత్సవాల సందర్భంగా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. డీసీపీ విశాల్‌గున్ని, పశ్చిమ ఏసీపీ హనుమంతరావు, ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, సౌత్ ఏసీపీ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో నిత్యావసరాల పంపిణీ

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, జేసీ సంపత్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రైస్ కార్డుదారులకు నిత్యావసర వస్తువులను సకాలంలో, సక్రమంగా పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పౌర సరఫరాల శాఖ సచివాలయ వ్యవస్థతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. కలెక్టరేట్ పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యాన మంగళవారం జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండీయూ వాహనాలు ప్రతిసారి ఒకే రూట్‌లో కాకుండా వేర్వేరు రూట్లలో కార్డుదారుల ఇళ్లకు వెళ్లేలా మార్పులు చేయాలని సూచించారు. కొన్ని చోట్ల రేషన్ బియ్యానికి బదులు నగదు ఇస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని, వీటిపై గట్టి నిఘా ఉంచాలన్నారు.

ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేయాలి

నగరంలోని హోటల్స్, ఈట్ స్ట్రీట్లలో ఆహార పదార్థాల నాణ్యత తనిఖీలు చేయాలని ఎమ్మెల్యే విష్ణు పేర్కొన్నారు. జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశాలు మూడు నెలలకోసారి జరిగాలని చెప్పారు. భవానీపురం వద్ద ఈట్ స్ట్రీట్ తరహాలో క్లీన్ స్ట్రీట్ ఫుడ్ హబ్ ఏర్పాటు చేయనున్నందున ఆహార భద్రత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ సంపత్ కుమార్ మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ, పౌరసరఫరాల శాఖ అధికారులు, దుకాణాలు, పెట్రోల్ బంకులు, హోటల్స్‌పై నెలలో ప్రతి వారం సామూహిక ఆకస్మిక దాడులు నిర్వహించాలన్నారు. కార్డుదారులకు కందిపప్పు సరఫరాపై మిల్లర్లతో మిల్లింగ్‌పై చర్చించామని, అక్టోబరు నుంచి కందిపప్పు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుందని జేసీ అన్నారు. సమావేశంలో సివిల్ సప్లయీస్ డైరెక్టర్ టి. చంద్రశేఖర్, జిల్లా మేనేజర్ జి. వెంకటేశ్వర్లు, డీఎస్వో మోహన్‌బాబు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వి.వి. విజయభారతి, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి రుక్మాంగదయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్య శ్రీతో ప్రతి ఒక్కరికీ వైద్యం

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజాబాబు వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మండలస్థాయి అధికారులతో వీసీ నిర్వహించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ప్రగతి, నాడు – నేడు, గృహ నిర్మాణం, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వాసుపత్రిలో ఆధునిక వైద్య వసతులను ప్రభుత్వం కల్పించిందని ఆశించిన స్థాయిలో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు అందించకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎక్కువ మందికి సేవలు అందించాలని చెప్పారు. జేసీ అపరాజితాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

- నేషనల్ సైన్స్ సెమినార్–2023
- విద్యార్థులకు అవగాహన
- వివిధ స్థాయిల్లో పోటీలు
- సమస్త సమాచారంతో ప్రదర్శన



చిరుధాన్యాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చిరుధాన్యాలతో ఆరోగ్యసిరి అందుతోందా? లేకపోతే వ్యామోహంతో! వాటిని తీసుకుంటున్నారా అనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు ఉపాధ్యాయులు. ప్రస్తుత కాలంలో ప్రాయంతో సంబంధం లేకుండా షుగర్, బీపీ వంటి వ్యాధుల బారిన అనేక మంది పడుతున్నారు. దీంతో రైస్ వాడకం తగ్గించి ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల వైపు మొగ్గు చూపుతున్నారు.

విద్యార్థుల్లో అవగాహనకు..

చిరుధాన్యాలపై విద్యార్థులకు అవగాహన, వాటితో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేయడానికి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం బెంగళూరు వారు జాతీయస్థాయిలో 'నేషనల్ సైన్స్ సెమినార్–2023'ను అక్టోబర్‌లో నిర్వహిస్తున్నారు. ఏటా ఒక్కో అంశంపై సెమినార్ నిర్వహించి విద్యార్థుల్లో చైతన్యం తెస్తున్నారు. కరోనా తర్వాత నిర్వహించే సెమినార్‌లో 'మిల్లెట్స్ ఏ సూపర్ ఫుడ్ ఆర్ డైట్ ఫ్యాడ్' అంశానికి ప్రాధాన్యమిచ్చారు. మండల స్థాయి నుంచి జాతీయ వరకు సెమినార్ నిర్వహిస్తారు. దీని కోసం షెడ్యూల్‌ను ప్రకటించారు. పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటడానికి సమాయత్తమవుతున్నారు. 8,9,10 వ తరగతి విద్యార్థులకు నిర్వహించే సెమినార్‌లో పాల్గొనే ఔత్సాహికులకు సైన్స్ అధ్యాపకులు చిరు ధాన్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. చిరు ధాన్యాలతో ప్రయోజనాలు, ఆరోగ్య పరిరక్షణకు ఏవిధంగా దోహదం చేస్తాయి వంటివాటిపై శిక్షణనిస్తున్నారు.

వివిధ స్థాయిల్లో పోటీలు

- ఈ నెల 21న మండల స్థాయి పోటీలు
- 23న విజయవాడలో జిల్లా స్థాయిలో సెమినార్
- 25న విజయవాడలో రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహించనున్నారు.
- 8,9,10 తరగతుల విద్యార్థులు అర్హులు

ఇలా చేయాలి

సెమినార్‌లో పాల్గొనే విద్యార్థులు చిరు ధాన్యాల విశిష్టతను, వాటిలో ఉండే పోషకాలు, విటమిన్స్, మినరల్స్ , ఏ వ్యాధులకు ఏఏ ధాన్యాలు తీసుకోవాలి వంటి విషయాలను వివరిస్తూ పోస్టర్స్, చార్ట్స్, పీపీటీ స్లైడ్స్ రూపొందించి ప్రదర్శించాల్సి ఉంటుంది. ఒక్కో విద్యార్థి ఐదేసి చొప్పున పోస్టర్స్ , చార్ట్స్, పీపీటీ స్లైడ్స్, తెలుగు, ఇంగ్లిషు భాషల్లో రూపొందించాలి. వాటిలో ఉత్తమమైనవాటిని ఎంపిక చేసి అవి తయారు చేసిన విద్యార్థులను పై స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. అన్ని స్థాయిల్లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడ కూడా చక్కటి ప్రతిభ కనబరిస్తే గోల్డ్ మెడల్, నగదు బహుమతి అందజేస్తారు.

సెమినార్‌కు సమాయత్తం



నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం ఏటా ఒక్కో అంశంపై విద్యార్థులకు సెమినార్ నిర్వహిస్తుంది. ఈ ఏడాది చిరు ధాన్యాలపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహిస్తోంది. ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించింది. దీంతో విద్యార్థులను సెమినార్‌కు సన్నద్ధం చేస్తున్నాం. చిరు ధాన్యాలపై సమస్త సమాచారాన్ని విద్యార్థులకు అందజేసి చక్కటి ప్రదర్శన ఇప్పిస్తున్నాం. జాతీయ స్థాయిలో రాణించడానికి విద్యార్థులకు శిక్షణఇస్తున్నాం.

–మైనం హుస్సేన్ ,
జిల్లా సైన్స్ అధికారి



దుర్గగుడిలో లక్ష్మీగణపతి విగ్రహం

జైజై గణేశా..

- ఘనంగా వినాయక చవితి
- వాడవాడలా భారీగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలు
- అబ్బుర పరిచే సెట్టింగ్‌లు.. ముచ్చటగొలిపే బహురూపాలు..



పటమట దత్తాశ్రమంలో వినాయకుడికి పూజలు చేస్తున్న సచ్చిదానందస్వామీజీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జైజై గణేశా అంటూ భక్తజనం విఘ్నాధిపతిని మనసారా పూజించింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో సోమవారం వినాయకచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. అడుగు నుంచి 15 అడుగుల మేర భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలకు ఆయా సంఘాలు శ్రీకారం చుట్టాయి. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వినాయకుడు బహు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఒకచోట నారికేళ గణపతిని ఏర్పాటు చేస్తే మరో చోట చంద్రయాన్ గణేశుడిని ఏర్పాటు చేసి భక్తులను ఆకట్టుకున్నారు. మరో ఆలయంలో సుమారు కోటి రూపాయల నగలను స్వామి వారికి ధరింపజేసి కుబేర గణపతిగా దర్శనమిచ్చారు. పటమట దత్త ఆశ్రమంలో సచ్చిదానంద స్వామీజీ వినాయకుడికి పూజలు చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో ఘనంగా చవితి వేడుకలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై సోమవారం వినాయకచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో భ్రమరాంబ, పాలక మండలి సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బుధవారం స్వామి వారి నిమజ్జనం జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.



బీసెంట్‌రోడ్డులో విఘ్నాధిపతి



విజయవాడలో చంద్రయాన్-3 వినాయకుడు

క్లుప్తంగా

సృజనాత్మకత పెంచేలా సైన్స్ ప్రాజెక్టులు

డీఈవో తాహెరా సుల్తానా



జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో తాహెరా సుల్తానా

పెనమలూరు: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే విధంగా సైన్స్ ప్రాజెక్టులు ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం 31వ జాతీయ సైన్స్ బాలల కాంగ్రెస్ (ఎన్‌సీఎస్‌సీ) జిల్లా స్థాయి ఓరియెంటేషన్ ప్రోగ్రాం -2023 నిర్వహించారు. తొలుత 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోస్టర్‌ను డీఈవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సీఎస్‌సీ ప్రాముఖ్యతను వివరించి, ఉపాధ్యాయులు చేయవల్సిన కర్తవ్యాన్ని, సైన్స్ ప్రాజెక్టులో ఎంచుకోవల్సిన అంశాలను వివరించారు. విద్యార్థులలో ఆసక్తిని కలిగించి, వారిలో సృజనాత్మకతను పెంపొందింపజేసి కృష్ణాజిల్లా నుంచి ఎక్కువ ప్రాజెక్టులు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సమావేశంలో గుడివాడ ఉప విద్యా శాఖా అధికారి ఐ. పద్మారాణి మాట్లాడుతూ 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో జిల్లా విద్యార్థులు సత్తా చాటే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. జిల్లా ఆస్కాస్ట్ కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓరియెంటేషన్ ప్రోగ్రాంకు జిల్లా నుంచి 300 మంది సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర లయోలా కాలేజీ అధ్యాపకురాలు బి.శివకుమారి, జిల్లా సైన్స్ అధికారి ఎండీ జాకీర్ అహ్మద్, రిసోర్స్ పర్సన్స్ యు.కృష్ణమూర్తి, అంబటి సుబ్రహ్మణ్యం, ధనేకుల కళాశాల అధ్యాపకుడు డాక్టర్ రావి సురేష్, స్టాలిన్ పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చేలా పనులు చేయండి

- క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పరిశీలించండి
- నెలల తరబడి జాప్యం అయితే ప్రజలు క్షమించరు
- జిల్లా అధికారులపై మంత్రి జోగి రమేష్ ఆగ్రహం



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: ప్రజలు మెచ్చుకునేలా మేం పరిపాలన చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలు మెచ్చేలా చేయాల్సింది మీరేనని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఆయన మంగళవారం పెడన నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యలపై జిల్లా స్థాయి అధికారులతో పెడన మార్కెట్ కమిటీ హాలులో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ తొలుత గ్రామీణ నీటిపారుదల సరఫరా శాఖపై సమీక్షించారు. తీర ప్రాంతాల్లోని పలు గ్రామాలకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా నాలుగు రోజులు పంపి ఆపేయడం ఏమిటని ప్రశ్నించారు. పలుచోట్ల మోటార్లు పెట్టాలని, అందుకు నిధులు మంజూరు చేసినా పెట్టకపోవడం, టెండర్లు పిలిచి పనులు అప్పగించడంలో జాప్యం చేయడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో తీర ప్రాంతాలు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ మాట్లాడుతూ కొన్ని చోట్ల పనులు పూర్తయినట్లు నివేదికలు ఇచ్చారని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉందన్నారు. తక్షణం క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎక్కడైనా ఏమైనా సమస్యలుంటే తక్షణం పరిష్కరించాలని ఎస్ఈకి మంత్రి సూచించారు. కృత్తివెన్ను మండలం ఏటిగొల్లపాలెం తాగునీటి సమస్య పరిష్కరించాలని రూ.10లక్షలు మంజూరు చేశామని, ఆ పనులు ఎంతవరకు వచ్చాయని మంత్రి ప్రశ్నించగా టెండర్లు పిలిచి పనులు అప్పగించాల్సి ఉందన్నారు. జలజీవన్ మిషన్ కింద పనులు వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. పూర్తయిన పనులకు బిల్లులు రావడం లేదని, ఒకటికి పదిసార్లు తిప్పించుకుంటున్నారని పలువురు ప్రజాప్రతినిధులు మంత్రి ముందు వాపోయారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ ఇటువంటి పరిస్థితి రానీయకుండా చూడాలన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ప్రజలు క్షమించరని అన్నారు.

50 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి

పెడన నియోజకవర్గంలో 8,182 ఇళ్లు నిర్మిస్తుండగా, వాటిలో 50 శాతం పూర్తయ్యాయని హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ జీవీ సూర్యనారాయణ తెలిపారు. గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి నూతన భవనాల నిర్మాణాలపై సమీక్షించారు. సచివాలయానికి రూ.3.60 లక్షలు, క్లినిక్‌కు రూ.2.7లక్షలు, ఆర్‌బీకేకి రూ.2.4లక్షలు అదనంగా ఇస్తున్నట్లు పంచాయతీ రాజ్ ఎస్ఈ తెలిపారు. మంత్రి స్పందిస్తూ నిధులున్నా పనులు చేయకపోవడం ఏమిటంటూ ప్రశ్నించగా, కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిపారు. తక్షణం అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని, పనులు త్వరితగతిన అయ్యేలా చూడాలని మంత్రి ఆదేశించారు. అదనంగా నిధులు కేటాయించిన విషయం క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు తెలియజేయాలని సూచించారు. ఈ-క్రాప్ నమోదు చాలా ఆలస్యమవుతోందని పలువురు ప్రజాప్రతినిధులు మంత్రికి వివరించగా, జేడీఏ ఎన్.పద్మావతి బదులిస్తూ పంటలు ఆలస్యంగా వేయడం వల్ల జాప్యమైందని, ఈ నెలాఖరు వరకు గడువు పెంచారని వివరించారు. విద్యుత్, రోడ్లు, విద్య తదితర శాఖలపై సమీక్షించారు. మళ్లీ మూడు నెలల తర్వాత జరిగే సమావేశంలో ఈ సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సమావేశంలో పెడన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చారుమతి, కృత్తివెన్ను, గూడూరు జెడ్పీటీసీలు రత్నకుమారి, సురేష్ రంగబాబు, ఎంపీపీలు సంగా మధుసూదన రావు, చినబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు నాగబాబు, వెంకట్రాజు, పర్లం పెదబాబు, వెలుగు పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, డీపీవో ఎస్‌వీ నాగేశ్వరనాయక్, సీపీవో కె.బద్రీనారాయణ, ఆర్ అండ్‌బీ ఎస్ఈ వీకే విజయశ్రీ, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడికి కలెక్టర్ దంపతుల పూజలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, ప్రశాంతి దంపతులు కుటుంబసభ్యులతో కలిసి నగరంలోని తమ నివాసంలో అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయక చవితి పూజలు నిర్వహించారు. కలెక్టర్ ఇంటి ఆవరణలో ప్రత్యేకంగా అలంకరించిన మంటపంలో వినాయకుడి మట్టి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. వేద పండితులు కలెక్టర్ దంపతులతో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో కలెక్టరు కుమారుడు ఎస్.జీవితేష్, కుమార్తె సిరి చందన, తల్లి ఎస్.పార్వతి, కలెక్టర్ సతీమణి ప్రశాంతి తల్లిదండ్రులు పి.బుచ్చయ్య పి.సుజాత, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడలో ట్రైన్ రెస్టారెంట్ ప్రారంభం



విజయవాడ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ప్రారంభించిన రైల్ రెస్టారెంట్



అల్పాహారం తీసుకుంటున్న డీఆర్ఎం నరేంద్ర పాటిల్, హల్దీరాం ఫుడ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ నీరజ్ అగర్వాల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు ప్రయాణికులకు ఆహ్లాదం పంచడంతోపాటు, నాణ్యమైన ఆహారం అందించేందుకు ట్రైన్ రెస్టారెంట్ అందుబాటులోకి వచ్చిందని విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. నాగ్‌పూర్‌లోని హల్దీరామ్ ఫుడ్ ఇంటర్నేషనల్ చైర్మన్ నీరజ్ అగర్వాల్ తో కలసి రైల్వేస్టేషన్ తూర్పు ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటుచేసిన ఈ రెస్టారెంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు కొత్త అనుభూతిని అందించేందుకు రైల్ కోచ్‌లతో రెస్టారెంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. విజయవాడ డివిజన్ పరిధిలోని రాజమండ్రి స్టేషన్‌లో ఇప్పటికే ఒక రెస్టారెంట్ ఏర్పాటు చేశామన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసింది రెండోదని తెలిపారు. నాన్ ఫెయిర్ రెవెన్యూ చొరలో భాగంగా డివిజన్‌లో పాత రైలు కోచ్‌ను ఆధునీకరించి ఏసీ డైనింగ్ హాల్, కిచెన్, విశాలమైన సర్క్యులేటింగ్ ఏరియాతో రెస్టారంట్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. సమావేశంలో హల్దీరామ్ ఫుడ్ ఇంటర్నేషనల్ చైర్మన్ నీరజ్ అగర్వాల్ మాట్లాడుతూ ఈ క్విక్ సర్వీసు రెస్టారెంట్ (క్యూఎస్ఆర్) నాణ్యత, రుచి విషయంలో రాజీ పడకుండా ప్రయాణికుల అవసరాలను తీరుస్తుందని తెలిపారు. ప్రయాణికులకు చక్కటి భోజనాన్ని అందించడమే లక్ష్యంగా ఈ రెస్టారెంట్ ఏర్పాటు చేశామన్నారు. హల్దీరామ్ ఈ ప్రత్యేక రెస్టారెంట్ కోసం ఇండియా కా స్వాద్ మెనూను చక్కగా రూపొందించిందన్నారు. సంప్రదాయ రుచులతో పాటు సమ కాలీన ఫ్యూజన్ వంటకాలు కూడా అందుబాటులో ఉంటాయని వివరించారు. ఐఆర్‌సీటీసీ క్యాటరింగ్, స్విగ్గీ, జుమాటో ద్వారా కూడా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకోవచ్చని తెలిపారు. సీనియర్ డీసీఎం వావిళ్లపల్లి రాంబాబు, పలు విభాగాల అధికారు లు, హల్దీరామ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యురాలి ఆత్మహత్య



మృతి చెందిన ఆమ్రపాలి

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో సోమవారం వైద్యురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు ఇన్‌చార్జి సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెనమలూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న రామచంద్ర రెసిడెన్సీలో మాతంగి ఎస్తేర్‌రాణి నివసిస్తోంది. ఆమె పెనమలూరు పీహెచ్‌సీలో ఏఎన్ఎంగా పనిచేస్తోంది. ఆమె భర్త కోటేశ్వరరావు కొద్దికాలం క్రితం మృతి చెందాడు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నాడు. వారి చిన్నకుమార్తె బొద్దు ఆమ్రపాలి (26) సిద్ధార్థ వైద్య కళాశాలలో 2022లో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. పీజీ సీటుకు యత్నించగా సీటు రాలేదు. ఈ నేపథ్యంలో ఆమెకు సమీప బంధువు మాతంగి జాన్సన్‌కు ఇచ్చి వివాహం చేయాలని పెద్దలు నిర్ణయించగా, తాను ఉన్నత చదువులు చదవాలని ఆమ్రపాలి పెళ్లికి నిరాకరించింది. గత నెలలో ఆమ్రపాలి విజయవాడలోని సెంటినీ ఆస్పత్రిలో వైద్యురాలిగా చేరింది. సోమవారం మధ్యాహ్నం పెనమలూరులోని తన ఇంట్లో బెడ్‌రూమ్‌లో తలుపులు వేసుకుని నిద్రపోయింది. సాయంత్రం తల్లి ఎస్తేర్‌రాణి కుమార్తెను పిలువగా పలకలేదు. బెడ్‌రూమ్ తలుపులు లోపల గడి పెట్టి ఉండటంతో తలుపులు పగలకొట్టి చూడగా ఆమ్రపాలి చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. 108 వాహనానికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఆమ్రపాలి అప్పటికే మరణించినట్లు తెలిపారు. ఆమ్రపాలి చనిపోయే ముందు రాసిన సూసైడ్ నోట్‌లో తన చావుకు ఎవరూ బాధ్యులు కారని పేర్కొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మనోవ్యాకులత తోనే ఆత్మహత్య

ఆమ్రపాలి సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోక సందిగ్ధావస్థలో గత కొద్దిరోజులుగా డిప్రెషన్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. తల్లి, బంధువులు తనకు సమీప బంధువు, రైల్వే ఉద్యోగి అయిన జాన్సన్‌తో వివాహం చేయాలని నిర్ణయించినపుడు ఆమ్రపాలి నిరాకరించింది. తాను పీజీ చేయాలని పట్టుబట్టింది. తీరా పీజీ సీటు రాలేదు. ఈలోగా అతడికి వేరే మహిళతో వివాహం అయింది. దీంతో తాను తప్పు చేశానని, అప్పుడే అతడిని పెళ్లి చేసుకుంటే బాగుండేదని ఆమ్రపాలి ఎవరికీ చెప్పుకోలేక తనలో తనే మధన పడుతున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్టు బంధువులు, పోలీసులు భావిస్తున్నారు.

ఎంపీ బాలశౌరికి శుభాకాంక్షలు తెలిపిన అమిత్‌షా

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరికి ఫోన్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఎంపీ బాలశౌరి జన్మదినం సందర్భంగా ఉదయం 11 గంటల సమయంలో ఆయనకు కేంద్ర మంత్రి అమిత్‌షా ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాలశౌరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

అదుపు తప్పి స్కూల్ ఆటో బోల్తా

- ఐదవ తరగతి విద్యార్థిని మృతి
- నలుగురికి తీవ్రగాయాలు



గుంటుపల్లి వద్ద హైవేపై పల్టీకొట్టిన ఆటో (ఇన్‌సెట్‌లో నవ్యశ్రీ మృతదేహం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి స్కూల్ ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. మండలంలోని గుంటుపల్లి వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో 5వ తరగతి చదువుతున్న నవ్యశ్రీ(10) మృతిచెందగా, మరో నలుగురు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంటుపల్లి డాన్‌బాస్కో పాఠశాలకు భవానీపురం, విద్యాధరపురం, గొల్లపూడి ప్రాంతాలకు చెందిన పలువురు విద్యార్థులు రోజూ ఆటోలో వచ్చి వెళ్తుంటారు. పాఠశాల ముగిసిన అనంతరం 14 మంది విద్యార్థులను ఎక్కించుకుని వెళ్తున్న ఆటో రాంగ్‌రూట్‌లో వచ్చిన బైక్‌ను తప్పించబోయి అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో విద్యాధరపురం కామకోటినగర్‌కు చెందిన పరువాల ఆనంద్ కుమార్తె నవ్యశ్రీ (10) మృతి చెందింది. గాయపడిన మరో నలుగురు విద్యార్థులను గొల్లపూడిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పి.శ్రీను తెలిపారు.

సమర్థుడైన అధికారి వెంకటేశ్వర్లు



డీఆర్వో వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో జేసీ అపరాజిత సింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేసిన ఎం.వెంకటేశ్వర్లు సమర్థుడైన అధికారి అని కలెక్టర్ పి.రాజాబాబు కొనియాడారు. జెడ్పీ కన్వెన్షన్ హాలులో డీఆర్వోగా పనిచేసిన ఎం.వెంకటేశ్వర్లుకు ఆత్మీయ వీడ్కోలు, నూతన డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన పి.వెంకటరమణకు స్వాగత కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ.. తాను జిల్లాకు వచ్చి నాలుగు నెలలు గడిచాయన్నారు. కలెక్టర్‌గా రాకముందు తాను వాణిజ్య పన్నుల శాఖ, సెర్ప్ సీఈఓ, రవాణాశాఖల్లో పనిచేశానని, రెవెన్యూశాఖపై అంత పట్టు లేనప్పటికీ డీఆర్వో వెంకటేశ్వర్లు తనకు మంచి చేదోడుగా సహకరించారని పేర్కొన్నారు. ప్రొటోకాల్ అంశంలో రాష్ట్రపతి పర్యటన లాంటి ఘటనల్లో ఎంతో సమర్థవంతంగా అధికారులను సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించారన్నారు. డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణ పూర్వ డీఆర్వో వెంకటేశ్వర్లు నుంచి అన్ని అంశాలు తెలుసుకుని అధికారుల సమన్వయంతో కృష్ణాజిల్లాను పరిపాలనా పరంగా ముందంజలో నిలపాలని కోరారు. జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ మాట్లాడుతూ ఎన్ని ఒత్తిళ్లు ఉన్నప్పటికీ వెంకటేశ్వర్లు సమర్థంగా, సహనంతో పనిచేసేవారన్నారు. జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, డ్వామా పీడీ జి.వి.సూర్యనారాయణ, ఎంయూడీఏ వీసీ కె.రాజ్యలక్ష్మి, డీఎస్ఓ పి.పార్వతి, ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ, గుడివాడ ఆర్డీఓ బి.పద్మావతి, కలెక్టరేట్ ఏఓ ఎ.ఎస్.ఎన్.రాధిక, జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్, కార్యదర్శి ఎం.వి.శ్యామ్‌నాథ్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం డీఆర్వో వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు.

ఆయన సంగీతం నిరంతర గంగా ప్రవాహం

విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల వారి సంగీతం, సాహిత్యం నిరంతరం ప్రవహించే గంగా ప్రవాహం వంటివని సంగీత విద్వాంసుడు ఎన్‌సీహెచ్ బుచ్చయ్యాచార్యులు అన్నారు. కృష్ణమాచార్యులు కళాపీఠం ఆధ్వర్యంలో వయోలిన్, గాత్ర సంగీత విద్వాంసుడు ఎన్‌సీహెచ్ కృష్ణమాచార్యులు శత జయంతి సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత కార్యక్రమాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం నాటి కార్యక్రమంలో బుచ్చయ్యాచార్యులు కృష్ణమాచార్యులు రచనలు గర్భకృతులు అంశంగా ప్రసంగించారు. కృష్ణమాచార్యులు రచించిన కీర్తనలను గానం చేశారు. వయోలిన్‌పై కౌశిక్ కల్యాణ్, మృదంగంపై నేతి శివశంకర్ సహకరించారు. హైదరాబాద్‌కు చెందిన కల్యాణ్, ఎన్‌సీ సాహితి, డాక్టర్ ఎం.హరిత, ఎంవీఎస్ మూర్తి, ముటూ్నరి జలజాక్షి, సీవీపీ శాస్త్రి(చెన్నై) తో పాటు వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన సంగీత విద్వాంసులు కచేరీలు నిర్వహించారు. కృష్ణమాచార్యులు కళాపీఠం అధ్యక్షురాలు రంగనాయకి, ఉపాధ్యక్షుడు టీకేవీ రామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతిపై కేసు నమోదు

నందిగామ: కడుపునొప్పి తాళలేక గడ్డి మందు తాగి మహిళ మృతి చెందిన ఘటనపై నందిగామ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం పట్టణ శివారు అనాసాగరం గ్రామానికి చెందిన ఆది అరుణ (34)కు వివాహం అయింది. ఆమెకు ముగ్గురు సంతానం ఉన్నారు. గత కొంతకాలంగా తరచూ కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 17 వ తేదీ తెల్లవారుజామున ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. అక్కడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తిరుపతిరావు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: 216హెచ్ నంబరు జాతీయ రహదారిపై బాపులపాడు మండలం కానుమోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. గ్రామానికి చెందిన నత్తా ఆకాష్ (19) సోమవారం అర్ధరాత్రి సమయంలో బైక్‌పై ఆరుగొలను వెళ్లి తిరిగి వస్తుండగా రంగయ్య అప్పారావు పేట రోడ్డు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆకాష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారంతో హనుమాన్‌జంక్షన్ పోలీసులు సంఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ-2 తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో కొట్టుకువచ్చిన మృతదేహం

గూడూరు: గూడూరు మండలం గంటలమ్మపాలెంలో మంగళవారం కాలువలో కొట్టుకువచ్చిన మృతదేహం కలకలం రేపింది. కాలువ గట్టుకు సమీపంలో నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవాన్ని బయటకు తీసి విచారణ ప్రారంభించారు. మృతుడు పామర్రు మండలం నిమ్మకూరు ఎస్సీ కాలనీకి చెందిన వి.సాయితేజ(27)గా గుర్తించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో గొడవ పడిన సాయితేజ శనివారం రాత్రి సమయంలో మద్యం తాగి ఇంటి సమీపంలో ఉన్న రామరాజుపాలెం కాలువలో దిగాడు. ప్రమాదవశాత్తూ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. అప్పటి నుంచి అతని కోసం తల్లిదండ్రులు, బంధువులు గాలిస్తున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో మంగళవారం గంటలమ్మపాలెంలో లభించిన మృతదేహం సాయితేజదిగా పోలీసులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. గూడూరు ఎస్ఐ వి.వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

పామర్రు: మండలంలోని కురుమద్దాలి గ్రామంలో మైనర్ బాలిక అనుమానాస్పద మృతిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కురుమద్దాలి గ్రామంలోని ఓ ప్రైవేట్ ఆక్వా కంపెనీలో పనిచేస్తున్న రెజీనా బేబికి 14 ఏళ్ల మైనర్ బాలిక ఉంది. తల్లి ఉద్యోగానికి వెళ్లగా కుమార్తె ఇంటి వద్దే ఉంటుంది. ఈ నేపథ్యంలో బాలిక సోమవారం సాయంత్రం ఇంట్లోనే ఉరి వేసుకుని మృతి చెందింది. తన కుమార్తెకు తమ సొంత ప్రాంతమైన కొల్‌కతాలోని డైమండ్ హౌరా ప్రాంతంలో ఓ కుర్రాడితో పరిచయం ఏర్పడిందని, ఇటీవల వారిద్దరి మధ్య మనస్పర్థలు రావటంతో తట్టుకోలేక ఉరి వేసుకుందని మృతురాలి తల్లి స్థానిక పామర్రు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పామర్రు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మృతురాలి భౌతిక కాయాన్ని పోస్టు మార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని అన్నారు.

కేఈబీ కాలువలో వ్యక్తి గల్లంతు



తోట్లవల్లూరు: కేఈబీ కాలువలో వ్యక్తి గల్లంతైన ఘటన మండలంలోని గురివిందపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పమిడిముక్కల మండలం మేడూరు గ్రామానికి చెందిన అనగాని రమేష్‌బాబు(48) లారీ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. గురివిందపల్లిలో సమీప బంధువైన ఓ మహిళ మృతి చెందటంతో ఆమె అంత్యక్రియలకు మంగళవారం హాజరయ్యాడు. అంత్యక్రియల అనంతరం కేఈబీ కాలువలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో మునిగిపోయాడు. ప్రమాద ప్రాంతాన్ని ఎస్ఐ విశ్వనాథ్ సందర్శించి పరిశీలించారు. బంధువులతో కలిసి గాలింపు నిర్వహిస్తున్నామని, ఎస్డీఆర్ఎఫ్ బృందం కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

కాలువలో పడి వృద్ధుడు ...

పెనమలూరు: యనమలకుదురులో వృద్ధుడు ప్రమాదవశాత్తు పంటకాలువలో పడి గల్లంతవటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు గ్రామానికి చెందిన ధనేకుల శ్రీధర్ తండ్రి ధనేకుల అప్పారావు (77) ఈ నెల 12వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామంలోని కేఈబీ కెనాల్ వద్ద అప్పారావు మూత్ర విసర్జన చేస్తూ ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యాడని స్థానికులు శ్రీధర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు గత నాలుగు రోజులుగా కాలువలో వెతికినా ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

తోపుడు బండి అందజేత



గుణదల (విజయవాడ తూర్పు): పేదలకు జీవనోపాధి కల్పించే నిమిత్తం దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వైస్ చైర్మన్ దేవినేని సుధీర అన్నారు. గుణదలలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో 2వ డివిజన్‌కు చెందిన కోటిరెడ్డి అనే చిరు వ్యాపారికి తోపుడు బండి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అంబడిపూడి రవి ప్రకాష్, సొంగా రాజ్‌కమల్, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

దూదేకులకూ 'పీఎం విశ్వకర్మ' వర్తింపజేయాలి

పటమట(విజయవాడతూర్పు): దూదేకుల కులస్తులకూ పీఎం విశ్వకర్మ పథకం వర్తింపజేయాలని కేంద్ర మంత్రి భగవంత్ ఖుబాను కోరామని ఉభయ రాష్ట్రాల ఎంబీసీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఆకుమళ్ల నాని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ రైల్వే ఫంక్షన్ హాల్లో పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన కేంద్ర మంత్రి భగవంత్‌ను కలిసిన తాము తమ సమస్యలను విన్నవించామని పేర్కొన్నారు.

ధర్నా జయప్రదానికి వినతి



కృష్ణలంక(విజయవాడతూర్పు): దళిత హక్కులు, సామాజిక న్యాయం సాధన కోసం కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 29న ధర్నా చౌక్‌లో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ధర్నాలో దళిత, అంబేడ్కర్ యువజన, కార్మిక, మహిళా సంఘాల నాయకులు, డప్పు కార్మికులు, మేధావులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ సహాయ కార్యదర్శి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



రిషిత సాగర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఏపీ ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న ఉమ్మడి కృష్ణాజిల్లా బాస్కెట్ బాల్ పోటీలకు అట్కిన్‌సన్ (గొల్లపూడి) పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని కె.రిషిత సాగర్ ఎంపికైంది. ఈ నెల 16న నూజివీడులోని బేతెస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్ క్యాంపస్‌లో జరిగిన బాలబాలికల ఎంపికలో అండర్–14 బాలికల విభాగంలో రిషిత సాగర్ కనబరిచిన ప్రతిభతో పోటీలకు ఎంపిక చేసినట్లు కోచ్ ఎస్.సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట అజయ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించనున్న బాస్కెట్ బాల్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా తరఫున పాల్గొనేందుకు ఈ ఎంపికలు జరిగాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అట్కిన్‌సన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ ఫాతిమ పావని రిషిత సాగర్‌ను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వాహన చోదకుడికి గాయాలు



గన్నవరం: స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు ఆగిరిపల్లి రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి మలుపు తిరుగుతున్న లారీని విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. వేగంగా నియంత్రించలేక ముందు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన తిరివీధి భానును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ వెనుక టైర్లు కిందపడి భాను కాలు పూర్తిగా విరిగిపోయింది. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు రంగంలోకి దిగి ప్రమాదానికి గురైన లారీలను పక్కకు తప్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నియోజకవర్గంలో సోమవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. రాణిగారితోట, 17వ డివిజన్‌లో పలుచోట్ల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆనంద్‌భవన్ రోడ్డులో..

కృష్ణలంక, 22వ డివిజన్‌లోని ఆనంద్‌భవన్ రోడ్డులో ఆనంద్‌భవన్ రోడ్డు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. గణపయ్యకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గణనాథుడికి అవినాష్ ప్రత్యేక పూజలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా రాణిగారితోట, 17వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను మంగళవారం వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ దర్శించుకున్నారు. గణనాథుడి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ఆదిదేవుని కరుణా కటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి పాల్గొన్నారు.

పటమటలో..

పటమట(విజయవాడతూర్పు): పటమట గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో దత్తపీఠంలోని గణపతి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్షిప్ర గణపతి స్వామికి పంచామృత అభిషేకం చేశారు. అనంతరం స్వామి సహస్ర మోదక హోమం పూర్ణాహుతి చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. సందర్భంగా వన్ టౌన్ కూరపాటి పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య పెన్సిల్‌తో చిత్రించిన స్వామిజీ చిత్రపటాన్ని, పాఠశాల మ్యాగజైన్‌ను, తాను రచించిన కవితలు, శతకాలను స్వామిజీకి అందించారు.

తంగెళ్లమూడి వారి వీధిలో..

కుల, మత, ప్రాంతాల భేదం లేకుండా వినాయక చవితి పండుగను నిర్వహించడం అభినందనీయమని పటమట సీఐ డి.కాశీవిశ్వనాథ్ అన్నారు. వినాయక చవితి సందర్భంగా పటమట 11వ డివిజన్ వివేకానంద కాలనీ తంగేళ్లమూడి వారి వీధిలోని గాంధీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చవితి వేడుకల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యువజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బెజవాడ నజీర్, కాలనీ అధ్యక్షుడు తంగేళ్లమూడి వీర రాఘవయ్య, గద్దె వెంకటేశ్వరావు, భూషయ్య, రాము పాల్గొన్నారు.



బ్రహ్మానందరెడ్డి నగర్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న దేవినేని అవినాష్, కార్పొరేటర్ అమర్‌నాథ్

పండగలు ఐక్యతకు ప్రతీకలు

పటమట(విజయవాడతూర్పు): పండగలు ఐక్యతకు ప్రతీకలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ అన్నారు. వినాయక చతుర్థి సందర్భంగా చలువ పందిళ్లను సందర్శించి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. దర్శిపేట, రాజరాజేశ్వరి గుడి దగ్గర, కృష్ణవేణి స్కూల్ రోడ్, తోటవారి వీధి, మోహన్ దాస్ దగ్గర చెన్నూ కాంప్లెక్స్, అయ్యప్పనగర్ నెహ్రూ రోడ్, అచ్చమ్మ వీధి, కృష్ణలంక మెట్లబజార్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చవితి పందిళ్లను దర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్ట్ గురించి టీడీపీ–జనసేన నాయకులు ప్రభుత్వం పైన చేస్తున్న దుష్ప్రచారం, ఆరోపణలను ప్రజలు నమ్మబోరని పేర్కొన్నారు.

ఎన్ఎస్ మిత్ర బృందం ఆధ్వర్యంలో..

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక, 21వ డివిజన్‌లోని మెట్లబజార్‌లో ఎన్ఎస్ మిత్ర బృందం ఆధ్వర్యంలో మెట్లబజార్‌కా మహారాజ్ పేరిట వినాయక ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అమరావతి వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మల జ్యోతిక, కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజిబాబు, మిత్రబృందం సభ్యులు ఎం.నందు, కోనా సంతోష్, నాగార్జునరెడ్డి, సాయిబాబు పాల్గొన్నారు.

ప్రతి వీధిలోనూ పూజలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జై గణేష్.. జైజై గణేష్ నినాదాలతో మొగల్రాజపురం పరిసర ప్రాంతాలు మారుమోగాయి. వినాయక చవితి సందర్భంగా సోమ, మంగళవారాల్లో మొగల్రాజపురంతో పాటుగా పరిసర ప్రాంతాల్లోనూ వినాయక చవితి పందిళ్లల్లో గణనాథుడి విగ్రహాలకు భక్తులు పూజలు చేశారు. 6వ డివిజన్ బ్రహ్మానందరెడ్డి నగర్‌లో స్థానికులు ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో సోమవారం వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, కార్పొరేటర్ వియ్యపు అమర్‌నాథ్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇజ్జాడ తేజ పాల్గొని పూజలు చేశారు. బందులదొడ్డి సెంటర్‌లో జరిగిన వినాయక చవితి వేడుకల్లో కొత్తమాసు సాంబశివరావు, లక్ష్మి, నాగేంద్ర బాబు, శ్రీరంగనాయక్ దంపతులు పూజలు చేశారు. అనంతరం అన్నదానం జరిగింది. నిమ్మతోట సెంటర్, దాసరి లింగయ్య రోడ్డు, రావిచెట్టు సెంటర్ ఉత్సవాల్లో భక్తులు పాల్గొన్నారు.

15,16 డివిజన్లలో..

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 15,16 డివిజన్లలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాల్లో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 16 డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధిక తదితరులు వినాయక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.



గణపయ్య పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న దేవినేని అవినాష్



ఎన్ఎస్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బొప్పన భవకుమార్



రాణిగారితోటలో వినాయకుని పూజలో పాల్గొన్న కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి



ఆనందభవన్ రోడ్డులో పూజలందుకుంటున్న బొజ్జ గణపయ్య



బందులదొడ్డి సెంటర్లో వినాయక చవితి సందర్భంగా అన్నదానం



తంగెళ్లమూడి వారి వీధిలో చవితివేడుకల్లో పాల్గొన్న సీఐ కాశీ విశ్వనాథం



గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న బొప్పన భవకుమార్



సచ్చిదానంద ఆశ్రమంలో క్షిప్రగణపతికి అభిషేకం చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): వినాయక చవితి పండగను పురస్కరించుకుని వినాయక విగ్రహ నిమజ్జనాల సమయంలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. కృష్ణా నది ప్రాంతంలో ప్రకాశం బ్యారేజీ దిగువన, శనీశ్వర గుడి వెంబడి విగ్రహాల నిమజ్జనం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నిమజ్జనాలు బుధవారం నుంచి చేయవచ్చని, అందుకు అవసరమైన క్రేన్లు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఆయా పరిసరాలలో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణను చేపట్టి నదిలో వ్యర్థాలు వేయకుండా చెత్త తరలించు వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. నగరంలో విగ్రహ నిమజ్జనాలు ఇక్కడ తప్ప, మరో చోట చేసినా వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విగ్రహ నిమజ్జనం చేయు సమయంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకుని ఎటువంటి అపశ్రుతులు జరగకుండా అధికారులతో సహకరించి వారి సూచనలు పాటించాలని పేర్కొన్నారు. పూజకు ఉపయోగించిన సామగ్రి, పుష్పాలు, ఆకులు, పండ్లను నిరుపయోగంగా నదిలో లేదా కాలువలో వేయకుండా విజయవాడ నగరపాలక సంస్థ సిబ్బందికి అందించాలని తెలిపారు. పూజా సామగ్రిని గ్రీన్ వేవ్స్ రీసైక్లర్లు వారితో కలిసి వినూత్నంగా చేపట్టిన ఫ్లవర్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ద్వారా నిరుపయోగమైన పుష్పాలను పరిమళమైన అగరబత్తీలు, దూపాలను తయారు చేస్తామని పేర్కొన్నారు. ఆకులు, చెట్లను బయో మెథనైజేషన్ ప్లాంట్‌కు మిగిలిన వ్యర్థాలను విండో కంపోస్టింగ్ ద్వార ఎరువుగా తయారుచేస్తామని తెలిపారు.

ఆంజనేయ రాజు కళారంగ సేవలు ఆదర్శనీయం



ఆంజనేయరాజును సత్కరిస్తున్న సంగీత విద్వాంసుడు బ్రహ్మానందం, న్యాయవాది హేమలత

విజయవాడ కల్చరల్: సాహితీ సాంస్కృతిక రంగ ప్రముఖుడు బోడి ఆంజనేయరాజు సేవలను ఆదర్శంగా తీసుకోవాలని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు కేవీ బ్రహ్మానందరావు అన్నారు. తెలుగు కళావాహిని, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో నవ కథావైతాళికుడు గురజాడ అప్పారావు వర్ధంతి, గణేష మహోత్సవాల ముగింపు సందర్భంగా గాంధీనగర్ హనుమంతరాయా గ్రంథాలయంలో సోమవారం సినీ సంగీత విభావరి, సాహితీవేత్త బోడి ఆంజనేయరాజుకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందరావు మాట్లాడుతూ ఆంజనేయరాజు 30 సంవత్సరాలుగా నగరంలో సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు నిర్వహణలో కీలకమైన పాత్ర పోషించినట్లు తెలిపారు.

న్యాయవాది హేమలత ఆంజనేయరాజు సాహితీ సేవలను వివరించారు. ఆయన ఇటీవల అమెరికాలో జరిగిన ఆటా, నాటా నిర్వహించిన తెలుగు సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని పత్ర సమర్పణ చేసినట్లు పేర్కొన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆంజనేయరాజు దంపతులను సత్కరించారు. గాయనీ గాయకులు డేవిడ్‌రాజు, శ్యాంప్రసాద్, జయప్రభ, పావని, వద్దాది కామేశ్వరి, షబానా తదితరులు క్లాసికల్ గీతాలను ఆలపించారు. వివిధ రంగాలకు చెందిన జ్యోతిష్యశాస్త్ర వేత్త ప్రసూనా రామన్, గోళ్ల నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, బీవీ వీరభద్రరావు, డాక్టర్ భాగ్యశ్రీ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ భాస్కరరావు

పటమట(విజయవాడతూర్పు): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సెంట్రల్ డివిజన్ ఏసీపీ పి. భాస్కరరావు సూచించారు. ఆటోనగర్‌లోని ఏటీపీ హాల్లో పటమట సీఐ కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో 150 గణేష్ మండపాల నిర్వాహకులతో సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ప్రతి మండపం వద్ద పాయింట్స్ బుక్స్ ఏర్పాటు చేయాలని, పోలీస్ అధికారులు, బ్లూకోల్ట్స్ సిబ్బంది తరచూ తనిఖీ చేస్తార తెలిపారు. మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే నిర్వాహకులే బాధ్యత వహించాలన్నారు. చవితి నుంచి నిమజ్జనం వరకు పూర్తి బాధ్యతలను నిర్వాహకులు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎస్సైలు పద్మ, సత్యనారాయణ, శాతకర్ణి, విక్రమ్ పాల్గొన్నారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన దాత దుర్గా ఆనందరావు ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనక దుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వ్యవస్థాపక దినోత్సవం



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 89వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం పటమటలోని జోనల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్, డెప్యూటీ మేనేజర్ రజనికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిత్ర హాస్పిటల్, న్యూ సిటీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో మెడికల్ క్యాంప్, బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేయడంతో సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం కస్టమర్స్ సమావేశం నిర్వహించి బ్యాంక్ అభివృద్ధికి సహకరించడంపై వారికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఖాతాదారులకు మరిన్ని సేవలు అందించేందుకు కృషిచేస్తామని పేర్కొన్నారు.

కరాటేలో సత్తా చాటిన నలంద విద్యార్థులు

జాతీయ స్థాయి పోటీల్లో మెడల్స్



లబ్బీపేట(విజయవాడతూర్పు): నెల్లూరులోని సోమిశెట్టి కల్యాణ మండపంలో ఈ నెల 17న జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ 2023 పోటీల్లో నలంద విద్యార్థులు సత్తా చాటారు. అండర్–12 విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న నలంద విద్యానికేతన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. అండర్–11 విభాగంలో ఐదో తరగతి విద్యార్థిని అల్వినా గోల్డ్ మెడల్ సాధించగా, అండర్–12 విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థి కోట చరిష్ బ్రాంజ్ మెడల్‌ను గెలుపొందాడు. విజేతలను మంగళవారం స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదం ఎదురైతే ఎదిరించేలా ఉండాలన్నారు. ఆత్మరక్షణ విద్యలు నేర్పడం ద్వారా మాత్రమే ఆత్మవిశ్వాసం పెరిగి భయం పోతుందన్నారు. విజేతలు ఢిల్లీ, హర్యానాలో జరగనున్న ఇంటర్నేషనల్ పోటీల్లో కూడా సత్తా చాటి మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు.

మధురంగా సాగిన దాస పదామృతం



విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద మంగళవారం నిర్వహించిన దాస పదామృత కార్యక్రమం సంగీత వైభవాన్ని చాటింది. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్ వాగ్గేయకారులు, భక్తి తత్వవేత్తలు త్యాగరాజ స్వామి కీర్తన గిరిరాజ సుత, తూము నరసింహదాసు లేరానా సామి, పరాకుంశదాసు శ్రీరాముల, బొమ్మరాజు సీతారామదాసు భక్తి భిక్షాం దేహి, మన్నెకొండ హనుమదాసు, పరమాత్మ, పురందరదాసు కలియుగదల్లి, రామదాసు తక్కువేమి మనకు తదితర కీర్తనలను మధురంగా గానం చేశారు. వయోలిన్‌పై పాలపర్తి నాగేశ్వరరావు, వీణపై శశిధర్, మృదంగంపై సద్గురు చరణ్, ఘటంపై కేవీ కిషోర్ సహకరించారు. లంకతేజస్వి భక్త దాసుల కీర్తనల వైభవాన్ని వివరించారు. కార్యక్రమంలో అంజనా సుధాకర్. పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్, వేమూరి విశ్వనాథ్ పాల్గొన్నారు.

నిమజ్జనానికి ప్రత్యేక భద్రత

డీసీపీ విశాల్‌గున్ని



సీతమ్మ పాదాల వద్ద నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీసీపీ విశాల్‌గున్ని

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): వినాయక చవితి పండగను పురస్కరించుకుని నగరంలో ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలను పర్యవేక్షించనున్నట్లు నగర డెప్యూటీ పోలీస్ కమిషనర్ విశాల్‌గున్ని చెప్పారు. ఉత్సవ నిర్వాహకులు సోమవారం నుంచే వినాయక నిమజ్జనానికి తరలివచ్చారన్నారు. దీని దృష్ట్యా నగరంలో సోమవారం డీసీపీ విశాల్‌గున్ని నిమజ్జనానికి అనువైన ప్రదేశాలుగా కృష్ణలంక పీఎస్ పరిధిలోని సీతమ్మవారి పాదాలు సమీపంలోని ఘాట్, నున్న పీఎస్ పరిధిలోని పోలవరం కాలువలను ఎంపిక చేశామన్నారు. సీపీ ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లో పోలీస్ శాఖతోపాటు, మునిసిపాలిటీ, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేసుకుని నిమజ్జన ఘట్టాన్ని పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఎస్‌డీఆర్ఎఫ్ బలగాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. తనిఖీల్లో నార్త్ డివిజన్ ఏసీపీ సీహెచ్ రవికాంత్, సౌత్ ఏసీపీ రవికిరణ్, ఇన్‌స్పెక్టర్లు దుర్గారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిన్నారికి మానవత చేయూత

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారి శస్త్రచికిత్స నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయాన్ని అందజేసింది. బాపులపాడు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్న పొలిమెట్ల నాగరాజు కుమారుడు రోషన్(4) హృద్రోగంతో బాధపడుతుండటంతో వైద్య ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మానవత సభ్యులు రూ.7 వేల సాయాన్ని రోషన్ తల్లిదండ్రులకు అందజేశారు. మానవత జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రూ.371 కోట్లు దోచుకున్న దొంగ చంద్రబాబు

పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్



సీతమ్మధార (విశాఖ ఉత్తర): రాష్ట్ర ప్రజల సంపద రూ.371 కోట్లు దోచుకున్న దొంగ చంద్రబాబు అని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. మంగళవారం జీవీఎంసీ 14వ వార్డులోని ఉత్తర నియోజకవర్గం పార్టీ కార్యాలయం ఆవరణలో నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోట్ల రూపాయల ప్రజాధనం దోచుకున్న చంద్రబాబు కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఎవరికీ లేదన్నారు. తప్పు చేశాడు కాబట్టి శిక్ష అనుభవిస్తున్నాడన్నారు.

జగన్ పాలనలోనే మహిళలకు పెద్దపీట

లక్ష్మీపార్వతి



తిరుపతి (మంగళం): పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఇప్పుడు చర్చిస్తున్నారని, రాష్ట్రంలో నాలుగేళ్ల ముందే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేస్తూ అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించారని రాష్ట్ర తెలుగు–సంస్కృత అకాడమీ చైర్ పర్సన్ లక్ష్మీపార్వతి అన్నారు. ఆమె మంగళవారం తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం మహిళాబిల్లు ఆమోదం కోసం ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ మహిళలకు 60 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారని చెప్పారు. రూ. లక్షల కోట్ల అవినీతి పరుడైన చంద్రబాబుకు జీవితాంతం జైలుశిక్ష విధించినా తక్కువే అవుతుందన్నారు. పవన్ కాపుల ఆత్మగౌరవాన్ని చంద్రబాబు కాళ్ల దగ్గర పెట్టారన్నారు.

29 గ్రామాల ఉసురు తగిలే జైలుకు బాబు

1,087వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాజధాని పేరుతో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి పేదల నోళ్లు కొట్టి 29 గ్రామాలకు అన్యాయం చేసినందుకే చంద్రబాబు జైలు పాలయ్యారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్‌రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 1,087వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ అనేక కేసుల్లో స్టే తెచ్చుకుని బయట తిరుగుతున్న గజదొంగ చంద్రబాబు పేదవాడికి జానెడు జాగా ఇస్తుంటే తప్పుడు కేసులు వేయించి బహుజనుల ఉసురు పోసుకున్నాడని ధ్వజమెత్తారు. నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, నల్లమోతు విజయ నిర్మల, మందపాటి రమేష్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బెయిల్‌పై విచారణ 21కి వాయిదా

సాక్షి, అమరావతి: అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ డిజైన్ల ముసుగులో సాగిన భూ దోపిడీపై సీఐడీ 2022లో నమోదు చేసిన కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌లో తదుపరి విచారణ ఈ నెల 21వ తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ సురేష్‌రెడ్డి విచారణ జరిపారు. బాబు తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ కౌంటర్ ఇప్పుడే తమకు అందిందన్నారు. ఈ కౌంటర్‌కు సమాధానం ఇచ్చేందుకు తమకు సమయం కావాలని కోరారు. విచారణను బుధవారానికి వాయిదా వేయాలని అభ్యర్థించారు. సీఐడీ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ స్పందిస్తూ, బుధవారం వేరే కేసుల్లో తాను వాదనలు వినిపించాల్సి ఉందన్నారు. విచారణను గురువారానికి వాయిదా వేయాలని కోరారు. ఇరుపక్షాల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

బాబు అరెస్టుపై స్పందించాల్సిన అవసరం లేదు: సురేశ్‌బాబు

సాక్షి, హైదరాబాద్: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయిన ఏపీ మాజీ సీఎం చంద్రబాబు అరెస్టుపై చిత్ర పరిశ్రమ స్పందింంచాల్సిన అవసరం లేదని నిర్మాత డి.సురేశ్‌బాబు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సినీ పరిశ్రమ ఎప్పుడూ రాజకీయాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా ఉందని.. కొందరు కొన్ని రాజకీయ పార్టీలతో సంబంధాలు పెట్టుకున్నప్పటికీ అది పూర్తిగా వారి వ్యక్తిగతం.' అని సురేశ్‌బాబు చెప్పారు.

ఫైబర్ నెట్ కేసులోనూ చంద్రబాబుపై పీటీ వారెంట్

విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో దాఖలు చేసిన సీఐడీ

- ఫైబర్ నెట్ ప్రాజెక్టులోనూ చంద్రబాబు అవినీతి దందా
- అడ్డగోలుగా బినామీ కంపెనీకి టెండరు ఖరారు
- నిబంధనలన్నీ ఉల్లంఘించి మరీ ప్రాజెక్టు అప్పగింత
- పక్కా వ్యూహంతో ప్రజా ధనం మళ్లింపు
- షెల్ కంపెనీల ద్వారా రూ.284 కోట్లు అక్రమంగా తరలింపు
- అందులో రూ. 144 కోట్లు 'ముఖ్య' నేతకు చేరినట్టు గుర్తించిన సీఐడీ

ఆధారాలతో సహా బట్టబయలు

ఫైబర్ నెట్ కుంభకోణంపై కేసు నమోదు చేసిన సీఐడీ కీలక ఆధారాలు సేకరించింది. ముందుగా ఇండిపెండెంట్ ఏజెన్సీ ఐబీఐ గ్రూప్ ద్వారా ఆడిటింగ్ జరపడంతో మొత్తం అవినీతి బట్టబయలైంది. టెరా సాఫ్ట్ కంపెనీ నిబంధనలను ఉల్లంఘించిందని, నాసిరకం పరికరాలు సరఫరా చేసి ప్రభుత్వాన్ని మోసగించిందని ఐబీఐ గ్రూప్ నిర్ధారించింది. అనంతరం ఐపీసీ సెక్షన్లు 24, 166, 167, 418, 465, 468, 471, 409, 506, అవినీతి నిరోధక చట్టం 13(2) రెడ్‌విత్ 13(1) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్ట్ చేసింది. కుంభకోణంలో కీలక పాత్రధారులైన టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇన్‌క్యాప్ వీసీ కె.సాంబశివరావు, ఫాస్ట్‌లేన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ డైరెక్టర్ విప్లవ కుమార్, జెమిని కమ్యూనికేషన్స్ లిమిటెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్ రామ్మూర్తి, నిధుల తరలింపులో కీలకంగా వ్యవహరించిన కనుమూరి కోటేశ్వరరావులను సీఐడీ అధికారులు ఇప్పటికే అరెస్టు చేశారు. ఈ కేసులో ఏ1గా ఉన్న వేమూరి హరికృష్ణ ప్రసాద్, ఏ11 తుమ్మల గోపీచంద్, ఏ22 రామ్‌కుమార్ రామ్మూర్తి ముందస్తు బెయిల్ పొందారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు అరెస్టుకు అనుమతి కోరుతూ సీఐడీ పీటీ వారెంట్ దాఖలు చేయడంతో ఈ కేసులో తదుపరి పరిణామాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడిని ఫైబర్ నెట్ కుంభకోణంలో అరెస్టు చేసి విచారించేందుకు అనుమతించాలని సీఐడీ మంగళవారం విజయవాడ ఏసీబీ కోర్టులో ప్రిజనర్ ఇన్ ట్రాన్సిట్ (పీటీ) వారెంట్ దాఖలు చేసింది. ఇప్పటికే అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ పేరుతో చేసిన భూ దోపిడీ కేసులో ఏ1 చంద్రబాబును అరెస్ట్ చేసేందుకు పీటీ వారెంట్‌ను సీఐడీ ఇటీవల దాఖలు చేసింది. తాజాగా ఫైబర్ నెట్ కుంభకోణంలోనూ చంద్రబాబు పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభించడంతో న్యాయస్థానంలో పీటీ వారెంట్ దాఖలు చేసింది. అందుకు న్యాయస్థానం అనుమతిస్తే ఈ కేసులో కూడా చంద్రబాబును అరెస్ట్ చేసి విచారించి న్యాయస్థానంలో హాజరుపరచనుంది.

బినామీ కంపెనీకి అడ్డగోలుగా ప్రాజెక్టు

టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఫైబర్ నెట్ ప్రాజెక్టులో చంద్రబాబు అడ్డగోలుగా అవినీతికి పాల్పడ్డారు. మొత్తం రూ.2 వేల కోట్ల ఈ ప్రాజెక్టు కింద మొదటి దశలో రూ.333 కోట్ల విలువైన పనులు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా చంద్రబాబు, లోకేశ్‌లకు సన్నిహితుడైన వేమూరి హరికృష్ణ ప్రసాద్‌కు చెందిన 'టెరా సాఫ్ట్' కంపెనీకి టెండర్లు కట్టబెట్టారు. అందుకోసం టీడీపీ ప్రభుత్వం పక్కా పన్నాగంతో కథ నడిపించింది. చంద్రబాబు విద్యుత్, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల శాఖలను తన వద్దే అట్టిపెట్టుకున్నారు. వాస్తవానికి ఫైబర్ నెట్ ప్రాజెక్టును ఐటీ శాఖ చేపట్టాలి. కానీ ఈ ప్రాజెక్టును విద్యుత్, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల శాఖ చేపడుతుందని అప్పటి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నిర్ణయించారు.



పరస్పర ప్రయోజనాల నిరోధక చట్టానికి విరుద్ధంగా

ఫైబర్ నెట్ టెండర్లను తన బినామీ కంపెనీ అయిన టెరా సాఫ్ట్‌కు కట్టబెట్టడం కోసం చంద్రబాబు నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించారు. పరస్పర ప్రయోజనాల నిరోధక చట్టానికి విరుద్ధంగా టెరా సాఫ్ట్‌కు చెందిన వేమూరి హరికృష్ణ ప్రసాద్‌ను ముందుగానే రెండు కీలక పదవుల్లో నియమించారు. తొలుత ఆయన్ని ఏపీ ఈ– గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా చేర్చారు. నేర చరిత్ర ఉన్న ఆయన్ని అంతటి కీలక స్థానంలో నియమించడంపై అనేక అభ్యంతరాలు వచ్చినా పట్టించుకోలేదు. ఫైబర్ నెట్ టెండర్ల మదింపు కమిటీలోనూ సభ్యుడిగా నియమించారు. ఓ ప్రాజెక్టు టెండర్ల మదింపు కమిటీలో ఆ ప్రాజెక్టు కోసం పోటీ పడే సంస్థకు చెందిన వారు ఉండకూడదన్న నిబంధననూ ఉల్లంఘించారు. టెరా సాఫ్ట్ సంస్థ అప్పటికే బ్లాక్ లిస్టులో కూడా ఉంది. అంతకు ముందు చేపట్టిన ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయలేకపోవడంతో ఆ కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. కానీ చంద్రబాబు ఒత్తిడి తీసుకువచ్చి బ్లాక్ లిస్ట్ జాబితా నుంచి టెరా సాఫ్ట్ కంపెనీ పేరును తొలగించారు. అనంతరం పోటీలో ఉన్న పలు కంపెనీలను పక్కనబెట్టి మరీ టెరా సాఫ్ట్ కంపెనీకి ప్రాజెక్టును కట్టబెట్టారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను కూడా సాంకేతిక కారణాలతో అనర్హులుగా చేయడం గమనార్హం.

చంద్రబాబు బినామీ కంపెనీ కావడంతో ఫైబర్ నెట్ ప్రాజెక్టును టెరా సాఫ్ట్ కంపెనీ అత్యంత నాసిరకంగా చేసి నిధులు కొల్లగొట్టింది. టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న నాణ్యతా ప్రమాణాలను ఏమాత్రం పట్టించుకోలేదు. దాంతో 80 శాతం ప్రాజెక్టు పనులు నిరుపయోగమయ్యాయి. మరోవైపు షెల్ కంపెనీల ద్వారా ప్రజాధనాన్ని అక్రమంగా తరలించారు. వేమూరి హరికృష్ణ తన సన్నిహితుడు కనుమూరి కోటేశ్వరరావు సహకారంతో కథ నడిపించారు. వేమూరికి చెందిన కాఫీ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఫ్యూచర్ స్పేస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలలో కనుమూరి కోటేశ్వరరావు భాగస్వామిగా ఉన్నాడు. వేమూరి హరికృష్ణ, తుమ్మల గోపీచంద్, రామ్‌కుమార్ రామ్మూర్తిలతో కలసి విజయవాడ కేంద్రంగా నెటాప్స్ ఫైబర్ సొల్యూషన్స్ ఎల్‌ఎల్‌పీ అనే మేన్‌పవర్ సప్లై కంపెనీ పేరిట ఓ షెల్ కంపెనీని సృష్టించారు. ఆ కంపెనీ ఫైబర్ నెట్ ప్రాజెక్టుకు అవసరమైన సిబ్బందిని సమకూర్చినట్లు, పర్యవేక్షించినట్లు కథ నడిపించారు. ఈ ప్రాజెక్టుతో సంబంధం ఉన్న టెరా సాఫ్ట్ కంపెనీ, ఇతర కంపెనీలకు గత సర్కారు ఏకంగా రూ.284 కోట్లు విడుదల చేసింది. నకిలీ ఇన్వాయిస్‌లతో కొల్లగొట్టిన ఆ నిధులను కనుమూరి కోటేశ్వరరావు ద్వారా అక్రమంగా తరలించారు. వాటిలో రూ.144 కోట్లను షెల్ కంపెనీల ద్వారా టీడీపీ ప్రభుత్వంలో 'ముఖ్య' నేతకు చేరినట్టు సీఐడీ గుర్తించింది. ఇక నాసిరకమైన పనులతో కూడా ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లిందని నిగ్గు తేల్చింది.

షెల్ కంపెనీల ద్వారా..

చంద్రబాబు ముమ్మాటికీ అవినీతిపరుడే

- ఈ విషయాన్ని ప్రధాని మోదీయే బహిరంగంగా ప్రకటించారు
- ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని

సాక్షి, అమరావతి: 'స్కిల్' స్కామ్ కేసులో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న చంద్రబాబు నూరు శాతం అవినీతికి పాల్పడ్డాడని ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎఫ్‌డీసీ) చైర్మన్ పోసాని మురళీకృష్ణ పునరుద్ఘాటించారు. బాబు చేసిన అనేక స్కాముల్లో స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ ఒకటని ఆయన పేర్కొన్నారు. మంగళవారం విజయవాడ ఆర్టీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఎవరినైనా వాడుకుని వదిలేయడం, తాను మునిగిపోతానని అనుకున్నప్పుడు చుట్టూ ఉన్నవారిని ముంచేయడం కొత్త కాదన్నారు. ఇన్నాళ్లు ఆయన చేసిన అనేక తప్పులకు కోర్టులో స్టేలు తెచ్చుకుని బయట తిరుగుతున్నాడని, ఈ స్కిల్ స్కామ్‌లో మాత్రం ఆయన బయటకు వచ్చే అవకాశం లేదని అన్నారు. చంద్రబాబు ఎంత అవినీతిపరుడో సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగంగా చెప్పారన్నారు. ఎవరిమీదైనా నింద పడినప్పుడు దాన్ని ఖండిస్తారని, లేదా అది తప్పు అని నిరూపించుకునేందుకు ప్రయత్నిస్తారన్నారు. చంద్రబాబు మాత్రం తాను తప్పు చేయలేదని గాని, జరిగిన తప్పులతో తనకు సంబంధం లేదనిగాని ఎక్కడా చెప్పకపోగా, తనను విమర్శించడాన్ని తప్పుబట్టడం ఆయన అహంకారానికి నిదర్శనమని పోసాని పేర్కొన్నారు.

వెన్నుపోటు, ఎమ్మెల్యేల కొనుగోలు ప్రజల కోసమేనా..

చంద్రబాబు అహర్నిశలు ప్రజల బాగు కోసమే ఆలోచిస్తారని, అలాంటి వ్యక్తిని అన్యాయంగా జైల్లో పెట్టారని నారా భువనేశ్వరి, బ్రాహ్మణి చెప్పడాన్ని పోసాని తప్పుబట్టారు. 'నందమూరి తారక రామారావుని చెప్పులతో కొట్టించడం ప్రజల కోసమే చేశారా. ఆయన స్థాపించిన పార్టీని, ముఖ్యమంత్రి పదవిని లాక్కోవడం కూడా ప్రజల కోసమే చేశారా. ఫ్యాను గుర్తుపై గెలిచిన 23 మంది ఎమ్మెల్యేలకు డబ్బు, మంత్రి పదవులు ఎరవేసి లాక్కోవడం కూడా ప్రజల కోసమేనా?' అని ప్రశ్నించారు. దేశ స్వాతంత్య్రం కోసం నిస్వార్థంగా పాటుపడిన గాంధీ కంటే చంద్రబాబు గొప్పవాడిగా టీడీపీ నాయకులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. 'చంద్రబాబు తప్పు చేయకుంటే స్టేలు తెచ్చుకోవడం ఎందుకు. ధైర్యంగా కేసులు ఎదుర్కొని తన నిజాయితీని నిరూపించుకోవచ్చు కదా! లేదా చేసిన తప్పులకు పశ్చాత్తాపపడి జైలు శిక్ష అనుభవించాలి' అన్నారు.

బాబు భద్రత ప్రభుత్వ బాధ్యత

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి ప్రతినిధి, విజయనగరం: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అవినీతి కేసులో అరెస్టైన టీడీపీ అధినేత చంద్రబాబే కాదు.. ప్రతి ఒక్కరి భద్రత ప్రభుత్వ బాధ్యత అని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. అక్టోబర్ 30, 31 తేదీల్లో పైడితల్లి తొలేళ్లు, సిరిమానోత్సవాల నిర్వహణపై కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్షించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు తప్పు చేయకపోతే న్యాయస్థానాల్లో నిరూపించుకోవాలని హితవు పలికారు. అంతే తప్ప చిన్నపిల్లల చేష్టలు సరికాదన్నారు. ఈ కేసు విషయాన్ని పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తామంటూ టీడీపీ నేతలు చెబుతున్న అంశంపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు బొత్స స్పందిస్తూ.. కేంద్రానికి కాకపోతే ఐక్య రాజ్య సమితి దృష్టికి తీసుకెళ్లమనండి అన్నారు.

సీమెన్స్ ఖర్చు ఎక్కడ?

చంద్రబాబు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న ప్రకారం సీమెన్స్ సంస్థ తన 90 శాతం వాటా దాదాపు రూ.2,500 కోట్లలో ఒక్క రూపాయి ఎక్కడైనా ఖర్చు చేసిందా అనేది టీడీపీ నేతలు చూపించాలని మంత్రి బొత్స అన్నారు. 2005లో వోక్స్‌వ్యాగన్‌తో ఒప్పందం ప్రకారం ఎస్‌పీవీ ఏర్పాటైందని, కానీ వారి వాటా ప్రకారం చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించకుండా నాటి ప్రభుత్వం వాటాగా చెల్లించిన సొమ్మును అన్యాక్రాంతం చేశారని గుర్తుచేశారు. ఈ విషయాన్ని గుర్తించిన వెంటనే ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపించిందని, ఆ సొమ్ము రికవరీ చేయడమే గాక బాధ్యులపై చర్యలు తీసుకుందని పునరుద్ఘాటించారు. అలాగే, స్కిల్ కుంభకోణంలో సొమ్ము ఎక్కడికీ పోలేదని టీడీపీ నాయకులు చూపించుకోవచ్చు కదా అన్నారు. తప్పు చేస్తే మరో ఆరు నెలల్లో ప్రజాక్షేత్రంలో తేలిపోతుందని చెప్పారు. ప్రజాస్వామ్య దేశంలో ఇవన్నీ వదిలేసి హైదరాబాద్‌లోనూ, అమెరికాలోనూ నలుగురైదుగురిని పోగేసి నిరసనలంటూ ప్రదర్శనలు చేయడం, వ్యవస్థలను బెదిరించడం సరికాదని బొత్స హితవు పలికారు. మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని, ఆ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వ్యాఖ్యానించారు.

తొమ్మిదో రోజుకు చంద్రబాబు జైలు జీవితం

భువనేశ్వరి, బ్రాహ్మణి, యనమల ములాఖత్

సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న మాజీ సీఎం చంద్రబాబు జైలు జీవితం మంగళవారం తొమ్మిదో రోజుకు చేరింది. రోజులాగే ఆయన దినచర్య సాగింది. కాగా, సోమవారం చంద్రబాబును ఆయన భార్య నారా భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ములాఖత్ ద్వారా కలిశారు. సుమారు 40 నిమిషాలు వివిధ అంశాలపై చర్చించారు. అంతకుముందు వినాయక చవితి సందర్భంగా రాజమహేంద్రవరం నాళం భీమరాజువీధిలోని వినాయక ఆలయంలో నారా భువనేశ్వరి, బ్రాహ్మణి, నందమూరి రామకృష్ణ, వసుంధర ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ప్రసాదం తీసుకుని జైల్లో ఉన్న చంద్రబాబు వద్దకు భువనేశ్వరి, బ్రాహ్మణి వెళ్లి కలిశారు. చంద్రబాబు జైల్లో సంతోషంగా లేరని, కారాగారంలో ఉన్నా ఆయన ధ్యాసంతా కార్యకర్తల క్షేమంపైనే ఉందని యనమల రామకృష్ణుడు తెలిపారు. ములాఖత్ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జైల్లో చంద్రబాబుకు సౌకర్యాలు లేవని, ఆయన గదిలో దోమలు ఎక్కువగా ఉన్నాయని, ఏసీ సౌకర్యం కూడా కల్పించలేదని చెప్పారు.

ప్రజాధనాన్ని లూటీ చేశారు

- స్వలాభాపేక్షతో ఖజానాకు రూ.371 కోట్ల నష్టం
- ఇదంతా అప్పటి సీఎం చంద్రబాబుకు తెలిసే జరిగింది
- ఆయన ఆలోచనల్లో నుంచే ఈ కుంభకోణం పుట్టింది
- ప్రజాధనం దుర్వినియోగం అధికార విధుల్లో భాగం కాదు
- అందువల్ల కేసు నమోదుకు 17ఏ ప్రకారం గవర్నర్ అనుమతి అక్కర్లేదు
- ఆధారాల సేకరణకు ఏడాదిన్నర పట్టింది.. ఆ తరువాతే అరెస్టు చేశాం
- ఐటీ శాఖ, ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి.. అసలు దర్యాప్తు ఇప్పుడే మొదలైంది.. అడ్డుకోవద్దు
- హైకోర్టుకు నివేదించిన సీఐడీ తరఫు న్యాయవాదులు
- వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి



సాక్షి, అమరావతి: ప్రజాధనం దుర్వినియోగం అధికార విధుల్లో ఎంతమాత్రం భాగం కాదని, అందువల్ల స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ సీఎం చంద్రబాబుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు గవర్నర్ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. చంద్రబాబు స్వలాభాపేక్షతో, ఉద్దేశపూర్వకంగా రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, రంజిత్ కుమార్, అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు మంగళవారం నివేదించారు. ఇదంతా అప్పటి సీఎం చంద్రబాబుకు తెలిసే, ఆయన సమక్షంలోనే జరిగిందన్నారు. ప్రభుత్వ ఖజానాకు రూ.371 కోట్ల మేర నష్టం వాటిల్లిందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కుంభకోణంలో చంద్రబాబు పాత్రకు సంబంధించి పూర్తి ఆధారాలను సేకరించేందుకు సీఐడీకి ఇంత సమయం పట్టిందని, చిన్న ఛాన్స్ కూడా తీసుకోలేదని, పక్కా ఆధారాలున్నాయని నిర్ధారించుకున్న తరువాతనే చంద్రబాబు అరెస్ట్ వరకు వెళ్లామన్నారు. గుజరాత్‌లో ఇదే స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలకు రూ.కోటి చెల్లించగా, మన రాష్ట్రంలో మాత్రం అవే కేంద్రాలకు రూ.వందల కోట్లు చెల్లించారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కేసు రాజకీయ ప్రేరితమంటూ చంద్రబాబు తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని కోర్టుకు వివరించారు. నిజాయతీతో పనిచేసే అధికారులు, ప్రభుత్వాన్ని నడిపే వ్యక్తులను రాజకీయ కక్ష సాధింపుల నుంచి కాపాడేందుకే అవినీతి నిరోధక చట్టంలో 17ఏను చేర్చారే కానీ, నిర్భీతితో పట్ట పగలే ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబు వంటి వారి కోసం కాదన్నారు. ప్రజాధనానికి ధర్మకర్తగా, రక్షకుడిగా వ్యవహరించాల్సిన వ్యక్తి భక్షకుడిగా మారి రూ.వందల కోట్లను దారి మళ్లించేశారన్నారు. ఇది పూర్తిగా అనధికారిక విధుల కిందకే వస్తుందని, అందువల్ల చంద్రబాబుకు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ఎంత మాత్రం వర్తించదని స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదని, ఈ దశలో దర్యాప్తునకు ఆటంకం కలిగించేలా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయవద్దని కోర్టును అభ్యర్థించారు. ఈ కేసులో ఇప్పటికే ఆదాయపు పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సైతం దర్యాప్తు చేపట్టాయని నివేదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా విచారణ నిమిత్తం చంద్రబాబును తమ కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబు తరఫు న్యాయవాదులను సోమవారం వరకు ఒత్తిడి చేయవద్దంటూ ఏసీబీ కోర్టును ఆదేశిస్తూ గత వారం ఇచ్చిన ఉత్తర్వులను న్యాయమూర్తి పొడిగించలేదు.

సుదీర్ఘంగా వాదనలు..

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయిన మాజీ సీఎం చంద్రబాబు జ్యుడీషియల్ రిమాండ్‌లో భాగంగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే. ఈ కుంభకోణంలో సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ చంద్రబాబు గత మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు ఆధారంగా విజయవాడ ఏసీబీ కోర్టు తనకు రిమాండ్ విధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సైతం కొట్టేయాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టులో మధ్యాహ్నం 12.05 గంటలకు మొదలైన వాదనలు సాయంత్రం 5.20 వరకు నిరాటంకంగా కొనసాగాయి. వాదనల సమయంలో కోర్టు హాలు కిక్కిరిసిపోయింది. చంద్రబాబు తరఫున దేశంలోనే అత్యంత ఖరీదైన సీనియర్ న్యాయవాదిగా పేరున్న హరీష్ సాల్వే, టీడీపీ తరఫున ప్రతి కేసును వాదించే మరో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. లండన్‌లో ఉంటున్న హరీష్ సాల్వే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన వాదనలను వినిపించారు. ఈ సందర్భంగా అర్నబ్ గోస్వామి కేసును కూడా ప్రస్తావించారు. 2024లో ఎన్నికలు రాబోతున్నాయని, వాటిని దృష్టిలో పెట్టుకునే ఇప్పుడు చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. ప్రభుత్వం తన కౌంటర్‌ను చివరి నిమిషంలో తమకు అందచేసిందని, ముందే అందచేసి ఉండాల్సిందని సాల్వే పేర్కొనగా, సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ జోక్యం చేసుకుని ఇది కూడా కక్షపూరిత రాజకీయంలో భాగమేనంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు.

చంద్రబాబు మనుషులు విదేశాలకు పారిపోయారు..

ఐటీ శాఖ అధికారులు చంద్రబాబుకు సంబంధించిన ఇద్దరు వ్యక్తులకు నోటీసులు ఇవ్వగానే ఒకరు దుబాయ్‌కి, మరొకరు వాషింగ్టన్‌కు పారిపోయారని సీఐడీ తరఫున న్యాయవాదులు తెలిపారు. డిజైన్ టెక్ కంపెనీ రూ.200 కోట్లు దారి మళ్లించినట్లు ఫోరెన్సిక్ ఆడిట్‌లో బహిర్గతమైందన్నారు. పలు కీలక డాక్యుమెంట్లను మాయం చేశారని, వాటన్నింటినీ కూడా వెతికే పనిలో దర్యాప్తు అధికారులుఉన్నారని తెలిపారు. ముగ్గురి వాదనలు పూర్తి కాగానే దీనిపై సాల్వే, లూథ్రా తిరుగు సమాధానం ఇచ్చారు. అనంతరం న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ ఈ వ్యవహారంలో ఏం చెప్పాలనుకున్నా, ఇప్పుడే చెప్పాలని, ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం లేదని, ప్రధాన వ్యాజ్యంపైనే నిర్ణయం వెలువరిస్తానని తేల్చి చెప్పారు. ఇరుపక్షాలు వాదనలు పూర్తి చేయడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

10 రోజుల్లోనే కొట్టేయాలంటున్నారు

సీఐడీ తరఫున ముకుల్ రోహత్గీ, రంజిత్ కుమార్, పొన్నవోలు సుధాకర్‌రెడ్డిలు వాదనలు వినిపిస్తూ స్కాం జరిగిన తీరును వివరించారు. స్కిల్ కుంభకోణంలో దర్యాప్తు కొనసాగుతోందని, పలువురిని విచారించాల్సి ఉందని, మరి కొందరిని అరెస్ట్ చేయాల్సి ఉందని తెలిపారు. దర్యాప్తు దశలో కేసును కొట్టేయడానికి వీల్లేదని, ఈ విషయంలో సుప్రీంకోర్టు చాలా స్పష్టమైన తీర్పునిచ్చిందంటూ నిహారికా కేసులో సుప్రీంకోర్టు తీర్పును చదివి వినిపించారు. సెప్టెంబర్ 7న చంద్రబాబును నిందితుడిగా చేర్చారని, 9న అరెస్ట్ చేశారని, 12న ఆయన తనపై కేసును కొట్టేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. చంద్రబాబుపై కేసు నమోదు చేసి కేవలం 10 రోజులే అయిందన్నారు. తాము కౌంటర్ ఇప్పుడే ఇచ్చామని చంద్రబాబు న్యాయవాదులు చెబుతున్నారని, వాస్తవానికి 900 పేజీల అదనపు డాక్యుమెంట్లను వారు ఇప్పుడే తమకు అందచేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ప్రజాధనాన్ని లూటీ చేసిన వారికి అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ అసలు వర్తించదన్నారు. కేసు నమోదు చేసింది 2021లో కావొచ్చు, కానీ కథ నడిచింది మొత్తం 2014, ఆ తరువాతేనని కోర్టుకు నివేదించారు. 2018కి ముందే ఈ కుంభకోణం వ్యవహారంలో సీఐడీ ప్రాథమిక దర్యాప్తు జరిపిందని వివరించారు. రికార్డులను తారుమారు చేయడం, ప్రజాధనాన్ని కొల్లగొట్టడం పబ్లిక్ డ్యూటీ కిందకు రానే రాదన్నారు. అప్పటి ప్రభుత్వ పెద్ద ఆలోచనల నుంచే ఈ కుంభకోణం మొదలైందని రోహత్గీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఐటీ శాఖ, ఈడీ దర్యాప్తు చేస్తున్నాయన్నారు. డ్యాం కట్టాం, వరదల వల్ల అది కొట్టుకుపోయింది.. మా తప్పేమీ లేదని చెప్పేంత చిన్న వ్యవహారం కాదని కోర్టుకు నివేదించారు. ఈ కుంభకోణం వెనుక లోతైన కుట్ర ఉందన్నారు. ప్రజాధనాన్ని లూటీ చేసిన పెద్దలు, దానిని దారి మళ్లించేందుకు పలు షెల్ కంపెనీలను సృష్టించారని, ఇందుకు పక్కా ఆధారాలున్నాయంటూ కోర్టు ముందుంచారు. కేసు డైరీని సైతం కోర్టుకు సమర్పించి కీలక ఆధారాలను నివేదించారు. అత్యంత అరుదైన కేసుల్లో మాత్రమే హైకోర్టు సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద తనకున్న అధికారాన్ని ఉపయోగించగలదన్నారు. ప్రాథమిక దశలో దర్యాప్తును కొనసాగించకుండా పోలీసులను నియంత్రిస్తూ ఉత్తర్వులు జారీ చేయడానికి వీల్లేదని తెలిపారు. దర్యాప్తు ప్రాథమిక దశలో కోర్టులు ఆరోపణల పూర్వాపరాల్లోకి వెళ్లడానికి వీల్లేదన్నారు. దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్‌ను దాఖలు చేసేందుకు పోలీసులకు అనుమతినివ్వాలని కోరారు. ఈ కేసు రాజకీయ ప్రేరేపితం అని చెబుతున్నారని, అదే నిజమైతే 2021లోనే చంద్రబాబును నిందితుడిగా చేర్చి అరెస్ట్ చేసే వారమన్నారు. ఈ కుంభకోణంలో చంద్రబాబు పాత్రకు సంబంధించి ఆధారాలు లభించాయి కాబట్టే ఇప్పుడు అరెస్ట్ చేశామన్నారు. స్కిల్ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ముందే రూ.300 కోట్లకు పైగా మొత్తాన్ని ప్రైవేటు కంపెనీల పేరు మీద మళ్లించేశారు, అదే ఇక్కడ కీలక విషయమని కోర్టుకు వివరించారు. ఒప్పందంలో భాగమైన రెండు ప్రైవేటు కంపెనీలు కలిసి మూడో కంపెనీని తెరపైకి తెచ్చి, ఆరు షెల్ కంపెనీలను సృష్టించి నిధులను మళ్లించేశాయన్నారు. ఇదంతా కూడా చంద్రబాబుకు తెలిసే జరిగిందని వివరించారు. నిధుల చెల్లింపునకు ఆయనే అనుమతినిచ్చారని తెలిపారు. ఇదంతా తాము చెబుతున్నది కాదని, కాగితాలే అందుకు సాక్ష్యమన్నారు.

కార్పొరేషన్‌ను ప్రతివాదిగా చేర్చాల్సిందే..

ఈ కుంభకోణంపై ఫిర్యాదు చేసిన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌డీసీ)ను ప్రతివాదిగా చేర్చకుండానే పిటిషన్ దాఖలు చేశారని న్యాయవాది సన్నపురెడ్డి వివేక్ చంద్రశేఖర్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ కేసులో కె.అజయ్‌రెడ్డిని ప్రతివాదిగా చేర్చారని, ఆయనకు ఇప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో ఎలాంటి సంబంధం లేదని గట్టిగా చెప్పారు. అందువల్ల కార్పొరేషన్‌ను ప్రతివాదిగా చేర్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ ఈ విషయాన్ని ముందే చెప్పి ఉండాల్సిందని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

జేఈఈ మెయిన్ తేదీలు ఖరారు

- జనవరి 24 నుంచి తొలి విడత.. ఏప్రిల్ 1 నుంచి రెండో విడత
- మే 5న నీట్

సాక్షి, హైదరాబాద్ : ప్రతిష్టాత్మక ఐఐటీలు, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ మెయిన్ పరీక్ష తేదీలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేసింది. కోవిడ్ కాలంలో నాలుగు దఫాలుగా నిర్వహించిన ఈ పరీక్షను 2024–25లో మాత్రం రెండు విడతలుగానే నిర్వహిస్తున్నట్టు తెలిపింది. తొలి విడతను 2024 జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ మధ్య చేపట్టాలని నిర్ణయించింది. రెండో దఫా జేఈఈ మెయిన్‌ను ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ మధ్య నిర్వహించబోతున్నట్టు వెల్లడించింది. దీంతో పాటే మే 5న నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్ (నీట్–యూజీ), మే 15–31 తేదీల మధ్య కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ), మార్చి 11–28 మధ్య సీయూఈటీ–పీజీ, జూన్ 10–21 మధ్య యూజీసీ–నెట్ పరీక్షలను నిర్వహించేందుకు తేదీలను ఖరారు చేసింది. ఈ పరీక్షలన్నీ కంప్యూటర్ ఆధారంగానే ఉంటాయని పేర్కొంది. అయితే, సమగ్ర వివరాలతో కూడిన షెడ్యూల్‌ను ఎన్టీఏ విడుదల చేయాల్సి ఉంది.

ఏపీ పీసెట్ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల

ఏఎన్‌యూ: రాష్ట్ర వ్యాప్తంగా వ్యాయామ విద్య కళాశాలల్లో ఉన్న బీపీఈడీ, డీపీఈడీ కోర్సులలో ప్రవేశానికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహిస్తున్న ఏపీ పీసెట్–2023 అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల చేశామని ఏపీ పీసెట్ కన్వీనర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. 22 నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో పాల్గొనాలని తెలిపారు. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో కళాశాలల ఎంపికకు ఆప్షన్స్ నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. కళాశాలల కేటాయింపు ఈ నెల 30వ తేదీన జరుగుతుందని, సీటు పొందిన వారు అక్టోబర్ 3 నుంచి 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్ట్ చేసి, కళాశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్స్ హాల్‌టికెట్లు

సాక్షి, అమరావతి: ఏపీ అటవీశాఖలో ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్స్ (ఎఫ్ఆర్వో) పోస్టుల భర్తీకి ఉద్దేశించిన ఆన్‌లైన్ రాత పరీక్ష (సీబీటీ) ఈ నెల 25, 26, 27 తేదీల్లో ఉంటుందని ఏపీపీఎస్సీ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన హాల్ టికెట్లు కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు. వెబ్‌సైట్ https://psc.ap.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టాలి

- ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు



తెనాలి: వర్షాకాలపు ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లోనే చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల్ కమిషన్ ప్రకారం దేశంలో 50 శాతానికి పైగా బీసీలున్నట్టు తెలిపారు. ఇప్పటికీ బీసీలకు రాజ్యాధికారం అందని ద్రాక్షగా ఉందన్నారు. ఇప్పటికైనా చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలనీ, లేకుంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇదే సమయంలో పార్లమెంటులో మహిళా బిల్లు ప్రవేశపెట్టనుండడం శుభపరిణామం అన్నారు.

మాజీ ఎమ్మెల్యే కాకర నూకరాజు మృతి



నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే కాకర నూకరాజు (80) సోమవారం ఉదయం మృతిచెందారు. ఆయన ఆదివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ కన్నుమూశారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరు గ్రామానికి చెందిన నూకరాజు హాస్టల్ వార్డెన్‌గా పనిచేసేవారు. ఆయన 1984లో టీడీపీలో చేరారు. పాయకరావుపేట ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి 1984, 1989, 1994 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నిక య్యారు. 1999లో అన్న తెలు గుదేశం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో బీజేపీ తరఫున పాయకరావుపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. నూకరాజు రాజకీయ నేతగానే కాకుండా రంగస్థల కళాకారుడిగా కూడా మంచి గుర్తింపు పొందారు. నూకరాజు మరణం పట్ల ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు తదితరులు సంతాపం తెలిపారు.

శాస్త్రీయంగా.. సమర్థంగా..

ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో నూతన విధానాలపై కసరత్తు

- గ్రూప్–1 ప్రిలిమ్స్ ఒక పేపర్, మెయిన్స్‌లో 4 పేపర్లు
- మెయిన్స్‌లో రెండు పేపర్లు ఆబ్జెక్టివ్ విధానంలో...
- మరో రెండు పేపర్లు డిస్క్రిప్టివ్‌లో నిర్వహించాలని భావన
- అధ్యయనం కోసం రెండు కమిటీల ఏర్పాటు
- సిలబస్‌లో మార్పు లేదు
- నెల రోజుల తర్వాత గ్రూప్–1 నోటిఫికేషన్
- గ్రూప్–2 పోస్టులు పెరిగే అవకాశం
- ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్ వెల్లడి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) పరీక్షలు, మూల్యాంకనం, అభ్యర్థుల ఎంపిక విధానాన్ని శాస్త్రీయంగా, మరింత సమర్థంగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు కమిషన్ చైర్మన్ గౌతం సవాంగ్ తెలిపారు. అభ్యర్థుల వాస్తవిక నైపుణ్యాన్ని అంచనా వేసి పూర్తి సమర్థులైన వారిని ఎంపిక చేసేలా కొత్త విధానాలకు రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పరీక్షా విధానాల మార్పునకు సంబంధించి జరుగుతున్న కసరత్తు గురించి వివరించారు. పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో అవసరమైన మార్పులపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్నతాధికారులతో ఒక కమిటీ నియమించిందని తెలిపారు. దానికి అనుబంధంగా ఏపీపీఎస్సీలో అంతర్గతంగా తాము రెండు కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నియామక విధానాలపై ఏపీపీఎస్సీ సభ్యుడు సలాం బాబు నేతృత్వంలో అపార నైపుణ్యం ఉన్న ఐదుగురితో ఒక కమిటీ, వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న సీనియర్ ప్రొఫెసర్లతో మరో కమిటీ నియమించినట్లు వివరించారు. దీంతోపాటు వివిధ రంగాలకు చెందిన మేధావుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత విధానాలపై అభ్యర్థులు, తల్లిదండ్రులు, సమాజంలోని పలువురి నుంచి రకరకాల అభ్యంతరాలు వస్తున్నాయని, అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, వీటన్నింటికి పరిష్కారం చూపేలా సరికొత్త విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. తాము నియమించిన కమిటీలు వివిధ రాష్ట్రాల్లో అనుసరిస్తున్న నియామక విధానాలు, ఉత్తమ ప్రాక్టీసులను అధ్యయనం చేసి ఒక నివేదిక ఇస్తాయని చెప్పారు. ఐఐఎం వంటి అత్యుత్తమ సంస్థల ప్రొఫెసర్ల నుంచి సైతం అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రశ్నపత్రాలు ఎలా ఉండాలి? ఎలా రూపొందించాలి? మూల్యాంకనం ఎలా ఉండాలి? ఎలా చేయాలి? ఇతర రాష్ట్రాలు, యూపీఎస్సీ వంటి సంస్థలు ఎలాంటి పద్ధతులను అనుసరిస్తున్నాయి? అనే అంశాలను వివిధ కోణాల్లో పరిశీలిస్తున్నట్లు సవాంగ్ వివరించారు. కమిటీలు ఇచ్చిన సిఫారసులు, ప్రజలు, మేధావుల నుంచి వచ్చిన అభిప్రాయాలను పరిశీలించి మార్పులు చేపడతామని చెప్పారు.




గౌతం సవాంగ్

మార్పులు ఇలా...!

ప్రస్తుతం గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో రెండు పేపర్లు ఉన్నాయని, దాన్ని ఒక పేపర్ చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు గౌతం సవాంగ్ తెలిపారు. స్క్రీనింగ్ దశ పరీక్ష కాబట్టి ఒక పేపర్ సరిపోతుందనే అభిప్రాయాలు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. గతం కన్నా సులభంగా ప్రిలిమ్స్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెయిన్స్‌లో కూడా ఇప్పుడు ఉన్న ఐదు పేపర్లను నాలుగు పేపర్లకు తగ్గించి, అందులో రెండు పేపర్లు వ్యాసరూప ప్రశ్నలు (డిస్క్రిప్టివ్), రెండు పేపర్లు ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో రూపొందించాలనే దిశగా కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే, సిలబస్ మారదని, ఉన్నదాన్నే కొంత రీఫ్రేమ్ చేసే అవకాశం ఉందని చెప్పారు. సిలబస్ గురించి అభ్యర్థులకు ఎలాంటి అపోహలు, ఆందోళన అవసరం లేదన్నారు. మూల్యాంకన విధానాన్ని మార్చేందుకు అధ్యయనం జరుగుతోందన్నారు. మొత్తంగా నియామక విధానాన్ని సులభంగా, సౌలభ్యంగా మార్చే దిశగా కసరత్తు చేస్తున్నామన్నారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, వారిలో వాస్తవ సామర్థ్యాన్ని వెలికితీసేలా కొత్త విధానం ఉంటుందన్నారు. గ్రూప్–1 నోటిఫికేషన్ నెల రోజుల తర్వాత విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. గ్రూప్–2 పోస్టుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

మరో 5 మెడికల్ కాలేజీలు

వచ్చే ఏడాది పాడేరు, పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లెల్లో కొత్త కళాశాలలు




- ఎన్ఎంసీకి దరఖాస్తు చేసిన కళాశాలల ప్రిన్సిపల్స్
- ఒక్కో చోట 150 చొప్పున 750 ఎంబీబీఎస్ సీట్లు
- రూ.8,480 కోట్లతో 17 కళాశాలలు ఏర్పాటు చేస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం
- ఈ ఏడాది ఐదు కళాశాలలు ప్రారంభించిన సీఎం జగన్
- వీటిలో 750 సీట్లు.. తరగతులు మొదలు
- 2025–26 విద్యా సంవత్సరంలో మిగతా కళాశాలలు ప్రారంభం

అన్ని వనరులతో వైద్య కళాశాలలు

కొత్తగా ప్రారంభించే వైద్య కళాశాలల్లో ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా అన్ని వనరులను ప్రభుత్వం సమకూరుస్తోంది. సరిపడా వైద్యులు, వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ కళాశాలలు ప్రారంభించడానికి ఎన్ఎంసీకి దరఖాస్తు చేశాం. అదే విధంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభించిన ఐదు కళాశాలలకు ఫస్ట్ రెన్యువల్‌కు దరఖాస్తు చేశాం.

– డాక్టర్ నరసింహం,
డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్

సాక్షి, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో మరో ఐదు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కళాశాలల ప్రారంభానికి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి ఆ కళాశాలల ప్రిన్సిపల్స్ దరఖాస్తు చేశారు. పాడేరు, మార్కాపురం, పులివెందుల, ఆదోని, మదనపల్లెలో ఈ కళాశాలలు నిర్మిస్తున్నారు. ఒక్కో కాలేజీలో 150 సీట్లతో 2024–25 విద్యా సంవత్సరం నుంచి అకడమిక్ కార్యకలాపాలు ప్రారంభించడానికి దరఖాస్తు చేశారు. అంటే మొత్తం 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా అందుబాటులోకి వస్తాయి. ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా వీటిలో ఒక్కో కళాశాలకు 222, బోధనాస్పత్రికి 484 చొప్పున మొత్తం 3,530 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పోస్టులను భర్తీ చేసి, కళాశాలలకు అనుమతి కోసం దరఖాస్తు చేశారు. ఈ ఐదు చోట్ల ఉన్న ఏపీవీవీపీ ఆస్పత్రులను ప్రభుత్వం 330 పడకల బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేస్తోంది. వీటిని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోకి తెస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ తరగతుల ప్రారంభానికి వీలుగా అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, పాథాలజీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఎస్పీఎం, జనరల్ మెడిసిన్, గైనిక్, పీడియాట్రిక్స్ వంటి వివిధ విభాగాలను ఏర్పాటు చేసింది.



రూ. 8,480 కోట్లతో 17 కళాశాలలు

ప్రజలకు ప్రభుత్వ రంగంలో మెరుగైన వైద్య వసతులు సమకూర్చడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. రూ.16వేల కోట్లకు పైగా ఖర్చుతో నాడు–నేడు కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా రూ.8,480 కోట్లతో ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఉండేలా 17 కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కాలేజీల ద్వారా ఏకంగా 2,550 ఎంబీబీఎస్ సీట్లు కొత్తగా అందుబాటులోకి తెస్తున్నారు. ఇటీవలే సీఎం వైఎస్ జగన్ నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం వైద్య కళాశాలలను ప్రారంభించారు. వీటి ద్వారా 750 సీట్లు అదనంగా వచ్చాయి. ఈ కళాశాలల్లో తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే ఐదు కొత్త కాలేజీల ద్వారా మరో 750 సీట్లు సమకూరనున్నాయి. ఇక మిగిలిన ఏడు వైద్య కళాశాలలను 2025–26 విద్యా సంవత్సరంలో ప్రారంభించనున్నారు.

ఏపీ విద్యా విధానం అభినందనీయం

- కొలంబియా వర్సిటీ ప్రొఫెసర్ జెఫ్రీ సాచ్ ప్రశంస
- విద్యారంగం అభివృద్ధికి గొప్ప చర్యలు చేపట్టడంపై కితాబు



కొలంబియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ జెఫ్రీ సాచ్‌తో మాట్లాడుతున్న ఏపీ విద్యార్థులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గ్లోబల్ విద్యా విధానాన్ని అనుసరించడం, పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం గొప్ప విషయమని కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్, సెంటర్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జెఫ్రీ సాచ్ అన్నారు. ఐక్యరాజ్య సమితి సదస్సుకు హాజరైన ఏపీ విద్యార్థులు కొలంబియా యూనివర్సిటీలోని ఎస్డీజీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సులో కూడా ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి జెఫ్రీ సాచ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యూఎన్ఓ స్పెషల్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్‌కుమార్ ఏపీ విద్యార్థులను జెఫ్రీ సాచ్‌కు పరిచయం చేశారు. ఆయన విద్యార్థుల కోసం కొంత సమయాన్ని కేటాయించి వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపీ విద్యార్థులు తమ కుటుంబ నేపథ్యాలను.. రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, విద్యా సంక్షేమ పథకాలు.. అవి పేద విద్యార్థుల ప్రగతికి ఎలా దోహదం చేస్తున్నాయో వివరించారు.

ఏపీలో గొప్ప చర్యలు

అనంతరం జెఫ్రీ సాచ్ మాట్లాడుతూ.. ప్రపంచంలోని ప్రతి బిడ్డా చదువుకోవాలని, ఆయా దేశాల ప్రభుత్వాలు విద్యకోసం అధిక నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ప్రపంచవ్యాప్తంగా విద్యా సంస్కరణల కోసం తాను 25 ఏళ్లుగా పోరాడుతున్నానని, ఏపీలో గొప్ప చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా అమ్మ ఒడి, డిజిటల్ విద్య, ట్యాబ్స్ పంపిణీ, ఇంగ్లిష్ ల్యాబ్స్ ఏర్పాటు, టోఫెల్ శిక్షణపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. పిల్లలు ప్రతి ఒక్కరూ బడికి వెళ్లేలా చూడాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉందన్నారు. తన ఆకాంక్షలకు అనుగుణంగా పిల్లలను బడికి పంపించే తల్లుల అకౌంట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నగదు జమ (అమ్మ ఒడి) చేయడాన్ని ప్రొఫెసర్ జెఫ్రీ అభినందించారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా విదేశాల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఏపీ ప్రభుత్వం నూరు శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్న విషయాన్ని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకు రాగా.. ఇది ఎంతో గొప్ప చర్యగా ఏపీ ప్రభుత్వాన్ని అభినందించారు. ఇప్పుడు వర్సిటీ వేదికపై ప్రసంగించిన విద్యార్థులంతా ఈ పథకం ద్వారా కొలంబియా యూనివర్సిటీలో చదువుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర అమెరికా ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పండుగాయల రత్నాకర్ పాల్గొన్నారు.

ప్రపంచం మెచ్చిన మేధావి ప్రొఫెసర్ జెఫ్రీ సాచ్

ప్రొఫెసర్ జెఫ్రీ సాచ్ కొలంబియా యూనివర్సిటీలో అత్యున్నత అకడమిక్ ర్యాంక్ గల ప్రొఫెసర్ హోదాలో ఉన్నారు. వివిధ పుస్తకాలు రచించిన ఆయన టైమ్ మ్యాగజైన్‌లో 100 మంది అత్యంత ప్రభావవంతమైన ప్రపంచ నాయకుల్లో రెండుసార్లు పేరు పొందటంతోపాటు 42 గౌరవ డాక్టరేట్లను సైతం అందుకున్నారు. గతంలో హార్వర్డ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా సేవలందించిన ఈయన కొలంబియా వర్సిటీలోని సెంటర్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా విద్యా సంస్కరణల కోసం కృషి చేస్తున్నారు. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్స్ కోఫీ అన్నన్, బాన్ కీ మూన్‌తో పాటు ప్రస్తుత సెక్రటరీ జనరల్ అన్‌టోనియో గుటెరస్‌కు ప్రత్యేక సలహాదారుగా కొనసాగుతున్నారు. ప్రపంచ దేశాల అధినేతలు, ప్రధానులు గౌరవించే ప్రొఫెసర్ జెఫ్రీ సాచ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యా సంస్కరణలను అభినందించడం విశేషం.

పారదర్శకంగా నంది నాటకోత్సవాలు

నాటకాల ఎంపికలో జ్యూరీ సభ్యులదే తుది నిర్ణయం

- ప్రాథమిక దశలో 115 ఎంట్రీల నుంచి ఫైనల్స్‌కు 38 నాటకాల ఎంపిక
- ఐదు విభాగాల్లో 73 అవార్డులు ప్రదానం
- గత ప్రభుత్వ హయాంలో ఎన్నో అవకతవకలు
- ఈ ఏడాది నగదు బహుమతి మొత్తం పెంపు
- ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణ మురళి



జ్యూరీ సభ్యులతో కలిసి వివరాలు వెల్లడిస్తున్న ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణ మురళి

సాక్షి, అమరావతి: నంది నాటకోత్సవాలను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, అవార్డుల ఎంపికలో ఎలాంటి సిఫార్సులకు తావు లేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ (ఏపీ ఎఫ్‌డీసీ) చైర్మన్ పోసాని కృష్ణ మురళి అన్నారు. 22వ నంది నాటకోత్సవం–2022 ప్రాథమిక స్థాయిలో ఎంపికైన నాటకాల వివరాలను మంగళవారం జ్యూరీ సభ్యులతో కలిసి పోసాని వెల్లడించారు. విజయవాడలోని ఆర్టీసీ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉత్తమ నాటకాల ఎంపికలో జ్యూరీ సభ్యులదే తుది నిర్ణయమని, రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి నాటక ప్రదర్శనలు తిలకించి పోటీలకు అర్హమైన ప్రదర్శనలను ఎంపిక చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో అస్మదీయులకే పెద్దపీట వేయడం, అవకతవకలకు జరిగాయని, దాంతో నాటి సీఎం చంద్రబాబు నంది అవార్డులను రద్దు చేశారని గుర్తు చేశారు. ఈసారి అలాంటి తప్పులకు తావు లేకుండా జ్యూరీ సభ్యులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, అన్ని విధాలుగా అర్హత ఉన్న నాటకాలను ఎంపిక చేసి సీల్డ్ కవర్‌లో మీడియా ముందు జ్యూరీ సభ్యులే వెల్లడిస్తారన్నారు. నంది నాటకోత్సవాలకు ఎంట్రీలు పంపిన వారి సౌలభ్యం కోసం వారున్న ప్రాంతంలోనే ప్రదర్శనలు నిర్వహించారని, జ్యూరీ సభ్యులే అక్కడికి వెళ్లి ప్రదర్శనలను తిలకించి తుది నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. పద్య, సాంఘిక నాటక, సాంఘిక నాటిక, బాలల నాటిక, కళాశాల/విశ్వవిద్యాలయ మొత్తం (5 విభాగాలు) విభాగంలో 115 ఎంట్రీలు రాగా, వాటిలో 38 నాటకాలను ఫైనల్ పోటీలకు ఎంపిక చేసినట్టు వివరించారు. జ్యూరీ సభ్యులుగా ఆయా రంగాల్లో విశేష అనుభవం గల ముగ్గురు చొప్పున మూడు కమిటీలను నియమించామన్నారు. ఫైనల్ పోటీల్లో ప్రదర్శనలు తిలకించే జ్యూరీని త్వరలోనే ప్రకటిస్తామని పోసాని తెలిపారు. ఏపీ ఎఫ్‌డీసీ ఎండీ, సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. తుది పోటీలకు ఎంపికైన 38 ప్రదర్శనలు నవంబర్ మొదటి వారంలో జ్యూరీ ముందు ప్రదర్శించి అవార్డులను ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. వివిధ విభాగాల్లో మొత్తం 73 అవార్డులు ప్రదానం చేయడంతోపాటు, అవార్డు కింద అందించే పారితోషికం మొత్తాన్ని కూడా పెంచినట్టు చెప్పారు. పద్య నాటకానికి రూ.50 వేలు, సాంఘిక నాటకానికి రూ.40 వేలు, సాంఘిక నాటికకు, బాలల నాటికల విభాగం, కళాశాల/విశ్వవిద్యాలయ విభాగంలో ఎంపికైన నాటకాలకు రూ.25 వేలు బహుమతిగా అందించనున్నట్టు పేర్కొన్నారు.

నంది నాటకోత్సవాల ఫైనల్స్‌కు ఎంపికైన ప్రదర్శనలు ఇవే..

పద్యనాటక విభాగంలో..

కర్నూలు లలిత కళాసమితి 'శ్రీ కృష్ణ కమల పాలిక', కర్నూలు కళాకారుల సంక్షేమ సంఘం వారి 'ఆనంద నిలయం', హైదరాబాద్ శ్రీ కళానికేతన్ వారి 'వసంత రాజీయం', హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన నవ క్రాంతి కల్చరల్ అసోసియేషన్ 'నర్తనశాల', ప్రొద్దుటూరు సవేరా ఆర్ట్స్ వారి 'శ్రీరామ పాదుకలు', తెనాలి దుర్గా భవాని నాట్యమండలి 'శ్రీరామ భక్త తులసీదాసు', విజయవాడ సంస్కార భారతి 'శ్రీమాధవ వర్మ', కాకినాడ శ్రీసీతారామాంజనేయ నాట్యమండలి 'సీతాకల్యాణం', రాజాం కళాసాగర్ నాటక సంక్షేమ సంఘం 'శ్రీకాళహస్తీశ్వర మహత్మ్యం (భక్తకవి నక్కీర)', విశాఖపట్నం జయకళానికేతన్ 'శ్రీకాంత కృష్ణమాచార్య'.

సాంఘిక నాటికల విభాగంలో..

ప్రకాశం జిల్లా కొప్పోలుకు చెందిన పంట క్రియేషన్స్ వారి 'పక్కింటి మొగుడు', కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ 'గమ్యస్థానాల వైపు', పెదకాకాని గంగోత్రి 'అస్థికలు', అభినయ ఆర్ట్స్ 'అతీతం', శ్రీ సద్గురు కళానిలయం 'కమనీయం', పొన్నూరుకు చెందిన రసఝరి 'త్రిజుడు', అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ 'నాన్నా నేనొచ్చేస్తా', తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ 'జరుగుతున్న కథ', కరీంనగర్ చైతన్య కళాభారతి వారి 'చీకటి పువ్వు', విజయవాడ యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్స్ 'రాతిలో తేమ', శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శర్వాణి గ్రామీణ్, గిరిజన సాంస్కృతిక సేవా సంఘం 'కొత్త పరిమళం', విశాఖపట్నం తెలుగు కళాసమితి వారి 'నిశబ్దమా నీ ఖరీదెంత?'.

సాంఘిక నాటకం విభాగంలో..

తెనాలి కళల కాణాచి వారి 'ఝనక్ ఝనక్ పాయల్ భాజే', విజయవాడ డాక్టర్ రామన్ ఫౌండేషన్, శ్రీ సాయిబాబా నాట్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో 'విజ్ఞాన భారతం', గుంటూరు అభినయ ఆర్ట్స్ 'ఇంద్రప్రస్థం', హైదరాబాద్ శ్రీ కళానికేతన్ 'ఎర్ర కలువ', హైదరాబాద్ మిత్రా క్రియేషన్స్ 'ద ఇంపోస్టర్స్', హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ 'కలనేత'.

బాలల నాటికల విభాగంలో..

అనంతపురం అరబి యూత్ కల్చరల్ అసోసియేషన్ వారి 'బాధ్యత', ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం కథనం క్రియేషన్స్ అండ్ డీఏవీ పబ్లిక్ స్కూల్ 'తథా బాల్యం', విజయవాడ యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ 'మూడు ప్రశ్నలు', న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 'ప్రపంచ తంత్రం', శ్రీరామ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ 'మంచి గుణపాఠం'.

కళాశాల/ విశ్వవిద్యాలయ నాటికల విభాగంలో..

విజయవాడకు చెందిన న్యూ స్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి 'కపిరాజు', ఎస్‌డీఎస్ సిద్ధార్థ మహిళా కళాశాల 'ఇంకానా', తెనాలి ప్రఖ్య చిల్డ్రన్స్ ఆర్ట్స్ థియేటర్ అండ్ అంబేద్కర్ మెమోరియల్ 'మహాభినిష్క్రమణ', తిరుపతి నందనం అకాడమీ 'ఉద్ధంసింగ్', అనంతపురానికి చెందిన ఎస్ఎస్బీఎన్ డిగ్రీ కళాశాల వారి 'ఇంకెన్నాళ్లు' నాటికలు తుది పోటీలకు ఎంపికయ్యాయి.

వైద్యరంగం అభివృద్ధికి సీఎం విశేష కృషి

- ఏపీ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్‌సుందర్



మంత్రి బొత్ససత్యనారాయణతో మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలో ఒకేసారి ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభించి వైద్యరంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఏపీ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడికాల శ్యామ్‌సుందర్ అన్నారు. ఇటీవల విజయనగరంలో ప్రభుత్వ వైద్యకళాశాల ప్రారంభించిన సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను విజయనగరంలో మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో పేద రోగులకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందుతుందన్నారు. డ్యూటీ అవర్స్ అయిపోయిన తర్వాత వైద్యులకు జూమ్ మీటింగ్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లు పెట్టకుండా చూడాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆయన వెంటనే స్పందిస్తూ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ జె.నివాస్‌కు ఫోన్‌చేసి సాయంత్రం 4 గంటల తర్వాత వైద్యులకు జూమ్, వీడియో కాన్ఫరెన్స్‌లు పెట్టవద్దని చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసినవారిలో ఏపీ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్ట్ కె.మురళీ మోహన్, కార్యదర్శులు ఎస్.వి.రామ్మూర్తి, డాక్టర్ ఎస్.భాగ్యరేఖ, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ రామారావు తదితరులున్నారు.

క్లుప్తంగా...

కశ్మీర్‌లో లష్కరే కమాండర్ హతం

ముగిసిన వారం రోజుల ఎన్‌కౌంటర్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో చోటుచేసుకున్న భీకర ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబా కమాండ్ ఉజియర్ ఖాన్ సహా ఇద్దరు హతమయ్యారు. వీరిద్దరి మృతితో భద్రతాబలగాలతో వారం రోజులుగా ఈ ప్రాంతంలో కొనసాగుతున్న ఎదురుకాల్పులు ముగిసినట్లయిందని కశ్మీర్ అదనపు డీజీపీ విజయ్ మంగళవారం తెలిపారు. జిల్లాలోని గడోల్ అటవీ ప్రాంతంలో గత బుధవారం మొదలైన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఆర్మీ అధికారులు, ఒక పోలీసు అధికారి సహా నలుగురు భద్రతా సిబ్బంది వీరమరణం పొందిన విషయం తెలిసిందే.

ఆదిత్య ప్రస్థానంలో కీలక దశ షురూ

బెంగళూరు: సూర్యుని గుట్టు విప్పేందుకు ఇస్రో ప్రయోగించిన తొలి మిషన్ ఆదిత్య -ఎల్1 ప్రస్థానంలో కీలక దశ మొదలైంది. దాని కక్ష్యను పెంచి సూర్యుని కేసి ట్రాన్స్ లగ్రాంజియన్ పాయింట్ దిశలో విజయవంతంగా ప్రవేశపెట్టడంలో సైంటిస్టులు మంగళవారం విజయం సాధించారు. ఇప్పుడది లగ్రాంజ్ 1 పాయింట్ దిశగా వెళ్తోంది. మరో 110 రోజుల తర్వాత ఆదిత్య ఎల్1ను భూమి నుంచి దాదాపు 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని లగ్రాంజ్ 1 పాయింట్ కక్ష్యలో ప్రవేశపెడతారు. అప్పటి నుంచి అది సౌర శోధనకు దిగుతుంది. ఈ మేరకు ఇస్రో ఎక్స్‌లో పోస్ట్ చేసింది. సూర్యునిపై పరిశోధనల కోసం సెప్టెంబర్ 2న ఆదిత్య -ఎల్1 ప్రయోగం చేపట్టడం తెలిసిందే.

బెంగళూరు బయోలాజికల్ పార్కులో 7 చిరుత కూనలు మృత్యువాత

బెంగళూరు: బెంగళూరులోని బన్నెర్‌ఘట్ట బయోలాజికల్ పార్కులో ఏడు చిరుత కూనలు అత్యంత తీవ్రమైన వైరస్ సోకి మృత్యువాతపడ్డాయని మంగళవారం అధికారులు తెలిపారు. ఫెలైన్ పెర్వోవైరస్‌తో వచ్చే ఫెలైన్ పాన్‌లుకోపీనియా(ఎఫ్‌పీ) అనే వ్యాధితో ఇవి మరణించాయి. మూడు నుంచి ఎనిమిది నెలల వయస్సున్న ఈ కూనలకు మొదటగా ఆగస్ట్ 22న వైరస్ సోకింది. మొత్తం 9 కూనలుండగా 15 రోజుల వ్యవధిలోనే ఏడు కూనలు ప్రాణం విడిచాయి. ముందుగా టీకా వేయించినప్పటికీ అవి వైరస్ బారినపడ్డాయని, చికిత్స కొనసాగుతుండగానే మరణించాయన్నారు. వైరస్ వ్యాప్తిని విజయవంతంగా అడ్డుకోవడంతో గత 15 రోజులుగా పార్క్‌లో ఎలాంటి కేసులు నమోదు కాలేదని తెలిపారు. ఈ ప్రాంతం మొత్తాన్ని శానిటైజ్ చేసి పరిశుభ్రతను పూర్తి స్థాయిలో పాటిస్తున్నామని చెప్పారు.

ఓటు బ్యాంకు రాజకీయం!



ఖలిస్తాన్ వేర్పాటు వాదులపై కెనడా ఉదాసీన వైఖరి

40 ఏళ్లుగా కెనడాలో చాప కింద నీరులా ఉగ్రవాదం

ట్రూడోకు ఖలిస్తాన్ అనుకూల న్యూ డెమొక్రటిక్ పార్టీ మద్దతు
దీంతో రెఫరండం, ర్యాలీలతో రెచ్చిపోతున్న వేర్పాటువాదులు

కెనడాలో ఖలిస్తాన్ వేర్పాటువాద ఉగ్రవాదానికి 40 ఏళ్ల చరిత్ర ఉంది. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మానవ అక్రమ రవాణా, హత్యలు, వ్యవస్థీకృత నేరాలు వంటివి ఖలిస్తాన్ వేర్పాటు వాదులకు గత నాలుగు దశాబ్దాలుగా నిత్యకృత్యంగా మారాయి. అయినా అక్కడ ప్రభుత్వాలు ఖలిస్తాన్ వేర్పాటు వాదుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి దీనికి ఓటు బ్యాంకు రాజకీయాలే ప్రధాన కారణం. భారత్ తర్వాత ప్రపంచంలో కెనడాలో సిక్కు జనాభా అధికంగా ఉంది. 2021 కెనడా జనాభా లెక్కల ప్రకారం దాదాపుగా 8 లక్షల మంది సిక్కులు (మొత్తం జనాభాలో 2%పైగా) ఉన్నారు. వీరి జనాభా శరవేగంతో పెరుగుతూ వస్తోంది. కెనడాలో న్యూ డెమొక్రాటిక్ పార్టీ (ఎన్‌డీపీ) పగ్గాలను సిక్కు నాయకుడైన జగ్మీత్ సింగ్ ధాలివాల్ 2017 సంవత్సరంలో చేపట్టిన తర్వాత ఖలిస్తాన్ వేర్పాటు వాదుల ఎజెండాకు మద్దతు పలికారు. 2021లో ప్రధానమంత్రి జస్టిస్ ట్రూడోకు చెందిన లిబరల్ పార్టీ మెజార్టీ స్థానాలను గెలవలేకపోవడంతో ఎన్‌డీపీ మద్దతు తీసుకోవాల్సి వచ్చింది.దీంతో ఖలిస్తాన్ వేర్పాటువాదులు మరింత చెలరేగిపోతున్నా ప్రధాని ట్రూడో ఏమీ చేయలేకపోతున్నారు. ఇక ప్రస్తుతం కెనడా పార్లమెంటులో 18 మంది సిక్కు ఎంపీలు ఉన్నారు. సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) అనే సంస్థ ప్రత్యేక ఖలీస్తాన్‌పై రెఫరెండం చేపట్టి తమకు లక్ష మందికిపైగా మద్దతు పలుకుతున్నట్టుగా ప్రకటించింది.

2019 నుంచి పెరిగిన దాడులు

- జగ్మీత్ సింగ్ బృందం ఖలిస్తాన్ విషయంలో మరింత చురుగ్గా ఉంటూ దాడులకు ప్రోత్సహిస్తోంది. కెనడాతో పాటు అమెరికా, యూకే, ఆస్ట్రేలియాలో ఇటీవల కాలంలో వీరి దాడులు పెరిగిపోతున్నాయి.
- భారత కార్యాలయాలు, హిందూ ఆలయాలపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయి. మార్చిలో లండన్‌లో భారత హైకమిషనర్ కార్యాలయంపై దాడి జరిగింది.
- 2022 మేలో మొహాలిలో పంజాబ్ ఇంటెలిజెన్స్ హెడ్‌క్వార్టర్స్‌పై గ్రెనేడ్ దాడి వెనుక (ఎస్ఎఫ్‌జే) హస్తం ఉంది.
- దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హత్యను కీర్తిస్తూ జూన్ 4న ఖలీస్తాన్ ఉద్యమకారులు వివిధ కార్యక్రమాలు చేపట్టారు.రక్తపు మడుగులో పడి ఉన్న ఇందిర, ఒక సిక్కు చేతిలో తుపాకీ ఉన్న చిత్రాలకి సంబంధించిన కటౌట్లు టొరాంటో వీధుల్లో వెలిశాయి. దర్బార్ సాహిబ్‌పై దాడులకు ప్రతీకారంగానే ఈ హత్య జరిగిందంటూ దానిపై రాశారు. ఒంటారియాలో భారీ ర్యాలీతో తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సంబరాల్ని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ తీవ్రంగా ఖండించారు. కెనడా ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వేర్పాటువాదుల ఆగడాలను చూసీచూడనట్టు వదిలేస్తోందని ఆయన దుయ్యబట్టారు.
- జులైలో ఆస్ట్రేలియాలోని సిడ్నీలో భారతీ విద్యార్థులపై ఖలిస్తాన్ వేర్పాటువాదులు ఇనుపరాడ్లతో దాడి చేశారు.

ప్రస్తుత ప్రధాని జస్టిన్ ట్రూడో తండ్రి పియరే ట్రూడో 1980లో కెనడా ప్రధానిగా ఉన్నారు. అప్పట్లోనే ఖలిస్తాన్ కార్యకలాపాలపై భారత ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ ఆయనకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఆ నాటి ప్రభుత్వం కూడా ఉదాసీనంగానే వ్యవహరించిందని బ్లడ్ ఫర్ బ్లడ్ అనే పుస్తకంలో రచయిత టెర్రీ మిల్‌వెస్కీ పేర్కొన్నారు. అప్పట్లో ఖలిస్తాన్ ఉద్యమం కెనడాలో కూడా ఉవ్వెత్తున లేచింది. ఇందిరాగాంధీ హత్య తర్వాత కొన్నాళ్ల స్తబ్దుగా ఉన్నప్పటికీ ఇటీవల కాలంలో మళ్లీ వేర్పాటువాదులు చెలరేగిపోతున్నారు. వాస్తవానికి

అప్పట్లో ట్రూడో తండ్రి

ఖలిస్తాన్ ఉద్యమం ప్రజా మద్దతు ఉన్నది కాదన్న అభిప్రాయాలు ఉన్నాయి. '''ఖలిస్తాన్ ఉద్యమం భౌగోళిక రాజకీయాలకు సంబంధించినది. చైనా, పాకిస్తాన్ వంటి దేశాలు తమ శత్రుదేశమైన భారత్‌కు ఇబ్బంది కలుగుతుందని ఖలిస్తాన్ వేర్పాటు వాదులకి సాయపడుతున్నాయి''అని రచయిత టెర్రీ పేర్కొన్నారు. ఇందిర హత్యని ఒక సంబరంగా పేర్కొంటూ 2002లో టొరాంటో ప్రధాన కేంద్రంగా ప్రచురితమయ్యే సంజా సవేరా మ్యాగజైన్ కథనాలు వండి వార్చింది. అలాంటి పత్రికకు ప్రభుత్వం అత్యధికంగా వాణిజ్య ప్రకటనలు ఇవ్వడం ద్వారా తన వైఖరి ఏంటో చెప్పకనే చెప్పింది.

నిజ్జర్ హత్యతో రాజుకున్న చిచ్చు



గత ఏడాది జూన్ 18న కెనడాలోని బ్రిటీష్ కొలంబియాలో నిషేధిత ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హర్‌దీప్ సింగ్ నిజ్జర్‌ను సర్రేలోని గురుద్వారాలో కాల్చి చంపడంతో భారత, కెనడాల మధ్య చిచ్చు రేగింది. ఈ హత్యలో భారత్ ప్రమేయం ఉందంటూ కెనడా చేసిన ఆరోపణలతో ఇరు దేశాలు తమ రాయబారుల్ని వెనక్కి పిలిపించేదాకా వెళ్లాయి. పంజాబ్‌లో జలంధర్‌కు చెందిన నిజ్జర్ 1997లో కెనడాకు వలస వెళ్లాడు. ప్లంబర్‌గా పని చేస్తూనే ఖలిస్తాన్ వేర్పాటు వాదులతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. సిక్స్ ఫర్ జస్టిస్‌లో కూడా సభ్యుడిగా ఉన్నాడు. 2020లో భారత్ నిజ్జర్‌ను ఉగ్రవాదిగా ప్రకటించింది. 2007లో పంజాబ్‌లోని లూథియానాలో పేలుళ్లు, 2009లో పటియాలాలో రాష్ట్రీయ సిక్ సంగత్ అధ్యక్షుడు రూల్డా సింగ్ హత్యలో నిజ్జర్ ప్రమేయమున్నట్టు అనుమానాలున్నాయి. కెనడా, యూకే, అమెరికాలో భారత రాయబార కార్యాలయాల దాడుల వెనుక నిజ్జర్ హస్తం ఉన్నట్టుగా భారత్ విచారణలో తేలింది.

సాక్షి, నేషనల్ డెస్క్

భారత్, కెనడా మధ్య ఖలిస్తాన్ చిచ్చు

- ఖలీస్తానీ ఉగ్రవాది నిజ్జర్ హత్యతో ముదిరిన వివాదం
- భారత దౌత్యవేత్తను బహిష్కరించిన కెనడా
- ప్రతిగా కెనడా దౌత్యవేత్తను బహిష్కరించిన భారత్
- భారత్‌తో ఉద్రిక్తతల్ని కోరుకోవడం లేదన్న కెనడా ప్రధాని ట్రూడో

టొరాంటో/న్యూఢిల్లీ: భారత్, కెనడాల మధ్య ఖలిస్తాన్ వేర్పాటువాద అంశం అగ్గి రాజేసింది. ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు హర్‌దీప్ సింగర్ నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉందని సాక్షాత్తూ కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో పార్లమెంటు వేదికగా చేసిన ఆరోపణలు ఇరు దేశాల మధ్య విభేదాల్ని మరింత రాజేశాయి. ఇరుదేశాలు పరస్పరం తమ తమ దౌత్యవేత్తల్ని వెనక్కి పిలిపించడానికి దారి తీశాయి. గత జూన్‌లో నిషేధిత ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ (కేటీఎఫ్) చీఫ్ హర్‌దీప్ సింగ్ నిజ్జర్, భారత్ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదిని బ్రిటీష్ కొలంబియాలోని సర్రేలో గురుద్వారాలో కాల్చి చంపడం వెనుక వెనుక భారత్ ప్రమేయం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణల్ని భారత్ గట్టిగా తిప్పి కొట్టింది. ట్రూడో ఆరోపణలు అర్థంలేనివని, ప్రేరేపితమైనవని దుయ్యబట్టింది. 45 ఏళ్ల వయసున్న నిజ్జర్‌ను జూన్ 18న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. అతని తలపై భారత ప్రభుత్వం రూ.10 లక్షల రివార్డు ప్రకటించింది. ట్రూడో సోమవారం కెనడా పార్లమెంటులో మాట్లాడుతూ నిజ్జర్ వెనుక భారత్ ప్రమేయం ఉందని, కెనడా భద్రతా ఏజెన్సీ దర్యాప్తులో కూడా దీనికి సంబంధించిన అనుమానాలు తలెత్తుతున్నాయని ఆరోపించారు. ట్రూడో ఆరోపణల తర్వాత కెనడా విదేశాంగ శాఖ మంత్రి మెలనీ జోలీ ఒక భారత్ దౌత్యవేత్తని దేశం నుంచి బహిష్కరిస్తూ ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ధ్రువీకరించారు. కెనడాలో భారత ఇంటెలిజెన్స్ ఏజెన్సీ చీఫ్ పవన్ కుమార్ రాయ్‌ను దేశం వీడి వెళ్లాల్సిందిగా ఆదేశించినట్టు కెనడా విదేశాంగ శాఖ వెల్లడించింది. దీంతో భారత్ కూడా గట్టిగా ఎదురు తిరిగింది. దెబ్బకి దెబ్బ అన్నట్టుగా భారత్‌లో కెనడా రాయబారిని అయిదు రోజుల్లో దేశం వీడి వెళ్లాలంటూ ఆదేశించినట్టుగా విదేశాంగ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ''ఇలాంటి ఆరోపణల వల్ల కెనడాలో తలదాచుకుంటున్న ఖలిస్తాన్ ఉగ్రవాదులు , భారత సార్వభౌమాత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతని హెచ్చరిస్తూనే ఉంటాయి''అని విదేశాంగ శాఖ పేర్కొంది. ఖలిస్తాన్ వేర్పాటువాదుల పట్ల కెనడా ప్రభుత్వ ఉదాసీన వైఖరితో దశాబ్దాలుగా కొనసాగుతూ ఉండడం ఆందోళన కలిగిస్తోందని తెలిపింది. కెనడా గడ్డ మీద నుంచి జరిగే భారత వ్యతిరేక కార్యకలాపాలకు ట్రూడో ప్రభుత్వం ఇకనైనా ముగింపు పలకాలని పేర్కొంది. భారత్‌లో కెనడా ఇంటెలిజెన్స్ ఏజెన్సీ చీఫ్ ఒలివిర్ సిల్వెస్టర్‌ను దేశం వీడి వెళ్లాలంటూ భారత్ ఆదేశాలు జారీ చేసిన కొద్ది గంటల్లోనే కెనడా ప్రధాని ట్రూడో విలేకరులతో మాట్లాడుతూ భారత్‌తో ఉద్రిక్తతల్ని తాము కోరుకోవడం లేదని అన్నారు. అయితే సిక్కు నాయకుడు నిజ్జర్ హత్యని భారత్ సీరియస్‌గా తీసుకోవాలని ఆయన అన్నారు. భారత ప్రభుత్వంతో ఉన్న విభేదాలు తొలగిపోవడానికి చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.



కెనడా ప్రధాని ట్రూడో

భారత్‌కు ప్రయాణాలు మానుకోండి: కెనడా

భారత్‌లో పర్యటించాలనుకునే తమ పౌరులకు కెనడా తాజాగా ట్రావెల్ అడ్వైజరీ విడుదల చేసింది. 'దేశమంతటా ఉగ్రవాద దాడుల ప్రమాదం పొంచి ఉంది. దాంతోపాటు చొరబాటుదారుల ముప్పు కూడా ఉన్నందున ఈశాన్య భారతానికి అనవసర ప్రయాణాలు మానుకుంటే మేలు. అలాగే జమ్మూకశ్మీర్‌కు ప్రయాణం అస్సలు చేయకుంటే మంచిది' అని సూచించింది!

బైడెన్, సునాక్‌లతో ట్రూడో మంతనాలు

నిజ్జర్ హత్య వెనుక భారత్ ప్రమేయం ఉందన్న ఆరోపణల్ని వివిధ దేశాల అధినేతలతోనూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో పంచుకున్నారు. తమ మిత్ర దేశాలైన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మార్కన్‌లతో నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉందని చెప్పినట్టుగా ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ట్రూడో చేసిన ఆరోపణలపై అమెరికా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ హత్య కేసులో కుట్రదారులకు శిక్ష పడడం, కెనడా తన దర్యాప్తుని ముందుకు తీసుకువెళ్లడం అత్యంత కష్టమని అమెరికా జాతీయ భద్రతా మండలి అధికారి ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానించారు. మరోవైపు ఈ వ్యవహారం భారత్, బ్రిటన్ దేశాల సంబంధాలపై ప్రభావం చూపిస్తుందని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ ఆందోళన వ్యక్తం చేశారు. కెనడా అధికారులు దీనిపై దర్యాప్తు చేస్తున్న సమయంలో తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయలేమని ప్రధాని కార్యాలయం అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు. ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్ ట్రూడో చేసిన ఆరోపణలు అత్యంత ఆందోళనకరమని, ఈ విషయాన్ని భారత్‌కు తెలియజేస్తామని చెప్పారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం!

- రానున్న 3 రోజులు రాష్ట్రంలో వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతంలో పశ్చిమ బెంగాల్-ఒడిశా తీరాలకు ఆనుకుని మంగళవారం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కి.మీల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ అల్పపీడనం గురువారంకి పశ్చిమ, వాయవ్య దిశలో ఉత్తర ఒడిశా, దక్షిణ జార్ఖండ్ మీదుగా పయనిస్తుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. రుతుపవన ద్రోణి రాజస్థాన్ నుంచి ప్రస్తుత అల్పపీడన ప్రాంతం వరకు తూర్పు మధ్య బంగాళాఖాతం మీదుగా వెళ్తోంది. వీటి ప్రభావంతో రానున్న 3 రోజులు ఉత్తర, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ తెలిపింది. ఉత్తర కోస్తాలో బుధవారం ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొంది. వచ్చే మూడు రోజులు పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. గంటకు 45–55, గరిష్ఠంగా 65 కి.మీల వేగంతో గాలులు వీస్తాయని, సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని సూచించింది.

అభయమిచ్చారు.. ఆదుకున్నారు

- సీఎం జగన్ ఆదేశాలతో గంటల వ్యవధిలోనే ఆర్థిక సాయం
- తక్షణ సాయంగా నలుగురికి రూ.లక్ష చొప్పున అందజేత
- మెరుగైన వైద్యమందించేలా చర్యలు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా ఆలంకొండ పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్ తిరుగు ప్రయాణంలో హెలీప్యాడ్ వద్ద పలువురి నుంచి వినతులు స్వీకరించారు. వారి అనారోగ్య సమస్యలను ఓపికగా విని.. మనోధైర్యం నింపారు. తక్షణమే వారికి ఆర్థిక సాయం చేయాలని కలెక్టర్ సృజనను ఆదేశించారు. దీంతో గంటల వ్యవధిలోనే కలెక్టర్ నలుగురు బాధితులకు తక్షణ సాయంగా రూ.లక్ష చొప్పున అందజేశారు. మెరుగైన వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో బాధితులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.





పుట్టిన ఏడు నెలలకే..

మాది కర్నూలులోని నరసింహారెడ్డినగర్. మాకు బాబు పుట్టాడన్న సంతోషం కొన్నాళ్లు కూడా నిలువలేదు. వాడికి ఏడు నెలలు నిండగానే వెన్నెముక సంబంధిత వ్యాధి బారినపడ్డాడు. పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించాం. మా దగ్గర ఉన్న డబ్బులు అయిపోయాయి. దిక్కుతోచనిస్థితిలో సీఎం జగన్‌ను కలిసి మా సమస్య చెప్పుకున్నాం. ఆయన వెంటనే తగిన సాయం, వైద్యమందేలా చూడాలని అధికారులకు చెప్పారు. ఆయన చెప్పినట్లే గంటల వ్యవధిలోనే తక్షణ సాయంగా రూ.లక్ష ఇచ్చారు. మెరుగైన వైద్యం చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆపదలో ఆదుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

– ఎస్.వెంకటేశ్వరగౌడ్, ఉషారాణి దంపతులు

అధికారులు వెంటనే స్పందించారు

మాది తుగ్గలి మండలం చెన్నంపల్లి. మేము వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నాం. మా తండ్రి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. ఆయన కోసం రూ.లక్షలు ఖర్చు చేశాం. జూలై 19న అత్యవసరంగా కిడ్నీ కావాలంటే మా అమ్మ కిడ్నీ ఇచ్చి ప్రాణాలను రక్షించే ప్రయత్నం చేసింది. అయినా మా తండ్రిని దక్కించుకోలేకపోయాం. మా సమస్యను జగనన్నకు చెప్పుకొని ఆదుకోవాలని కోరాం. ఆయన నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. ఆయన చెప్పడంతో అధికారులు వెంటనే రూ.లక్ష ఇచ్చారు.

– ఓ.జనార్దన్‌రెడ్డి, చెన్నంపల్లి, తుగ్గలి మండలం









ముఖ్యమంత్రి ధైర్యం చెప్పారు

మాది కృష్ణగిరి మండలం పోతుగల్లు గ్రామం. నేను వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నా. నా కుమారుడు టి.హరికృష్ణ నాలుగేళ్లుగా బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నాడు. చాలా ఆస్పత్రుల్లో చూపించాం. కానీ నయమవ్వలేదు. దీంతో సీఎం జగన్‌ను కలిసి మా గోడు చెప్పుకున్నాం. ఆయన మంచి వైద్యమందేలా చర్యలు తీసుకుంటానని ధైర్యం చెప్పారు. తక్షణ సాయంగా రూ.లక్ష ఇచ్చారు.

– టి.వెంకటరాముడు, పోతుగల్లు





పేదలకు మంచి చేసే సీఎం..

మేము పేదోళ్లం. పనిచేసుకుంటేనే పొట్ట నిండుతుంది. ఆరేళ్ల క్రితం మా తమ్ముడు బి.రామ్‌ప్రసాద్‌కు వెన్నుపూస సమస్య వచ్చింది. అప్పులు చేసి చాలా చోట్ల చూపించాం. అయినా నయంకాలేదు. ఆర్థిక సాయం చేయాలని సీఎం జగన్‌ను కోరితే తక్షణ సాయంగా రూ.లక్ష ఇచ్చి ఆదుకున్నారు. వైద్యం కూడా అందిస్తామన్నారు. పేదలకు మంచి చేసే ముఖ్యమంత్రికి ఎప్పుడూ మేలు జరగాలి.

– బి.కౌలుట్ల, పోతుగల్లు, కృష్ణగిరి మండలం

అవినీతి, వెన్నుపోట్లకు కేరాఫ్ చంద్రబాబు

- బాబు క్రిమినల్ నేపథ్యం ఆయన ఎన్నికల అఫిడవిట్‌లోనే కనిపిస్తుంది
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని దుర్మార్గంగా విభజించింది
- రాజ్యసభలో ఎంపీ విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: అంతులేని అవినీతి, కుంభకోణాలు, వెన్నుపోట్లకు కేరాఫ్ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి విమర్శించారు. ఆయన సోమవారం రాజ్యసభలో మాట్లాడుతూ.. చంద్రబాబు పాలన కారణంగానే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన రాష్ట్రంగా మిగిలిపోయిందని చెప్పారు. అడ్డూఅదుపూ లేకుండా అవినీతికి పాల్పడి చంద్రబాబు రూ.6 లక్షల కోట్లకు అధిపతి అయ్యారని తెలిపారు. 9 క్రిమినల్ కేసులు ఉన్నట్లు చంద్రబాబే స్వయంగా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనడం చూస్తేనే ఆయన క్రిమినల్ నేపథ్యాన్ని అర్థం చేసుకోవచ్చని అన్నారు. రాజకీయాల్లో వెన్నుపోట్లు చంద్రబాబుతోనే మొదలయ్యాయని చెప్పారు. టీడీపీతో పొత్తు పెట్టుకున్న బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులను వెన్నుపోటు పొడిచిన చరిత్ర బాబుదని, ఇది మన ప్రజాస్వామ్య దుస్థితి అని తెలిపారు. కోట్లాది రూపాయల స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో ప్రాథమిక ఆధారాలను నిర్ధారించుకున్న తర్వాతే కోర్టు చంద్రబాబుకు జ్యుడిషియల్ కస్టడీ విధించిందన్నారు. చంద్రబాబు అరెస్టుపై న్యాయ ప్రక్రియ కొనసాగుతుండగానే అఖిలపక్ష సమావేశంలో టీడీపీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేశారని, అందుకు సమాధానంగానే చంద్రబాబు అవినీతి, నేర చరిత్ర గురించి సభలో ప్రస్తావించాల్సి వస్తోందని చెప్పారు.

ప్రజాస్వామ్యాన్ని అంధకారంలోకి నెట్టిన కాంగ్రెస్

75 ఏళ్ళ పార్లమెంటరీ ప్రస్థానం దేశ ప్రజల పోరాటాలు, విజయాలు, ఆకాంక్షలకు అద్దం పడుతోందని విజయసాయిరెడ్డి అన్నారు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ చేసి కాంగ్రెస్ పార్టీ దేశంలో ఎమర్జెన్సీ విధించి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అంధకారంలోకి నెట్టి, కల్లోలం సృష్టించిందని అన్నారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెసేతర ప్రభుత్వం ఈ సవరణను రద్దు చేయబట్టే ప్రజాస్వామ్యం మళ్లీ పరిఢవిల్లిందని తెలిపారు. లేదంటే దేశంలో ఎమర్జెన్సీ కొనసాగించేందుకు చట్టాలు తెచ్చేవారని తెలిపారు.

యూపీఏ ప్రభుత్వంలో అంతులేని అవినీతి

2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వ అవినీతి, విధాన నిర్ణయాల్లో నిస్సహాయత కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుంటుపడిందని విజయసాయిరెడ్డి చెప్పారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేసిందన్నారు. పార్లమెంటును దుర్వినియోగం చేస్తూ యూపీఏ ప్రభుత్వం దుర్మార్గంగా రాష్ట్రాన్ని విభజించిందని అన్నారు. సభలో ఆంధ్రప్రదేశ్ ఎంపీల నిరసనను పట్టించుకోకుండా, ఓటింగ్‌కు పట్టుబట్టిన వారిని సస్పెండ్ చేసి అశాస్త్రీయంగా విభజన బిల్లును ఆమోదించిందన్నారు. విభజన బిల్లు ఆమోదం సందర్భంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రస్తుత బీజేపీ ప్రభుత్వంపై ఉందని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన ఈ 75 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్లు అధికారంలో ఉందని, మరే ఇతర పార్టీ ఉన్నా భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరేదన్నారు. గత పదేళ్లలో కాంగ్రెసేతర పార్టీ నేతృత్వంలో దేశం పురోగమిస్తున్న తీరు కళ్ల ముందే కనిపిస్తోందని తెలిపారు.

బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

దేశంలో 50 శాతంపైగా ఉన్న వెనుకబడిన తరగతులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని విజయసాయిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీల సామాజిక, ఆర్థిక వికాసం కోసం కుల గణన చేపట్టాలని, బీసీ జనాభాను కచ్చితంగా లెక్కించాలని అభ్యర్థించారు.

వైఎస్సార్‌సీపీ మొదటి నుంచీ మహిళా రిజర్వేషన్లను కోరుతోంది

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిన తొలిరోజు నుంచీ చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందని విజయసాయిరెడ్డి చెప్పారు. దేశ జనాభాలో సగ భాగం ఉన్న మహిళలు అసెంబ్లీల్లో 8 శాతం, లోక్‌సభలో 15 శాతమే ఉన్నారన్నారు. అందువల్ల చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. 25 నుంచి 40 ఏళ్ల వయసున్న యువ ఎంపీల ప్రాతినిధ్యమూ పెంచాలని కోరారు. 1950లో ఏడాదికి సగటున 120 రోజులు జరిగిన పార్లమెంట్ సమావేశాలు గత పదేళ్ళలో 70 రోజులకు కుదించుకుపోవడం పట్ల విజయసాయిరెడ్డి విచారం వ్యక్తం చేశారు.


18 స్టేలు తెచ్చుకున్నా చివరికి చట్టానికి చిక్కారు

- లోక్‌సభలో టీడీపీ ఎంపీ అసత్యాలను తిప్పికొట్టిన మిథున్‌రెడ్డి
- స్కిల్ డెవలప్‌మెంట్‌లో రూ.371 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపణ



సాక్షి, న్యూఢిల్లీ: 14 ఏళ్లపాటు సీఎంగా ఉన్న చంద్రబాబు ఇప్పటివరకూ 18 కేసుల్లో స్టే తెచ్చుకున్నప్పటికీ, చివరికి చట్టానికి చిక్కారని వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్‌రెడ్డి లోక్‌సభలో చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో రూ.371 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ సోమవారం లోక్‌సభలో చంద్రబాబు అరెస్టు అంశాన్ని ప్రస్తావించారు. ఇలాంటి ప్రస్తావనలు తేవద్దని సభాపతి సూచించారు. అనంతరం మిథున్‌రెడ్డికి మాట్లాడే అవకాశం ఇచ్చారు. టీడీపీ ఎంపీ జయదేవ్ సభలో చెప్పిన అసత్యాలను మిథున్‌రెడ్డి తిప్పికొట్టారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు విలువ రూ.3,300 కోట్లని, దీంట్లో 10 శాతం ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉందని వివరిస్తుండగా టీడీపీ ఎంపీలు అడ్డుతగిలారు. ఇప్పటికే చాలా మాట్లాడారు ఇక కూర్చోండని మిథున్‌రెడ్డి వారిని కోరారు. ప్రాజెక్టుకు సంబంధించి జీవోలో ఉన్న అంశాలు ఒప్పందంలో అమలు కాలేదన్నారు. మరోవైపు సీమెన్స్ సంస్థ ఒక్క రూపాయి పెట్టుబడి పెట్టలేదన్నారు. వాస్తవాలు సూటిగా చెప్పాలనుకుంటున్నానని, జయదేవ్ ఏదేదో మాట్లాడుతున్నారని అన్నారు. కోర్టులో ఉన్న అంశంపై చర్చ సరికాదని సభాపతి చెప్పారు. టీడీపీ ఎంపీలు లేవనెత్తిన విషయంపై మాట్లాడేందుకు సభాపతి తనకు అవకాశమిచ్చారని చెబుతూ.. వాస్తవాలు రికార్డుల్లోకి ఎక్కాలని వివరిస్తున్నానని మిథున్‌రెడ్డి అన్నారు. అయితే కేసు మెరిట్స్ జోలికి వెళ్లొద్దని సభాపతి సూచించారు. చంద్రబాబు పీఏకు ఆదాయ పన్ను నోటీసులు ఇస్తే దేశం విడిచి పోయారని తెలిపారు. పలు షెల్ కంపెనీలకు సొమ్ములు అందాయని, జీఎస్టీకి సంబంధించి నకిలీ ఇన్‌వాయిస్‌లు ఉన్నాయని ఈడీ కూడా కేసు నమోదు చేసిందన్నారు. ఇది పూర్తిగా అవినీతి కేసు అని తెలిపారు. సభాపతి సూచించినట్లుగా ఈ అంశం కోర్టు పరిధిలోదని, టీడీపీ ఎంపీలు ప్రస్తావించకూడదని అన్నారు. అయినా దేశంలో స్కాం చేసిన వాళ్లెవరూ, వాటిని అంగీకరించలేదన్నారు. చంద్రబాబును జైల్లోనే పెట్టాల న్నారు. మహిళా బిల్లుకి వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని చెప్పారు. మంగళవారం పార్లమెంటు సమీపంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

అమృత షేర్‌గిల్. 20వ శతాబ్దపు గొప్ప చిత్రకారిణి. 1941లో 28 ఏళ్ల చిన్న వయసులో మరణించినా ఆమె చిత్రాలు ఇప్పటికీ వార్తలు సృష్టిస్తూనే ఉన్నాయి. అమ్మలక్కల కబుర్లను 'ది స్టోరీ టెల్లర్' పేరుతో ఆమె బొమ్మ గీస్తే ఇప్పటివరకూ భారతదేశంలో ఏ చిత్రకారుడికీ పలకనంత వెల- 61.8 కోట్లు పలికింది. ఆ చిత్రం గురించి... ఆ గొప్ప చిత్రకారిణి గురించి.



రూ.61.8 కోట్లు ధర పలికిన 'ది స్టోరీ టెల్లర్' చిత్రం

అమృత చిత్రం

అమృత షేర్‌గిల్ తన జీవిత కాలంలో 200 లోపు చిత్రాలను గీసింది. అన్నీ కళా ఖండాలే. వాటిలో చాలామటుకు ప్రఖ్యాత మ్యూజియమ్‌లలో ఉన్నాయి. కొన్ని మాత్రమే ఆమె చెల్లెలి (ఇందిర) కుమారుడు వివాన్ సుందరం, కుమార్తె నవీనల దగ్గర ఉన్నాయి. 1937లో తను గీసిన 'ది స్టోరీ టెల్లర్' చిత్రాన్ని అప్పటి లాహోర్‌లో మొదటిసారి ప్రదర్శనకు పెట్టింది అమృత. అప్పటి నుంచి ఆ చిత్రం చేతులు మారుతూ తాజాగా ఢిల్లీలో జరిగిన వేలంలో 61.8 కోట్లు పలికింది. ఇప్పటివరకూ భారతీయ చిత్రకారుల ఏ పెయింటింగ్‌కూ ఇంత రేటు పలకలేదు. ఆ విధంగా చనిపోయిన ఇన్నాళ్లకు కూడా అమృత రికార్డు స్థాపించ గలిగింది. దీనికంటే ముందు గతంలో సయ్యద్ హైదర్ రజా గీసిన 'జెస్టెషన్' అనే చిత్రం 51.75 కోట్లకు పలికి రికార్డు స్థాపించింది. దానిని అమృత బద్దలు కొట్టింది.

■ **గొప్ప చిత్రకారిణి**

అమృత షేర్‌గిల్ భారతీయ సిక్కు తండ్రి ఉమ్రావ్ సింగ్‌కి, హంగేరియన్ తల్లి ఎంటొనెట్‌కు జన్మించింది. బాల్యం నుంచి గొప్ప లావణ్యరాశిగా ఉండేది. ఐదేళ్ల నుంచి బొమ్మలు గీయడం మొదలు పెట్టింది. వీరి కుటుంబం సిమ్లాలో కొంత కాలం ఉన్నా అమృత బొమ్మల్లోని గొప్పదనాన్ని గమనించిన తల్లిదండ్రులు ఆమెకు 16 ఏళ్ల వయసున్నప్పుడు పారిస్‌కు తీసుకెళ్లి ఐదేళ్ల పాటు చిత్రకళలో శిక్షణ ఇప్పించారు. ఆ తర్వాత అమృత గొప్ప చిత్రాలు గీస్తూ వెళ్లింది. అవన్నీ కూడా భారతీయ గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించేవే. ఇప్పుడు అత్యధిక రేటు పలికిన 'ది స్టోరీ టెల్లర్'- పల్లెల్లో నలుగురు అమ్మలక్కలు కూచుని కబుర్లు చెప్పుకునే సన్నివేశం. ఇది కాకుండా 'వధువు అలంకరణ', 'ఒంటెలు', 'యంగ్ బాయ్ విత్ త్రీ యాపిల్స్', 'జిప్సీ గర్ల్స్', 'యంగ్ గర్ల్స్' ఆమె ప్రఖ్యాత చిత్రాలు. ఆమె తన సెల్ఫ్ పోర్ట్రయిట్‌ను కూడా గీసుకుంది.



అమృత షేర్‌గిల్

■ **అకాల మరణం**

అమృత షేర్‌గిల్ తన హంగేరియన్ కజిన్ విక్టర్‌ను వివాహం చేసుకుంది. వారు లాహోర్‌లో ఉన్న సమయంలో కేవలం 28 ఏళ్ల వయసులో 1941లో మరణించింది. అందుకు కారణం కలుషిత ఆహారంతో వచ్చిన వాంతులు, విరేచనాలు అని చెప్తారు. మరో కారణం ఆ సమయంలో ఆమె గర్భవతిగా ఉందని సంప్రదాయ డాక్టర్‌గా ఉన్న విక్టర్ ఆమెకు రహస్యంగా, అశాస్త్రీయంగా అబార్షన్ చేయబోయాడని, అందువల్ల తీవ్రమైన బ్లీడింగ్ జరిగి మరణించిందని అంటారు.

■ **ఆకర్షణాజాలం**

అమృత షేర్‌గిల్ ఆ రోజుల్లో సంపన్న వర్గాల్లో గొప్ప ఆకర్షణ కలిగిన వ్యక్తిగా కీర్తి గడించింది. జవహర్‌లాల్ నెహ్రూ ఆమె స్నేహం కోసం అనేక లేఖలు రాశాడు. ఢిల్లీలో జరిగిన అమృత ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు హాజరయ్యాడు. 'అమృత ఎక్కడ అడుగు పెట్టినా అక్కడ ఉన్నవారందరూ చేష్టలు డిగి ఆమెను చూస్తూ ఉండిపోయేవారు' అని అనేకమంది రాశారు. 'ఆమె జీవించి ఉంటే ప్రపంచం మొత్తం ఎన్నదగిన గొప్ప చిత్రకారిణి అయి ఉండేది' అని ఆర్ట్ క్రిటిక్స్ అంటారు.

ఆమె లేదు. కాని ఆమె చిత్రాలు ఆమెను సజీవంగా ఉంచుతూనే ఉన్నాయి.



ఇంటిప్

బొప్పాయి విత్తనాలు కూడాను..

● బొప్పాయి పండు విత్తనాల్లో ఆల్కలాయిడ్స్,ఫ్లేవనాయిడ్స్, పాలీఫీనాల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి అర్థరైటిస్‌ను తగ్గిస్తాయి. ● బొప్పాయి గింజలు తినడం వల్ల జీర్ణసంబంధ సమస్యలు తగ్గుముఖం పడతాయి. జీర్ణక్రియారేటు పెరుగుతుంది. ● వీటిలోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఆహారాన్ని విషం కానివ్వవు. ● గింజలను ఆహారంలో భాగం చేసుకుంటే గుండె సంబంధిత సమస్యలు దరిచేరవు. హార్ట్‌ఎటాక్ రాదు. ● బొప్పాయి గింజలు కొవ్వుని కరిగించి, బరువుని నియంత్రణలో ఉంచుతాయి.

మెషీన్స్‌కూ... మదర్‌టంగ్ కావాలోయ్

స్కూలు నుంచి కాలేజీ దాకా సెకండ్ లాంగ్వేజ్‌గా ఉండే మాతృభాషను మొక్కుబడిగా చదివేవారే ఎక్కువ. ఆ.. మనకు తెలిసిందే కదా? దీనికి ఎందుకు ఎక్కువ సమయం కేటాయించాలని లైట్ తీసుకుంటుంటారు. కానీ మాతృభాషతో కూడా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్స్‌లా ఐటీ కంపెనీల్లో పనిచేయవచ్చు. వాళ్లలా డాలర్లు సంపాదించవచ్చని చెబుతోంది రాధి దాట్ల. హిందీ మాత్రమే చదువుకుని అమెరికా వెళ్లిన రాధికి ఒక్క ఉద్యోగం కూడా దొరకలేదు. అయినా నిరాశపడకుండా తనకు తగిన ఉద్యోగాన్ని వెతికి పట్టుకుంది. ఇప్పుడామె ఏకంగా ఏఐ యంత్రాలకే హిందీ నేర్పిస్తోంది. అంతర్జాతీయ హిందీ టీచర్‌గా రాణిస్తోన్న రాధి గురించి ఆమె మాటల్లోనే.....



రాధి దాట్ల

అమ్మా వాళ్లు తెలుగు వాళ్లే. ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌లో పుట్టాను. నాన్న ఎయిర్ ఫోర్స్‌లో ఉత్తరభారత దేశంలో వివిధ ప్రాంతాల్లో పనిచేయడంతో... కేంద్రీయ విద్యాలయాల్లో చదివాను. అలా నా చదువంతా హిందీలోనే సాగింది. రాయ్‌పూర్ నుంచి విశాఖపట్నం వచ్చినప్పటికీ, యూపీ, పంజాబ్, బీహార్, బెంగాల్ రాష్ట్రాలకు చెందిన వారు వైజాగ్‌లో ఉండడంతో నా మొదటి భాష హిందీగా మారింది. హిందీ తరువాత తెలుగు, ఇంగ్లీష్ నేర్చుకున్నాను. కానీ హిందీ వచ్చినంతగా ఇంగ్లిష్, తెలుగు రాదు.

■ **కెరీర్‌గా అనుకోలేదు...**

డిగ్రీ వరకు హిందీని ఒక లాంగ్వేజ్‌గా మాత్రమే చూశాను. అయితే హిందీనే కెరీర్‌గా మారుతుందని అప్పుడు అనుకోలేదు. ఆ తరువాత మాస్టర్స్ చేసేటప్పుడు లింగ్విస్టిక్స్ చదివే అవకాశం రావడంతో హైదరాబాద్ యూనివర్శిటీలో హిందీకి అప్లైచేశాను. హిందీ కోర్సు చేసేటప్పుడు హిందీ మీద మక్కువ ఏర్పడింది. దీనికితోడు మా ప్రొఫెసర్ "నీకు తెలిసిన సబ్జెక్టుని కెరీర్‌గా ఎంచుకో" అని సలహా ఇచ్చారు. అప్పుడు నేను హిందీనే కెరీర్‌గా మలుచుకోవాలనుకున్నాను. ఆ తర్వాత పీహెచ్‌డీ చేస్తోన్న సమయంలో పిట్స్ బర్గ్, క్యాలిఫోర్నియా యూనివర్శిటీ విద్యార్థులు, బయాలజీ, ఎకనమిక్స్‌తోపాటు హిందీ నేర్చుకునేవారు.

అప్పుడు వారికి హిందీ చెప్పేదాన్ని.

■ **అమెరికాలో.. హిందీ ఉద్యోగం**

2003లో పెళ్లి అయ్యింది. నా భర్త ఉద్యోగ రీత్యా రెండేళ్ల తరువాత అమెరికా వెళ్లాము. అక్కడ ఉద్యోగం చేద్దామని ఉద్యోగాల కోసం వెతికాను. కానీ ఎక్కడా దొరకలేదు. చాలా మంది అమెరికా వచ్చాక... ఉద్యోగం కోసం కంప్యూటర్ సైన్స్, కోడింగ్, ప్రోగ్రామింగ్‌లు నేర్చుకుంటుంటారు. నేను మాత్రం హిందీ టీచర్‌గా పనిచేసేందుకే ప్రయత్నించాను. అనేక వ్యయప్రయాసల తర్వాత అమెరికాలో బాగా పాపులర్ అయిన 'బెర్లిట్జ్' లాంగ్వేజ్ కార్పోరేషన్‌లో తొలి ఉద్యోగం దొరికింది. అక్కడ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్లో పనిచేసే వారికి హిందీ నేర్పించాలి. అలా డిఫెన్స్ వారికి హిందీ నేర్పించాను.

■ **ఐదు నెలల బిడ్డను వదిలి...**

డిఫెన్స్ వాళ్లకు పాఠాలు చెబుతూనే 2008లో జాన్ హాప్కిన్స్ యూనివర్శిటీకి అప్లై చేసాను. కొన్నాళ్ల తరువాత ఇంటర్వ్యూ కాల్ వచ్చి, హిందీ టీచర్‌గా సెలక్ట్ అయ్యాను. అప్పుడు నాకు ఐదు నెలల బాబు. వాడిని వదిలి వెళ్లాలంటే చాలా కష్టంగా అనిపించింది. ఆయన మేరీ లాండ్ యూనివర్శిటీలో రీసెర్చర్‌గా చేసేవారు. ఆయన ఇంటికి వచ్చాక నేను క్లాసులు చెప్పడానికి వెళ్లేదాన్ని. సాయంత్రం ఆరు నుంచి తొమ్మిదిన్నర వరకు క్లాసులు చెప్పేదాన్ని.

■ **ఇంట్లో కూర్చుని...**

యూనివర్శిటీలో తరగతులు చెబుతూ ఫారిన్ సర్వీసెస్‌కు అప్లై చేశాను. వివిధ దేశాల్లో నివసిస్తోన్న అమెరికన్‌లకు హిందీ నేర్పించడానికి ఆఫర్ వచ్చింది. దీంతో అమెరికా ఫారిన్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా హిందీ బోధించేదాన్ని. కోవిడ్ సమయంలో ఎడ్యుకేషన్ అంతా ఆన్‌లైన్ అయ్యింది. ఇదే సమయంలో మేరీలాండ్ యూనివర్శిటీ ఆన్‌లైన్ క్లాసులు చెప్పడానికి ఆఫర్ ఇవ్వడంతో 2021 నుంచి ఆన్‌లైన్ క్లాసులు చెబుతున్నాను. ఆ తర్వాత ఐటీ కంపెనీ ఆర్కిల్‌లో భాషా విభాగంలో పనిచేశాను. అక్కడ హిందీ, తమిళం, తెలుగు, మలయాళం, బెంగాలీ, మరాఠీ, నేపాలీ భాషలను నేర్పించే వారు. ఆ తరువాత అమేజాన్‌లో సీనియర్ లింగ్విస్ట్‌గా, యాపిల్ కంపెనీలో హిందీ ప్రాజెక్టులో పనిచేశాను.

ఇప్పుడంతా డేటా అనలిస్టు, మెషిన్ లెర్నింగ్ గురించే మాట్లాడుతున్నారు. మెషిన్ లెర్నింగ్ ఒక్క ఇంగ్లిష్‌లోనే లేదు. ఇతర భాషల్లో కూడా అందుబాటులోకి వస్తోంది. మెషిన్‌కి అన్ని భాషలు తెలియవు. అందువల్ల ప్రతి భాషను మెషిన్‌కు నేర్పించాల్సిందే. అప్పుడు మాత్రమే కోడింగ్ చేయగలరు. కోడింగ్ ద్వారానే అన్నిరకాల యాప్‌లు క్రియేట్ చేస్తారు. ఒక యాప్ తయారవడానికి కచ్చితంగా భాషా నిపుణులు అవసరం. అందుకే సైన్స్, మ్యాథ్స్‌లకున్న ప్రాముఖ్యత భాషకూ ఉంది. ఇది మనం గ్రహించాలి.

ప్రపంచంలో ఇండియా పెద్ద మార్కెట్. చాలా కంపెనీలు మన దేశం వైపు చూస్తున్నాయి. అందువల్ల భవిష్యత్ తరాలకు హిందీతోనే ఎక్కువసంఖ్యలో ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయి. ఇంగ్లిష్‌తోపాటు, హిందీ కూడా అవసరమే. ఇంగ్లిష్‌తో పాటు హిందీ కూడా చక్కగా నేర్చుకోండి ఓపికగా వెతికితే మంచి అవకాశాలు మీ దగ్గరకు వస్తాయి." అని నేటి యువతరానికి రాధి చెబుతోంది.

అమ్మ లిప్‌స్టిక్.. అమ్మమ్మ చీర కలిస్తే.. ఎంట్రప్రెన్యూర్

జీవితంలో ఇది అవ్వాలి! అది అవ్వాలి! అని కలలు కంటుంటాము. కొంతమంది కలలు మాత్రమే నిజం అవుతాయి. కొంతమంది పరిస్థితులకు తలొగ్గి ఇష్టం లేకపోయినా సర్దుకుపోయి బతికేస్తుంటారు. హిమాద్రి పటేల్ మాత్రం ఈ కోవకు చెందిన అమ్మాయి కాదు. ఇక ఇంతేలే అని సరిపెట్టుకోకుండా తను అనుకున్నది సాధించేందుకు అందర్నీ ఒప్పించి, కష్టపడి.. ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా కంటెంట్ క్రియేటర్, ఎంట్రప్రెన్యూర్‌గా రాణిస్తోంది.





ఐదు గంటలకు పడుకునేవాళ్లం

అక్కా నేను రాత్రంతా మేలుకుని చేయాల్సిన పని గురించి పరిశోధించి, వివరంగా తెలుసుకుని పేపర్ వర్క్ పూర్తిచేసేవాళ్లం. లీగల్ విషయాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి తెల్లవారుజామున ఐదు గంటలకు పడుకునేవాళ్లం. అలా అన్నివిధాలా సన్నద్ధమయ్యాక అంటే రెండేళ్ల తరువాత డ్రై బ్రాండ్‌ను గతేడాది అక్టోబర్‌లో తీసుకొచ్చాం. ఆర్థికంగా ఎవరూ సాయం చేయలేదు. యూట్యూబ్, కంటెంట్ బిజినెస్ ద్వారా వచ్చిన ఆదాయంతో దాచుకున్న డబ్బులనే డ్రై బ్రాండ్‌కు పెట్టుబడిగా పెట్టుకున్నాను. ప్రారంభంలో పెద్దగా ఆర్డర్లు ఏమీ రాలేదు. నెల తరువాత ఆర్డర్లు రావడం మొదలయ్యాయి. అలా వచ్చిన ఆర్డర్లతో పెట్టుబడికి కొంత, మిగతాది వర్కర్లకు జీతాలకు ఇచ్చేదాన్ని. అలా చేస్తూ ఇప్పుడు కాస్త లాభాలు ఆర్జిస్తున్నాను.

– హిమాద్రి పటేల్

డెహ్రాడూన్‌కు చెందిన 26 ఏళ్ల హిమాద్రి పటేల్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేది. మేకప్ అంటే ఎంతో ఆసక్తి. అమ్మ వాడే లిప్‌స్టిక్ రాసుకుని తనని తాను అద్దంలో చూసుకుని తెగ మురిసిపోతుండేది. ఎప్పుడూ నలుగురిలో ప్రత్యేకంగా ఉండేందుకు తాపత్రయ పడేది. ఇంటర్మీడియట్‌లో ఉండగానే జాతీయ, అంతర్జాతీయ మేకప్ ట్యుటోరియల్స్ చూసి మెకప్ మెళుకువలు నేర్చుకుంటుండేది. ఇలా నేర్చుకుంటూ తను కూడా సొంతంగా యూట్యూబ్ ఛానల్ పెట్టాలనుకుంది. కానీ దానికి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. ఈలోపు ఇంటర్మీడియట్ పూర్తయింది. తరువాత ఫ్యాషన్‌ను కెరీర్‌గా మలచుకోవాలనుకుంది. తల్లిదండ్రులు ఇంజినీరింగ్ చేయమని చెప్పారు. ఇష్టం లేకపోయినా తల్లిదండ్రులను నొప్పించలేక కంప్యూటర్ సైన్స్‌లో చేరింది. బీటెక్ చదువుతున్నప్పటికీ మేకప్ మెళకువలు నేర్చుకుంటూనే ఉంది.

■ **ఇన్ఫోసిస్‌ను వదిలి ఇన్‌ఫ్లుయెన్సర్‌గా...**

బీటెక్ చదువుతున్నప్పటికీ మనసు యూట్యూబ్ పైనే ఉండడంతో మరోసారి తల్లిదండ్రులను యూట్యూబ్ ఛానల్ పెడతానని అడిగింది. అయినా ఒప్పుకోలేదు. అప్పుడు హిమాద్రి అక్క... "ఛానల్‌ను పెట్టనివ్వండి. ఆమెకు మూడు నెలలు సమయం ఇద్దాం. ఆలోపు తనని తాను నిరూపించుకుంటే ఒకే. లేదంటే మనం చెప్పినట్టు చేస్తుంది" అని తల్లిదండ్రులను ఒప్పించింది. దీంతో హిమాద్రి పటేల్ పేరుతోనే యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించింది. ఒక లిప్‌స్టిక్, ఐలైనర్‌తో ఛానల్లో వీడియోలు పోస్టుచేయడం ప్రారంభించింది. అందంగా కనిపించేందుకు ఎటువంటి హానీ లేని మేకప్‌ను ఎలా వేసుకోవాలో చెబుతూ వీడియోలు పోస్టుచేసేది. ఎక్కువగా నిజజీవితంలో ఎదురయ్యే సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కారాలు చెబుతుండడంతో తన ఛానల్‌కు మంచి ఆదరణ లభించింది. మరోపక్క బీటెక్ ఫైనల్ ఇయర్‌లోకి వచ్చింది. క్యాంపస్ సెలక్షన్స్‌లోనూ మంచి ప్రతిభచూపి ఇన్ఫోసిస్, క్యాప్‌జెమినీలలో ఉద్యోగం సంపాదించింది. అయినా హిమాద్రికి పెద్ద సంతోషంగా అనిపించలేదు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదింటివరకు చేసే సాంప్రదాయ ఉద్యోగం చేయడం తనకి నచ్చలేదు. తల్లిదండ్రులు ఇన్ఫోసిస్‌లో చేరమని చెప్పారు. కానీ తను యూట్యూబ్ ఛానల్‌ను నడుపుతానని చెప్పింది. అప్పటికే హిమాద్రి మీద నమ్మకం ఉన్న తల్లిదండ్రులు యూట్యూబర్‌గా కొనసాగడానికి ఒప్పుకున్నారు. అప్పటి నుంచి యూట్యూబ్ ఛానల్ వివిధ రకాల సరికొత్త కంటెంట్‌ను అప్‌లోడ్ చేస్తూ సంపాదిస్తూ, ఎక్కువమంది ఫాలోవర్స్‌తో.. బ్యూటీ, ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా పాపులర్ అయ్యింది.

■ **అమ్మమ్మ చీరలుచూసి...**

హిమాద్రి చిన్నప్పటి నుంచి అమ్మమ్మ కట్టుకునే చీరలను జాగ్రత్తగా గమనించేది. నిమిషంలో కుచ్చిళ్లు పెట్టుకుని అందంగా చీరకట్టుకుని సైకిల్ తొక్కేది అమ్మమ్మ. అంతేగాక చీరలకు తనే స్వయంగా డిజైన్లు కుట్టుకోవడం, ఇంట్లో అందరికి స్టోల్స్ అల్లడాన్ని చూసి పెరిగిన హిమాద్రి అలాంటి బట్టలనే మార్కెట్లో విక్రయించాలనుకుని..'డ్రై బై హిమాద్రి' పేరిట క్లాత్ బ్రాండ్‌ను మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈ బ్రాండ్ ద్వారా అత్యంత నాణ్యమైన, సాంప్రదాయ దుస్తులను విక్రయిస్తోంది. అలనాటి డిజైన్ చీరలు, డ్రెస్‌లను భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యంగా హిమాద్రి దూసుకుపోతోంది.

■ **గౌరవంగా...**

డ్రై (DRI) అంటే సంస్కృతంలో గౌరవం అని అర్థం. అమ్మాయిలు, మహిళలు ధరించే చీరలు, డ్రెస్‌లు ఏవైనా గౌరవించేలా వారి కట్టుబొట్టు ఉండాలి. అందకు తగ్గట్టుగా సాంప్రదాయ వస్త్రాలను తయారు చేసి విక్రయిస్తోంది హిమాద్రి. వ్యాపార రంగంలో ఎటువంటి అనుభవమూ లేదు. కుటుంబం నుంచి వచ్చిన తొలివ్యాపారి కావడంతో హిమాద్రి అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చింది. వివిధ రకాల చిక్కులను తన అక్క సాయంతో ఎదుర్కొంటూ.. చిన్న చిన్న వేడుకల నుంచి వెడ్డింగ్ డ్రెస్‌ల వరకు అన్ని వస్త్రాలను రూపొందించి డ్రైబ్రాండ్‌కు గుర్తింపు తెచ్చుకుని యంగ్ ఎంట్రప్రెన్యూర్‌లకు ప్రేరణగా నిలుస్తోంది.

యూత్ పల్స్

లెర్నింగ్ అండ్ చేజింగ్

● స్ఫూర్తి తీసుకుంటూ ఇస్తూ

విజేతల విజయాలు ఇతరులకు స్ఫూర్తి ఇచ్చి ముందుకు నడిపిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది స్టార్ ఉమెన్ ఇన్వెస్టర్‌ల నుంచి స్ఫూర్తి పొందిన ఈతరం అమ్మాయిలు 'లెర్నింగ్ అండ్ చేజింగ్' సూత్రంతో ట్రేడింగ్ అండ్ ఇన్వెస్టింగ్‌లలో విజయం సాధిస్తున్నారు. తమదైన గెలుపు ప్రణాళికను పక్కాగా రూపొందించుకుంటున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్ట్‌మెంట్ గేమ్‌లో పురుషాధిక్యత కనిపిస్తుంది. ఒక ఆన్‌లైన్ వెల్త్ మేనేజ్‌మెంట్ స్టడీ ప్రకారం అయిదుమందిలో ఒకరు మాత్రమే ఉమెన్ ఇన్వెస్టర్. అయితే ఈ పరిస్థితులలో ఇప్పుడు ఆశాజనకమైన మార్పు కనిపిస్తుంది. ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఏరియాలోకి మహిళలు వచ్చి సత్తా చాటుతున్నారు. మన దేశం విషయానికి వస్తే పాండమిక్ సమయంలోనూ ఉమెన్ ఇన్వెస్టర్ల సంఖ్యలో పెరుగుదల కనిపించింది.

రాజస్థాన్‌లోని జైపుర్‌కు చెందిన వర్ష శ్రీవాస్తవకు ఇన్వెస్ట్‌మెంట్ ఫీల్డ్‌లో రాణించాలనేది భవిష్యత్ లక్ష్యం. ఇన్వెస్ట్‌మెంట్‌లో అద్భుత విజయాలు సాధించిన మహిళలు ఎంబీఏ చేస్తున్న వర్షకు స్ఫూర్తి.

బెంగళూరుకు చెందిన ఏంజెల్ ఇన్వెస్టర్ అంకిత వశిష్ఠ ఔత్సాహిక మహిళా ఇన్వెస్టర్‌లకు స్ఫూర్తిగా నిలిచింది. వెంచర్ క్యాపిటల్ ఫండ్ 'సహ ఫండ్'కు అంకిత ఫౌండర్, సీఇవో. వీసీ ఫర్మ్ 'స్ట్రాంగ్‌హర్' ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్.

పద్మజ రూపరెల్ ఇండియన్ ఏంజెల్ నెట్‌వర్క్(ఐఏఎన్) కో-ఫౌండర్, ప్రెసిడెంట్. 'ఐఏఎన్' పది దేశాలలో ఫైనాన్స్, వ్యవసాయం, అంతరిక్షం, బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, వైద్య పరికరాలు... మొదలైన రంగాలలో పెట్టుబడులు పెడుతోంది. పద్మజ 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్'గా గుర్తింపు పొందింది.

... ఈ ఇద్దరు మాత్రమే కాదు భారతీ జాకబ్, నీతా మీర్‌చందానీ, సాక్షి చోప్రా, బాలా దేశ్ పాండే...లాంటి ప్రముఖ ఇన్వెస్టర్‌లు వర్షకు స్ఫూర్తి.

ముంబైకి చెందిన చైత్రకు లారెన్ సీమన్స్ అంటే చెప్పలేనంత ఇష్టం. 'సీమన్స్ గురించి చదివిన కొద్దీ చదవాలనిపిస్తుంది. ఆమె మాటల్లో ఎంతో స్ఫూర్తి దొరుకుతుంది' అంటుంది చైత్ర. ఇరవై మూడు సంవత్సరాల వయసులో వాల్‌స్ట్రీట్‌లో యంగెస్ట్ ఫుల్-టైమ్ ఫిమేల్ ట్రేడర్‌గా ఎంతో మందికి స్ఫూర్తి ఇచ్చింది లారెన్ సీమన్స్. కెరీర్ మొదలుపెట్టినప్పుడు సీమన్స్‌కు ఎలాంటి అనుభవమూ లేదు. కుటుంబ సభ్యులు, బంధువులలోనూ ఆ రంగంలో ఎవరూ లేరు. జెనెటిక్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన సీమన్స్ న్యూయార్క్ సిటీకి వెళ్లి ఫైనాన్స్ రంగంలో అడుగు పెట్టింది,.

'డైరెక్షన్‌లెస్' 'కన్‌ఫ్యూజ్‌డ్' అంటూ ఆమెకు పేర్లు తగిలించేవాళ్లు కొందరు పురుషులు. ఈ పేర్ల వెనుక ఉద్దేశం ఆమెకు ఏమీ తెలియదు అని. అయితే 'రోసెన్ బ్లాట్ సెక్యూరిటీస్' సీయీవో జో గొరోస్కి మాత్రం ఆమెపై నమ్మకం ఉంచాడు. 'జార్జియా నుంచి ఇక్కడికి వచ్చిన ఈ అమ్మాయికి ఫైనాన్స్‌లో డిగ్రీ లేదు. అయితే ఏదో సాధించాలనే ఉత్సాహం ఉంది. అంకిత భావం ఉంది' అన్నారు. రోసెన్ బ్లాట్ సెక్యూరిటీస్‌లోకి అడుగు పెట్టి ప్రయాణం ప్రారంభించింది సీమన్స్. ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తూ కీనోట్ స్పీకర్‌గా ఫైనాన్స్‌కు సంబంధించి అమ్మాయిలకు స్ఫూర్తి ఇస్తుంది. వారి కోసం ఎన్నో రచనలు చేసింది.

సీమన్స్‌లాగే మన దేశానికి చెందిన మహెక్ షాకు వెటకారం మాటలు ఎదురయ్యాయి. పందొమ్మిది సంవత్సరాల వయసులోనే ట్రేడింగ్‌లోకి వచ్చిన మహెక్ వాటిని పట్టించుకోలేదు. తన పనితోనే సమాధానం చెప్పాలనుకుంది. ఇంట్రాడే ట్రేడింగ్‌తో స్టాక్‌మార్కెట్‌లో తొలి అడుగు వేసింది. టెక్నికల్ టర్మ్స్‌ను అర్థం చేసుకోవడం నుంచి సరైన నిర్ణయాలు ఎలా తీసుకోవాలో తెలుసుకోవడం వరకు ఎన్నో విషయాలను తన ప్రయాణంలోనే నేర్చుకుంది. హైయెస్ట్ ప్రాఫిట్ చూసిన రోజు తన ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యేది. ట్రేడింగ్‌లో డబ్బు కోల్పోయిన సందర్భాలు కూడా లేకపోలేదు. 'చాలా నిరుత్సాహానికి గురయ్యాను. అయితే అంతలోనే తేరుకొని తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవడం మొదలుపెట్టాను' అంటుంది 26 సంవత్సరాల మహెక్.

పొద్దున తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు వరకు చేతిలో ల్యాప్‌టాప్‌తో పనిలో తలమునకలై ఉంటుంది మహెక్. డిగ్రీ తరువాత ఫుల్‌టైమ్ ట్రేడర్ అయింది. తల్లిదండ్రులపై ఆధారపడకుండా తాను సంపాదించిన డబ్బుతో యూకేలో ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ చేసింది.



పవర్ ఆఫ్ ట్రేడింగ్ తెలుసుకున్నాను. ఫారిన్ మార్కెట్‌లో కూడా ట్రేడింగ్ చేయాలనుకుంటున్నాను. ఇండియాలో నేర్చుకున్న విషయాలు నాకు ఉపకరిస్తాయి.

- మహెక్ షా

చార్టెడ్ ఎకౌంటెన్సీ ట్రైనింగ్ నుంచి మధ్యలోనే బయటకు వచ్చిన ప్రియల్ అనిల్ బర్గీ ఈక్విటీ ఇన్వెస్టింగ్‌లోకి అడుగు పెట్టింది. తండ్రి నుంచి కొంత మొత్తాన్ని తీసుకొని స్టాక్ మార్కెట్‌లోకి వచ్చిన ప్రియల్ ఆ మొత్తాన్ని కొంత కాలానికే రెట్టింపు చేసింది. అంతమాత్రాన ఆమెకు నష్టాలు ఎదురు కాలేదని కాదు. ఒకేరోజు కొన్ని లక్షలు పోగొట్టుకొని షాక్‌కు గురైంది. అయితే నిరాశతో వెనకడుగు వేయకుండా, తాను వేసిన తప్పటడుగును లోతుగా విశ్లేషించుకుంది.

'ఇతరుల ద్వారా తెలుసుకునే టిప్స్ మాత్రమే మనం నిలదొక్కుకోవడానికి ఉపయోగపడవు. అతిపెద్ద సవాలు ఏమిటంటే దురాశకు దూరంగా ఉండడం. అదే సమయంలో ఆశావాదాన్ని కోల్పోకుండా ఉండడం. భయం ఉండాలి. అది మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే భయం కాకూడదు. మనల్ని హద్దుల్లో పెట్టే భయమై ఉండాలి' అంటున్న 27 సంవత్సరాల ప్రియల్ బర్గీ నాగ్‌పూర్ కేంద్రంగా 'నతిభాయి తులసీదాస్ ఇన్వెస్ట్‌మెంట్స్' సంస్థను ప్రారంభించింది.



ఇతరుల ద్వారా తెలుసుకునే టిప్స్ మాత్రమే మనం నిలదొక్కుకోవడానికి ఉపయోగపడవు. అతి పెద్ద సవాలు ఏమిటంటే దూరాశకు దూరంగా ఉండడం. అదే సమయంలో ఆశావాదాన్ని కోల్పోకుండా ఉండడం.

- ప్రియల్ బర్గీ

ప్రణీత్‌కు చేజారిన అవకాశం

భారత వర్ధమాన చెస్ ఆటగాళ్లకు అనూహ్య రీతిలో ఒక అరుదైన అవకాశం చేజారింది. వీసా సమస్యల కారణంగా ఐదుగురు చెస్ ఆటగాళ్లు 'ఫిడే' వరల్డ్ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్‌కు దూరమయ్యాడు. మెక్సికో సిటీలో ఈ నెల 22నుంచి అక్టోబర్ 2 వరకు టోర్నీ జరగనుంది. ఈ జాబితాలో తెలంగాణకు చెందిన ఉప్పల్ ప్రణీత్ కూడా ఉన్నాడు. గత మే నెలలో భారత 82వ గ్రాండ్‌మాస్టర్‌గా గుర్తింపు పొందిన ప్రణీత్ కెరీర్‌లో మరింత ఎదిగే ప్రయత్నంలో వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు సిద్ధమయ్యాడు. వివిధ టోర్నీల ప్రాక్టీస్ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రణీత్‌కు రూ. 2.5 కోట్ల ప్రోత్సాహకాన్ని అందించింది. ప్రణీత్‌తో పాటు వృశాంక్ చౌహాన్, అరుణ్ కటారియా, భాగ్యశ్రీ పాటిల్, ఫెమిల్ చెల్లదురైలకు నిరాశ ఎదురైంది. భారత ప్రభుత్వం ద్వారా ఎన్ని ప్రయత్నాలు చేసినా వీసా దక్కలేదని అధికారులు వెల్లడించారు. చివరి నిమిషంలో ఇద్దరి కోచ్‌లను మార్చడం వల్ల ఈ సమస్య తలెత్తిందని సమాచారం.



వరల్డ్ కప్ ఆడతాడా!



- ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు అశ్విన్ ఎంపిక
- సత్తా చాటేందుకు సరైన అవకాశం
- తొలి రెండు మ్యాచ్‌లకు రోహిత్, కోహ్లి దూరం
- కెప్టెన్‌గా కేఎల్ రాహుల్

వన్డే ప్రపంచకప్ కోసం భారత జట్టును ప్రకటించినప్పుడు సెలక్టర్లను అందరూ పదే పదే అడిగిన ప్రశ్న...'జట్టులో ఒక్క ఆఫ్ స్పిన్నర్ కూడా లేడు. ఇద్దరు లెఫ్టార్మ్ స్పిన్నర్లు జడేజా, అక్షర్‌లకు చోటు ఎంత వరకు సమంజసం, స్పిన్ బౌలింగ్‌లో వైవిధ్యం లేకపోతే ఎలా' అని! తమ ఎంపికను సమర్థించుకుంటూ చీఫ్ సెలక్టర్ అగార్కర్ దానికి వివరణ ఇచ్చుకుంటూ పోయాడు. అయితే ఇప్పుడు అక్షర్ పటేల్ గాయం వారిలోనూ కొత్త ఆలోచనను తెచ్చినట్లుంది. అందుకే ముందుగా ఆసియా కప్ ఫైనల్ కోసం ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను ఎంపిక చేసిన సెలక్టర్లు ఇప్పుడు సీనియర్ ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌నూ జట్టులోకి తెచ్చారు. టీమ్ ప్రకటనకు తుది గడువైన సెప్టెంబర్ 28లోగా అక్షర్ కోలుకోకపోతే మరి అనుభవాన్ని బట్టి అశ్విన్‌ను తీసుకుంటారా, లేక సుందర్ వైపు మొగ్గు చూపుతారా అనేది చూడాలి. అయితే ఏడాదిన్నర క్రితం తన చివరి వన్డే ఆడిన అశ్విన్ ఇప్పుడు ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో ఎలాంటి ప్రదర్శన ఇస్తాడనేదే ఆసక్తికరం.

ఆస్ట్రేలియాతో సిరీస్‌కు భారత జట్టు (తొలి రెండు వన్డేలకు)
రాహుల్ (కెప్టెన్), జడేజా (వైస్ కెప్టెన్), గిల్, రుతురాజ్, శ్రేయస్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్, శార్దుల్, బుమ్రా, సిరాజ్, షమీ, తిలక్, ప్రసిధ్, అశ్విన్, సుందర్.

ముంబై: ప్రపంచ కప్‌కు ముందు సన్నాహకంగా స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టును ప్రకటించారు. అయితే తొలి రెండు వన్డేలకు ఒక జట్టు, చివరి వన్డేకు మరో జట్టును విడివిడిగా ఎంపిక చేశారు. సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ పునరాగమనమే ఈ ఎంపికలో విశేషం. ఆసియా కప్ కోసం ముందుగా ఎంపిక చేసిన ప్రధాన జట్టులో ఆఫ్‌స్పిన్నర్ లేడు. ఫైనల్‌కు ముందు సుందర్ జట్టుతో చేరగా, ఇప్పుడు తాజా సిరీస్ కోసం అతనితో పాటు అశ్విన్‌కూ అవకాశమిచ్చారు. సుందర్‌ను ఈ సిరీస్ కోసం కూడా కొనసాగించనున్నారు. ఆసియా క్రీడల్లో పాల్గొంటున్న భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్న రుతురాజ్ గైక్వాడ్‌కు కూడా టీమ్‌లో చోటు లభించింది. తొలి రెండు వన్డేలు ఆడిన అతను ఆ తర్వాత ఆసియా క్రీడల జట్టుతో కలుస్తాడు.

నలుగురు ప్రధాన ఆటగాళ్లకు తొలి రెండు మ్యాచ్‌నుంచి విశ్రాంతి కల్పించారు. ఆసియా కప్‌లో ఆడిన కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్‌లకు విరామం లభించింది. గాయం కారణంగా అక్షర్ పటేల్ తొలి రెండు మ్యాచ్‌లకు ముందే దూరమయ్యాడు. రోహిత్ లేకపోవడంతో కేఎల్ రాహుల్ టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. అయితే మూడో వన్డేకు మాత్రం వీరంతా తిరిగొస్తారు. వరల్డ్ కప్ కోసం ఎంపిక చేసిన 15 మంది బృందాన్నే చివరి వన్డేకు ఎంపిక చేశారు. వీరికి తోడు అదనంగా అశ్విన్, సుందర్‌లకు కూడా చోటు లభించింది. అప్పటికి అక్షర్ పటేల్ కోలుకుంటాడని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. లేదంటే అక్షర్ స్థానంలో అశ్విన్, సుందర్‌లలో ఒకరికి చివరి వన్డేలో, ఆపై వరల్డ్ కప్ టీమ్‌లోనూ అవకాశం దక్కుతుంది.



> అశ్విన్ స్థాయి ఆటగాడికి బరిలోకి దిగి ఎన్ని రోజులైందనేది పెద్ద విషయం కాదు. అతని అనుభవం అన్నింటికంటే కీలకం. అందుకే తీసుకున్నాం. వన్డేలు ఆడకపోయినా అతను టెస్టు రెగ్యులర్, స్థానిక తమిళనాడు లీగ్‌కు కూడా ఆడుతున్నాడు. ఆస్ట్రేలియాతో ఆడితే అతని ప్రస్తుతం ఆట ఏమిటో మాకు అర్థమవుతుంది.
>
> –రోహిత్ శర్మ, భారత కెప్టెన్

ఆరేళ్లలో రెండు వన్డేలే..

2011 వన్డే వరల్డ్ కప్, 2013 చాంపియన్స్ ట్రోఫీ విజయాల్లో భాగమైన అశ్విన్ తన 12 ఏళ్ల వన్డే కెరీర్‌లో 113 మ్యాచ్‌లలో 33.49 సగటుతో 151 వికెట్లు పడగొట్టాడు. 2015 వన్డే వరల్డ్ కప్ కూడా ఆడాడు. అయితే 2017 చాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఓటమి తర్వాత అతనిపై వేటుకు రంగం సిద్ధమైంది. ఆ వెంటనే వెస్టిండీస్ గడ్డపై 3 వన్డేలు ఆడిన తర్వాత జట్టుకు దూరమయ్యాడు. ఆ తర్వాత నాలుగున్నరేళ్ల పాటు అతనికి వన్డేల్లో అవకాశమే దక్కలేదు. ఈ మధ్య కాలంలో టెస్టుల్లో నంబర్‌వన్‌గా అద్భుత విజయాలు అందించడంతో పాటు ఐపీఎల్‌లో కూడా అతను చెప్పుకోదగ్గ ప్రదర్శనే నమోదు చేశాడు. ఆ తర్వాత అనూహ్యంగా 2022 జనవరిలో దక్షిణాఫ్రికాతో 2 వన్డేలు ఆడే అవకాశం లభించింది. పార్ల్‌లో జరిగిన మ్యాచ్‌లో 10 ఓవర్లలో వికెట్ తీయకుండా 68 పరుగులు ఇవ్వడంతో అతని ఆట అక్కడ ముగిసింది. అంటే ఆరేళ్ల వ్యవధిలో అతను 2 మ్యాచ్‌లు ఆడినట్లే లెక్క! అంతర్జాతీయ టి20 కెరీర్ కూడా ముగిసినట్లే అనిపించిన దశలో అశ్విన్ అనుభవాన్ని పరిగణలోకి తీసుకున్న టీమిండియా సెలక్టర్లు ఊహించని రీతిలో గత ఏడాది వరల్డ్ కప్‌కు తీసుకున్నారు. ఇప్పుడు ఇక్కడా సరిగ్గా అదే పని చేయవచ్చు. ఫార్మాట్‌లో పని లేకుండా తెలివైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేయగల నైపుణ్యం అశ్విన్ సొంతం. వరల్డ్ కప్ ప్రత్యర్థి జట్లలో ప్రధాన ఆటగాళ్లలో చాలా మంది ఎడంచేతి వాటం ఉన్నారు. వారికి అశ్విన్ ప్రమాదకారి కాగలడు. అన్నింటికి మించి వ్యూహాల పరంగా అతని అనుభవం అక్కరకు రావచ్చు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొనే కావచ్చు రోహిత్ అతని ఎంపికపై ఆసక్తి చూపించాడు. అశ్విన్‌తో తాను ఫోన్‌లో మాట్లాడుతూనే ఉన్నానని, వరల్డ్ కప్ జట్టులో స్థానం అసాధ్యమేమీ కాదన్నట్లుగా రోహిత్ బహిరంగంగానే మద్దతు పలికాడు.

ప్రేక్షకులకు 'నో ఎంట్రీ'

హైదరాబాద్‌లో పాక్ X కివీస్ వామప్ మ్యాచ్



సాక్షి, హైదరాబాద్: వన్డే వరల్డ్ కప్‌కు ముందు హైదరాబాద్‌లో జరగనున్న తొలి వామప్ మ్యాచ్‌కు ప్రేక్షకులను అనుమతించడం లేదు. ఈ నెల 29న ఉప్పల్ స్టేడియంలో పాకిస్తాన్, న్యూజిలాండ్ మధ్య ఈ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే దానికి ఒక రోజు నగరంలో గణేశ్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ కారణంగా తాము తగినంత భద్రత పోలీసులు కల్పించలేమని పోలీసులు స్పష్టం చేసేశారు. వామప్ మ్యాచ్ తేదీని మార్చుకోవాల్సిందిగా కూడా వారు సూచించారు. అయితే బీసీసీఐ–హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) దీనిపై తగిన విధంగా చర్చించాయి. ప్రధాన మ్యాచ్ కాదు కాబట్టి సమస్య లేదని, తేదీ మార్చాల్సి అవసరం లేదనే నిర్ణయానికి వచ్చాయి. అయితే నగరంలో పరిస్థితుల నేపథ్యంలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఈ మ్యాచ్‌కు ప్రేక్షకులను అనుమతించరాదని నిర్ణయించారు.

చైనా చేతిలో చిత్తుగా...

- ఫుట్‌బాల్‌లో 1–5తో ఓడిన భారత్
- వాలీబాల్‌లో సునాయాస విజయం
- ఆసియా క్రీడల్లో పోటీలు ప్రారంభం



19th Asian Games Hangzhou 2022

హాంగ్జౌ (చైనా): ఆసియా క్రీడల కోసం ఫుట్‌బాల్ జట్టునే పంపడం లేదని కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రకటన...నేరుగా ప్రధానికి విజ్ఞప్తి చేస్తూ కోచ్ లేఖ... చివరకు గ్రీన్ సిగ్నల్...అత్యుత్తమ ఆటగాళ్లను ఇవ్వలేమంటూ ఐఎస్ఎల్ జట్ల కొర్రీలు...ఆఖరి నిమిషంలో తృతీయ శ్రేణి జట్టు ఎంపిక...కనీసం టీమ్ జెర్సీలపై ఆటగాళ్ల పేర్లు కూడా రాసుకోలేని స్థితి... ఇన్ని అడ్డంకుల తర్వాత ఎట్టకేలకు భారత ఫుట్‌బాల్ జట్టు సోమవారం సాయంత్రం చైనా గడ్డపై అడుగు పెట్టింది. కనీసం ఒక్కరోజు కూడా ప్రాక్టీస్ లేదు...16 గంటల్లోనే మ్యాచ్ బరిలోకి...సబ్‌స్టిట్యూట్‌లుగా దించేందుకు తగినంత మంది కూడా బెంచీపై లేరు... చివరకు ఊహించినట్లుగానే ప్రతికూల ఫలితం వచ్చింది. తొలి పోరులో ఆతిథ్య చైనా చేతుల్లో చిత్తుగా ఓడి నిరాశను మిగిల్చింది. అధికారికంగా ఆసియా క్రీడలు ఈ నెల 23నుంచి ప్రారంభం అవుతున్నా...కొన్ని ఈవెంట్లు ముందే మొదలైపోయాయి.

గ్రూప్ 'ఎ'లో భాగంగా మంగళవారం జరిగిన పోరులో చైనా 5–1 గోల్స్ తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో 1–1తో పరిస్థితి మెరుగ్గానే ఉన్నా...రెండో అర్ధభాగంతో నాలుగు గోల్స్‌తో చైనా చెలరేగింది. చైనా తరఫున జియావో టియాని (17వ నిమిషం), డీ వీజన్ (51వ నిమిషం), టావో కియాగ్లాంగ్ (72వ నిమిషం, 75వ నిమిషం), హావో ఫాంగ్ (90+2వ నిమిషం)లో గోల్స్ సాధించారు. భారత్ తరఫున ఏకైక గోల్‌ను కనోలీ ప్రవీణ్ రాహుల్ (45+1వ నిమిషం) నమోదు చేశాడు. మ్యాచ్ ఆసాంతం ఇరు జట్ల మధ్య తీవ్ర అంతరం కనిపించింది. 86 నిమిషాలు మైదానంలో ఉన్నా కెప్టెన్ సునీల్ ఛెత్రి ఏమీ చేయలేక చూస్తుండిపోయాడు. జట్టులోని ఎనిమిది మంది ఆటగాళ్లు మొత్తం 90 నిమిషాలు ఫీల్డ్ ఉండటం పరిస్థితిని చూపిస్తోంది. భారత్ ఈ గ్రూప్ నుంచి ముందంజ వేయాలంటే తర్వాతి మ్యాచ్‌లలో బంగ్లాదేశ్, మయన్మార్‌లపై తప్పనిసరిగా గెలవాలి.

కంబోడియాను ఓడించి...

వాలీబాల్‌లో మాత్రం భారత్ గెలుపుతో శుభారంభం చేసింది. ఈ పోరులో భారత్ 3–0 (25–14, 25–13, 25–19) తేడాతో తమకంటే బాగా తక్కువ ర్యాంక్ గల కంబోడియాను ఓడించింది. గ్రూప్ 'సి'లో తమ తదుపరి మ్యాచ్‌లో రేపు అత్యంత పటిష్టమైన కొరియాను భారత్ ఎదుర్కోనుంది.

నిశ్చల్‌కు రజతం

వరల్డ్ కప్ షూటింగ్



రియో డి జనీరో (బ్రెజిల్): ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్ ఖాతాలో మరో పతకం చేరింది. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో నిశ్చల్ రజత పతకాన్ని సొంతం చేసుకుంది. మొత్తం 458 పాయింట్ల స్కోరుతో ఆమె రెండో స్థానంలో నిలిచింది. సీనియర్ స్థాయిలో ఈ టీనేజర్‌కు ఇదే తొలి ప్రపంచకప్. నార్వేకు చెందిన జీనెట్ హెడ్ డస్టడ్‌కు స్వర్ణం లభించింది. ఈ ప్రపంచకప్‌ను భారత్ 2 పతకాలతో ముగించింది. గత వారం మహిళల 10 మీటర్ల ఎయిర్‌రైఫిల్‌లో ఎలవెనిల్ వలరివన్ స్వర్ణం గెలుచుకుంది.

బంగ్లా క్రికెటర్ నాసిర్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు

దుబాయ్: మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలపై బంగ్లాదేశ్ క్రికెటర్ నాసిర్ హుస్సేన్ సహా ఎనిమిది మందిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అవినీతి వ్యతిరేక విభాగం అభియోగాలు నమోదు చేసింది. 2020–21 సీజన్ అబుదాబి టి10 లీగ్‌లో ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు వీరిపై ప్రధాన ఆరోపణ. ఈ ఎనిమిది మందీ 'పుణే డెవిల్స్' జట్టుతో సంబంధం ఉన్న వారే. టీమ్ సహయజమానులైన కృషన్ కుమార్ చౌదరి, పరాగ్ సంఘ్వీ, అసిస్టెంట్ కోచ్ సన్నీ ధిల్లాన్ భారతీయులు కాగా, మిగతావారు విదేశీయులు. నాటి లీగ్‌లో డెవిల్స్ ఆరు మ్యాచ్‌లలో ఒకటే గెలిచింది. నాసిర్ హుస్సేన్ బంగ్లా తరఫున 19 టెస్టులు, 65 వన్డేలు, 31 టి20 మ్యాచ్‌లు ఆడాడు.

సినిమా

పండగ కిక్కు.. కొత్త లుక్కు

వినాయక చవితికి వినాయకుడికి విభిన్న రకాల వంటకాలను భక్తులు నైవేద్యంగా సమర్పిస్తుంటారు. అలాగే ఈ పండక్కి వినాయకుడిని స్మరించుకుంటూ 'పండగ కిక్కు.. కొత్త లుక్కు' అంటూ కొందరు సినిమా యూనిట్ వారు పలు రకాల అప్‌డేట్స్ ఇచ్చారు. వీటిలో కొన్ని ఈ విధంగా..



శ్రద్ధా శ్రీనాథ్, వెంకటేశ్,

బీచ్‌లో సైంధవ్

బీచ్‌లో సేద తీరుతున్నారు వెంకటేశ్. ఆయన హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందుతున్న 'సైంధవ్' కొత్త పోస్టర్ విడుదలైంది. శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా నటిస్తున్న ఈ చిత్రంలో నవాజుద్దీన్ సిద్ధిఖీ, తమిళ నటుడు ఆర్య, బాల నటి సారా కీలక పాత్రధారులు. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 22న రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్.



రవితేజ



రామ్, ఊర్వశి రౌతేలా



కల్యాణ్‌రామ్, సంయుక్తా

వీడు టైగర్...

రవితేజ టైటిల్ రోల్ చేసిన చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'. స్టువర్టుపురం దొంగగా పేరు గాంచిన టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబరు 20న రిలీజ్ కానుంది. ఈ సినిమాలోని రెండో పాట 'వీడు..'ను ఈ నెల 21న విడుదల చేస్తున్నట్లుగా వెల్లడించి, రవితేజ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.



రణ్‌బీర్




నేహాశెట్టి, కిరణ్

రామ్.. కల్ట్ మామా

'బిట్టు బిట్టు బాడీ మొత్తం రెడ్డా చిల్లి సాల్టు..' అంటూ సాగే పాట 'స్కంద' చిత్రంలోనిది. రామ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. శ్రీలీల, సయీ మంజ్రేకర్ హీరోయిన్లు. ఈ సినిమాలో రామ్, ఊర్వశీ రౌతేలా కాంబినేషన్‌లో వచ్చే ప్రత్యేక గీతం 'కల్ట్ మామా' లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. తమన్ స్వరపరచిన ఈ పాటను అనంత శ్రీరామ్ రాయగా హేమచంద్ర, రమ్య బెహ్రా, మహా పాడారు. జీ స్టూడియోస్ సౌత్, పవన్ కుమార్‌ల సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న రిలీజ్ కానుంది.

టీజర్ రెడీ

'యానిమల్' మూవీ టీజర్ రెడీ అవుతోంది. ఈ నెల 28న ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేస్తున్నట్లుగా ప్రకటించి, ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్న రణ్‌బీర్ కపూర్ పోస్టర్‌ను విడుదల చేశారు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్. భూషణ్‌కుమార్, క్రిషన్ కుమార్, మురాద్ ఖేతాని, ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 1న, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది.



తేజ

మది దోచేసిందే...

'మాయే చేసి మెల్లగా మది దోచేసిందే సిన్నగా...' అంటూ హీరో కల్యాణ్ రామ్ పాడారు. కల్యాణ్ రామ్, సంయుక్తా మీనన్ నటిస్తున్న 'డెవిల్'లోని పాట ఇది. అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం నవంబరు 24న రిలీజ్ కానుంది. ఈ సినిమా నుంచి 'మాయే చేశావే..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. హర్షవర్ధన్ రామేశ్వర్ స్వరకల్పనలో ఆర్‌వీ సత్య రాసిన ఈ పాటను సిధ్ శ్రీరామ్ పాడారు.

దేఖో ముంబై దోస్తీ మజా...

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'రూల్స్ రంజన్'. ఏఎం రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణ వేమూరి నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 6న రిలీజ్ కానుంది. ఈ సినిమాలోని 'దేఖో ముంబై దోస్తీ మజా..' పాట లిరికల్ వీడియోను హీరో రవితేజ రిలీజ్ చేశారు. అమ్రిష్ గణేష్ స్వరకల్పనలో కాసర్ల శ్యామ్, మేఘ ఉట్– వాట్ సాహిత్యం అందించగా, అద్నాన్ సమీ, పాయల్ దేవ్ ఈ పాటను పాడారు.

అంజనాద్రిలో...

తేజా సజ్జా, అమృతా అయ్యర్ జంటగా నటించిన 'హను–మాన్' పోస్టర్ రిలీజైంది. ''అంజనాద్రి అనే ఊహాత్మక ప్రదేశంలో ఈ సినిమా ఉంటుంది. తెలుగు, హిందీ, మరాఠీ, తమిళ, కన్నడ, మలయాళం, ఇంగ్లిష్, స్పానిష్, కొరియన్, చైనీస్ , జపనీస్‌తో సహా పలు భారతీయ భాషల్లో జనవరి 12న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో కె. నిరంజన్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు.

నాలోనూ ఆ భయం ఉంది – 'దిల్' రాజు



అభయ్, దాము, 'దిల్' రాజు

''రాక్షస కావ్యం' ట్రైలర్ బాగుంది. శ్రీమాన్ మేకింగ్, టేకింగ్ బాగున్నాయి. కొత్తవాళ్లతో ప్రొడ్యూసర్ దాము మంచి ప్రయత్నం చేశాడు'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. అభయ్ నవీన్, అన్వేష్ మైఖేల్, పవన్ రమేష్, దయానంద్ రెడ్డి, కుశాలిని, రోహిణి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాక్షస కావ్యం'. శ్రీమాన్ కీర్తి దర్శకత్వంలో దాము రెడ్డి, శింగనమల కల్యాణ్ నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 6న విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్‌ను 'దిల్' రాజు విడుదల చేసి, మాట్లాడుతూ– ''కరోనా తర్వాత ఓటీటీలో నెగిటివ్ కంటెంట్ బాగా పెరిగింది.. అదే సక్సెస్ అవుతోంది. నేను పాజిటివ్ కథతో ఓ మంచి సినిమా తీసినా చూడరేమో? అనే భయం కలుగుతోంది. ఎప్పుడూ హీరోలే గెలవాలా? విలన్లు గెలవొద్దా అనే పాయింట్‌తో 'రాక్షస క్యావం' చేశారు. నేటి ట్రెండ్‌కి, ప్రేక్షకులకు కావాల్సిన సినిమా ఇది'' అన్నారు.

నటుడు-దర్శకుడు విజయ్ ఆంటోని కుమార్తె ఆత్మహత్య



విజయ్ ఆంటోని



మీరా

సంగీత దర్శకుడు, హీరో, దర్శక–నిర్మాత విజయ్ ఆంటోని పెద్ద కుమార్తె మీరా మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. విజయ్ ఆంటోని తన కుటుంబ సభ్యులతో కలిసి చెన్నైలోని ఆళ్వార్‌పేట, టీటీకే రోడ్‌లోని ఇంటిలో నివసిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కూమార్తెలు. పెద్ద కూతురు మీరా (16) మౌంట్‌రోడ్‌లోని చర్చ్ పార్క్ స్కూల్‌లో ప్లస్ 2 చదువుతోంది. కాగా ఇటీవల మానసిక వేదనకు గురైన మీరా.. కావేరి ఆసుపత్రిలో వైద్యచికిత్స పొందుతూ వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం వేకువజామున మూడు గంటల ప్రాంతంలో ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎంతసేపటికీ ఆమె గది తలుపులు తెరచుకోకపోవడంతో లోనికి వెళ్లి చూడగా కూతురు నిర్జీవంగా ఫ్యాన్‌కు వేలాడుతున్న దృశ్యం చూసి తల్లిదండ్రులు దిగ్భ్రాంతికి గురయ్యారు. కావేరి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు మీరా మృతదేహాన్ని ఒమందలూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మీరా భౌతికకాయానికి ఈరోజు ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సమాచారం. – సాక్షి, చెన్నై


వినోదం సందేశం

''భద్రాచలం దగ్గర రుద్రంకోట అనే ఊరి నేపథ్యంలో 'రుద్రంకోట' కథ నడుస్తుంది. ప్రేమ, వినోదంతో పాటు సందేశం ఉంటుంది'' అని డైరెక్టర్ రాము కోన అన్నారు. నటి జయలలిత కీలక పాత్రలో నటించి, సమర్పిస్తున్న చిత్రం 'రుద్రంకోట'. రుద్ర హీరోగా, శక్తి, విభీష హీరోయిన్లుగా నటించారు. అనిల్ ఆర్కా కండవల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న స్రీక్స్ మాక్స్ సంస్థ ద్వారా విడుదలవుతోంది. ఈ చిత్రంతో దర్శకునిగా పరిచయమవుతున్న రాము మాట్లాడుతూ– ''ఇప్పటివరకూ పలు హిట్ సీరియల్స్‌కి దాదాపు ఐదు వేలకు పైగా ఎపిసోడ్స్ డైరెక్ట్ చేశాను. డైరెక్టర్ రాజమౌళిగారు మొదట 'శాంతి నివాసం' సీరియల్ చేశారు. ఆయన స్ఫూర్తితోనే నేను కూడా సీరియల్స్ నుంచి సినిమాల వైపు వచ్చాను'' అన్నారు.



రాము కోన

రాజమౌళి సమర్పణలో మేడ్ ఇన్ ఇండియా



రాజమౌళి

భారతీయ సినిమాకు ఎక్కడ పునాది పడింది? ఏ విధంగా ఎదిగింది? అనే అంశాలతో 'మేడ్ ఇన్ ఇండియా' చిత్రం రానుంది. నితిన్ కక్కర్ దర్శకత్వంలో వరుణ్ గుప్తా, ఎస్ఎస్ కార్తికేయ నిర్మించిన ఈ చిత్రాన్ని దర్శకుడు రాజమౌళి సమర్పిస్తున్నారు. మరాఠీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది ''ఈ సినిమా నరేషన్ విన్నప్పుడు భావోద్వేగానికి లోనయ్యాను. బయోపిక్ తీయడం చాలా కష్టం. అలాంటిది 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ సినిమా' గురించి అంటే ఇంకా పెద్ద సవాల్. గర్వంగా 'మేడ్ ఇన్ ఇండియా'ను సమర్పిస్తున్నా'' అని ట్వీట్ చేశారు రాజమౌళి. ''ఈ చిత్రంలోని నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఇది సినిమా భూమి – రక్షిత్ శెట్టి



హేమంత్, రక్షిత్ శెట్టి, రుక్మిణి

''సప్త సాగరాలు దాటి' చిత్రం టీజర్, ట్రైలర్ అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమా తెలుగులో విడుదలవడం సంతోషంగా ఉంది'' అన్నారు నిర్మాత డి. సురేశ్‌బాబు. రక్షిత్ శెట్టి హీరోగా నటించి, నిర్మించిన కన్నడ చిత్రం 'సప్త సాగర దాచే ఎల్లో'. హేమంత్ ఎం. రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్. ఈ నెల 1న కన్నడలో విడుదలైన ఈ చిత్రాన్ని టీజీ విశ్వ ప్రసాద్, రక్షిత్ శెట్టి 'సప్త సాగరాలు దాటి' పేరుతో ఈ నెల 22న తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ని హీరో నాని సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. ''777 చార్లీ' సినిమా కర్ణాటక తర్వాత తెలుగులోనే బాగా ఆడింది. అందుకే నేనీ ప్రాంతాన్ని సినిమా భూమిగా భావిస్తాను. 'సప్త సాగరాలు దాటి' సినిమా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు రక్షిత్ శెట్టి. ''ఈ చిత్రం తెలుగులోనూ ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు సహనిర్మాత వివేక్ కూచిభొట్ల.

కథాబలం ఉన్న సినిమా – మనోజ్‌కుమార్

''యాక్షన్ థ్రిల్లర్స్‌ను బాగా ఇష్టపడేవారికి 'అష్టదిగ్బంధనం' బాగా నచ్చుతుంది. అయితే అన్ని వర్గాల వారిని దృష్టిలో పెట్టుకుని తీసిన సినిమా ఇది'' అని డైరెక్టర్ బాబా పీఆర్ అన్నారు. సూర్య, విషిక జంటగా నటించిన చిత్రం 'అష్టదిగ్బంధనం'. మనోజ్ కుమార్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా బాబా పీఆర్ మాట్లాడుతూ– ''స్వార్థంతో కూడిన ఎనిమిది మంది జీవితాలకు సంబంధించిన కథ 'అష్టదిగ్బంధనం'. జాక్సన్ విజయ్‌గారి సంగీతం, నేపథ్య సంగీతం అద్భుతం'' అన్నారు. మనోజ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ– ''మంచి కథా బలం ఉన్న సినిమాతో నిర్మాతగా మారుతున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. బాబాగారు బాగా తీశారు. మా చిత్రాన్ని ఆంధ్ర, తెలంగాణల్లో 150 నుంచి 200 థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నాం. మా బ్యానర్‌లో మరో సినిమా సెట్స్‌పై ఉంది'' అన్నారు.



మనోజ్‌కుమార్, బాబా పీఆర్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (సోమవారం ముగింపు)		
సెన్సెక్స్ ▽	242	67,597
నిఫ్టీ ▽	59	20,133

విదేశీ సూచీలు (తారెండు రాత్రి 11.30 ముగింపు)		
నాస్‌డాక్	13,639	▽ 71
డోజోన్స్	34,394	▽ 230
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,660	△ 7
డాక్స్	15,664	▽ 63
షాంఘై	3,125	▽ 1
నికాయ్	33,243	▽ 291

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.29	83.96
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	101.57	104.93
€	యూరో	ఎస్‌బీఐ	86.97	90.07
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.66	57.25
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.10	54.96
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.06	62.00
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.75	23.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.31	12.38

గూగుల్ యాప్స్‌తో బార్డ్ అనుసంధానం..

న్యూఢిల్లీ: కృత్రిమ మేధతో పనిచేసే 'బార్డ్' చాట్‌బాట్‌ను మ్యాప్స్, డాక్స్, డ్రైవ్ వంటి మరిన్ని యాప్స్‌తో అనుసంధానం చేస్తున్నట్లు టెక్ దిగ్గజం గూగుల్ వెల్లడించింది. అలాగే మరిన్ని దేశాల్లో, మరిన్ని భాషల్లో క్వెరీల ఫలితాలను అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించింది.



జీమెయిల్, డాక్స్, గూగుల్ డ్రైవ్ వ్యాప్తంగా గల వ్యక్తిగత సమాచారాన్ని క్రోడీకరించి యూజర్లు అడిగే ప్రశ్నలకు బార్డ్ సమాధానాలు ఇవ్వగలదు. ఈ ఎక్స్‌టెన్షన్స్ డీఫాల్ట్‌గా ఎనేబుల్ అయి ఉంటాయని, కావాలంటే వాటిని ఎప్పుడైనా డిజేబుల్ చేయొచ్చని గూగుల్ తెలిపింది. ఓపెన్ సోర్స్ జెన్ఏఐ ప్లాట్‌ఫాం చాట్‌జీపీటీకి పోటీగా బార్డ్‌ను గూగుల్ రూపొందించింది.

టాటా వాణిజ్య వాహనాలు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టాటా మోటార్స్ వాణిజ్య వాహనాల ధరలను 3% వరకు పెంచాలని నిర్ణయించింది. అక్టోబర్ 1 నుంచి కొత్త ధరలు అమలులోకి రానున్నాయి. అన్ని రకాల వాణిజ్య వాహనాలకు తాజా నిర్ణయం వర్తిస్తుందని కంపెనీ ప్రకటించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-9-2023	
విశాఖ	535-00
చిత్తూరు	533-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	72.00
19-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	506-00
వరంగల్	508-00
రిటైల్ ధర	5.60

జియో ఎయిర్‌ఫైబర్ వచ్చేసింది..

- హైదరాబాద్ సహా 8 నగరాల్లో ఆవిష్కరణ
- రూ. 599 నుంచి ప్లాన్లు ప్రారంభం

న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం రిలయన్స్ జియో తాజాగా జియో ఎయిర్‌ఫైబర్ సర్వీసులను ఆవిష్కరించింది. హైదరాబాద్‌తో పాటు చెన్నై, బెంగళూరు, ముంబై, ఢిల్లీ తదితర నగరాల్లో వీటిని అందుబాటులోకి తెచ్చినట్లు మంగళవారం ప్రకటించింది. వైర్‌లెస్ విధానంలో అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్ సర్వీసులను పొందడానికి ఇది ఉపయోగపడుతుంది. జియో ఎయిర్‌ఫైబర్ ప్లాన్స్ ధరలు స్పీడ్‌ను బట్టి రూ. 599 నుంచి ప్రారంభమవుతాయి. వినాయక చవితి కల్లా వీటి సేవలను ప్రవేశపెడతామని రిలయన్స్ ఇండస్ట్రీస్ 46వ వార్షిక సర్వసభ్య సమావేశంలో సంస్థ చైర్మన్ ముకేశ్ అంబానీ ప్రకటించిన సంగతి తెలిసిందే. జియో ఇప్పటికే ఫైబర్ పేరిట బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులను అందిస్తోంది. ఇది ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ వైర్‌లైన్ మాధ్యమం ద్వారా ఇంటర్నెట్‌ను అందిస్తుండగా.. ఎయిర్‌ఫైబర్ వైర్‌లెస్ తరహాలో నెట్‌ను పొందడానికి ఉపయోగపడుతుంది. 'మా ఫైబర్-టు-ది-హోమ్-సర్వీస్ జియోఫైబర్ ఇప్పటికే 1 కోటి మందికి పైగా కస్టమర్లకు సేవలు అందిస్తోంది. ప్రతి నెల వేల కనెక్షన్లు కొత్తగా జతవుతున్నాయి. ఇంకా అసంఖ్యాక గృహాలు, చిన్న వ్యాపారాలకు వేగవంతమైన ఇంటర్నెట్‌ను అందించాల్సి ఉంది. జియో ఎయిర్‌ఫైబర్ ఇందుకు తోడ్పడనుంది. విద్య, ఆరోగ్యం, స్మార్ట్‌హోమ్ వంటి సొల్యూషన్స్‌తో ఇది కోట్ల గృహాలకు ప్రపంచ స్థాయి డిజిటల్ వినోదం, స్మార్ట్‌హోమ్, బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించగలదు' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. జియోకు 15 లక్షల కిలోమీటర్ల మేర ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ ఉంది. అయినప్పటికీ చాలా చోట్ల వైర్‌లైన్ వేయడంలో ప్రతిబంధకాల కారణంగా పూర్తి స్థాయిలో విస్తరించడంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో జియో ఎయిర్‌ఫైబర్ ఆ సవాళ్లను అధిగమించి, యూజర్లకు ఇంటర్నెట్‌ను చేరువ చేయడానికి ఉపయోగపడనుంది. జియోఫైబర్ ప్లాన్లు, ఎటువంటి మార్పు లేకుండా స్పీడ్‌ను బట్టి రూ. 399 నుంచి రూ. 3,999 వరకు రేటుతో యథాప్రకారం కొనసాగుతాయని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ తెలిపింది.



ప్రత్యేకతలివీ..

- ఎయిర్‌ఫైబర్ కేటగిరీలో అపరిమిత డేటాతో, స్పీడ్ 30 నుంచి 100 ఎంబీపీఎస్ వరకు ఉంటుంది. నెలవారీ ప్లాన్ల ధరలు రూ. 599 నుంచి రూ. 1,199 వరకు ఉంటాయి. ప్లాన్‌ను బట్టి 550 పైగా డిజిటల్ టీవీ చానళ్లు, 14 పైచిలుకు యాప్స్‌కు యాక్సెస్ లభిస్తుంది.
- ఎయిర్‌ఫైబర్ మ్యాక్స్ కేటగిరీలో డేటా స్పీడ్ 300 నుంచి 1000 ఎంబీపీఎస్ వరకు (అపరిమితం) ఉంటుంది. ధర రూ. 1,499 నుంచి రూ. 3,999 వరకు ఉంటుంది. 550 పైగా డిజిటల్ టీవీ చానళ్లతో పాటు నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ తదితర 14 పైగా ఓటీటీ యాప్‌లు అందుబాటులో ఉంటాయి.
- అదనంగా చెల్లించాల్సిన అవసరం లేకుండా వైఫై రూటర్, 4కే స్మార్ట్ సెట్‌టాప్ బాక్స్, వాయిస్ యాక్టివ్ రిమోట్ లభిస్తాయి.

అక్టోబర్ నుంచి తగ్గనున్న రిలయన్స్ గ్యాస్ ధర

14 శాతం తగ్గే అవకాశం

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఇంధన ధరలు గత ఏడాదికాలంగా నెమ్మదించిన నేపథ్యంలో దేశీయంగా సంక్లిష్ట క్షేత్రాల నుంచి ఉత్పత్తి చేసే సహజ వాయువు రేటు కూడా వచ్చే నెల నుంచి తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం యూనిట్‌కు (ఎంబీటీయూ) 12.12 డాలర్లుగా ఉన్న సంక్లిష్ట క్షేత్రాల గ్యాస్ రేటును ప్రభుత్వం 10.4 డాలర్లకు తగ్గించవచ్చని తెలుస్తోంది. అక్టోబర్ 1 నుంచి ఆరు నెలల పాటు అమల్లోకి వచ్చే కొత్త రేట్ల ప్రకారం కేజీ-డీ6 క్షేత్రంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉత్పత్తి చేసే గ్యాస్ ధర సుమారు 14 శాతం తగ్గవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. దేశీయంగా ఉత్పత్తయ్యే గ్యాస్ ధరలను కేంద్రం ఏటా రెండుసార్లు (ఏప్రిల్ 1న ఒకసారి, అక్టోబర్ 1న మరోసారి) సవరిస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థలైన ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా మొదలైన వాటికి కేటాయించిన పాత క్షేత్రాలకు, రిలయన్స్ వంటి సంస్థలకు కేటాయించిన కొత్త క్షేత్రాలకు వేర్వేరు ఫార్ములాలను వర్తింపచేస్తుంది.



ఫార్మా, డ్రోన్లు, టెక్స్‌టైల్స్ పీఎల్‌ఐలో మార్పులు

- మరిన్ని ప్రోత్సాహకాలకు వీలు
- త్వరలో ప్రకటించే అవకాశం

న్యూఢిల్లీ: ఫార్మాస్యూటికల్స్, డ్రోన్లు, టెక్స్‌టైల్స్ రంగాలకు సంబంధించి ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక పథకం(పీఎల్‌ఐ) కింద కేంద్రం మార్పులు చేయనుంది. ఈ రంగాల్లో తయారీ, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు వీలుగా రాయితీలను పెంచనుంది. ఈ విషయాన్ని ఓ సీనియర్ అధికారి అనధికారికంగా వెల్లడించారు. 2021 నుంచి ఇప్పటివరకు 14 రంగాలకు పీఎల్‌ఐ పథకం కింద కేంద్రం ప్రోత్సాహకాలు ప్రకటించి, దరఖాస్తులను సైతం స్వీకరించింది. మంత్రిత్వ శాఖల మధ్య అంతర్గతంగా కొనసాగిన సంప్రదింపుల్లో భాగంగా ఈ రంగాలకు సంబంధించి సవరణలు చేయాల్సిన అవసరాన్ని గుర్తించినట్టు సదరు సీనియర్ అధికారి తెలిపారు. దీనికి త్వరలోనే కేబినెట్ ఆమోదం పొందనున్నట్టు పేర్కొన్నారు టెక్నికల్ టెక్స్‌టైల్స్‌కు నిర్వచనం మార్చనున్నట్టు చెప్పారు. అలాగే, డ్రోన్లు, డ్రోన్ల విడిభాగాలకు కేటాయించిన రూ.120 కోట్లను పెంచనున్నట్టు వెల్లడించారు.



వైట్ గూడ్స్ (ఏసీ, ఎల్ఈడీ లైట్లు) రంగాలకు పీఎల్‌ఐ కింద నగదు ప్రోత్సాహకాలను ఈ నెల నుంచే విడుదల చేయనున్నట్టు వెల్లడించారు. 2023 మార్చి నాటికి రూ.2,900 కోట్లను ఇవ్వాల్సి ఉందన్నారు. పీఎల్‌ఐ కింద వైట్ గూడ్స్, వైద్య పరికరాల తయారీ, ఆటోమొబైల్స్, స్పెషాలిటీ స్టీల్, ఆహారోత్పత్తులు తదితర 14 రంగాలకు కేంద్రం రూ.1.97 లక్షల కోట్లను ప్రకటించింది. అయితే, కొన్ని రంగాలకు సంబంధించి పెద్దగా పురోగతి కనిపించలేదు. దీంతో కొన్ని రంగాలకు సంబంధించి మార్పులు చేయాల్సి రావచ్చని కేంద్ర వాణిజ్య శాఖ అధికారి లోగడ సంకేతం ఇవ్వడం గమనార్హం. ముఖ్యంగా అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) బ్యాటరీలు, టెక్స్‌టైల్స్ ఉత్పత్తులు, స్పెషాలిటీ స్టీల్ రంగాల్లో పీఎల్‌ఐ పట్ల పెద్దగా స్పందన లేకపోవడంతో మార్పులకు కేంద్రం పూనుకున్నట్టు తెలుస్తోంది.

ఆర్‌ఆర్ కేబుల్ లిస్టింగ్ నేడు

ఐపీవో ముగిసిన 2 రోజుల్లోనే

న్యూఢిల్లీ: గత వారం ఐపీవోకు వచ్చిన వైర్లు, కేబుళ్ల తయారీ కంపెనీ ఆర్‌ఆర్ కేబుల్ కొత్త రికార్డుకు తెరతీయనుంది. బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానుంది. వెరసి పబ్లిక్ ఇష్యూ ముగిసిన రెండు రోజుల్లోనే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయిన తొలి కంపెనీగా నిలవనుంది. ఇక టీ+3 విధానంలో లిస్టయిన తొలి కంపెనీ రత్నవీర్ ప్రెసిషన్ ఇంజనీరింగ్‌కాగా.. రెండో రోజు నుంచి టీ+2లో ఆర్‌ఆర్ కేబుల్‌లో ట్రేడింగ్ ప్రారంభంకానుంది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆగస్ట్‌లో ఐపీవో తదుపరి లిస్టింగ్ కాలాన్ని సగానికి కుదించింది. దీంతో టీ+6 నుంచి టీ+3కి లిస్టింగ్ కాలావధి తగ్గింది. ఆర్‌ఆర్ కేబుల్ ఇష్యూ సెప్టెంబర్ 13న మొదలై 15న ముగిసింది. సెప్టెంబర్ 1 నుంచి లిస్టింగ్ తాజా మార్గదర్శకాలు స్వచ్ఛంద ప్రాతిపదికన అమలులోకి వచ్చాయి. అయితే 2023 డిసెంబర్ 1 నుంచి తప్పనిసరి కానున్నాయి. ఈ నెల 20 నుంచి ఆర్‌ఆర్ కేబుల్ ఈక్విటీ షేర్లు బీ గ్రూప్‌లో లిస్టికానున్నట్లు బీఎస్ఈ ఒక ప్రకటనలో పేర్కొంది.



స్కంద ఏరోస్పేస్ ప్లాంటు ప్రారంభం

హైదరాబాద్: స్కంద ఏరోస్పేస్ టెక్నాలజీ (ఎస్ఏటీపీఎల్) తమ అత్యాధునిక గేర్ తయారీ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. మొదటి దశలో రూ. 75 కోట్లు, వచ్చే రెండు మూడేళ్లలో మరో రూ. 150 కోట్ల మొత్తాన్ని కంపెనీ వెచ్చించనుంది. దేశీయంగా విమానాలు, హెలికాప్టర్లతో పాటు అంతర్జాతీయంగా విమానాల మార్కెట్‌కు అవసరమైన విడిభాగాలను ఇందులో ఉత్పత్తి చేయనుంది. ప్రస్తుతం ఇందులో 150 మంది వరకు ఉద్యోగులు ఉండగా, మూడేళ్లలో దీన్ని 1,000కి పెంచుకోవాలని సంస్థ యోచిస్తోంది. రఘువంశీ మెషీన్ టూల్స్, రేవ్ గేర్స్ కలిసి దీన్ని ఏర్పాటు చేశాయి. స్కంద ఏరోస్పేస్‌కు ఏటా 9 మిలియన్ డాలర్ల ఆర్డర్లు ఇవ్వనున్నట్లు రేవ్ గేర్స్ తెలిపింది. ప్లాంటు ప్రారంభ కార్యక్రమంలో రఘువంశీ ఎండీ వంశీ వికాస్, తెలంగాణ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ ప్రవీణ్ పి.ఎ. తదితరులు పాల్గొన్నారు.



చారిటబుల్ ట్రస్ట్‌లకు ఐటీఆర్ గడువు పెంపు



న్యూఢిల్లీ: చారిటబుల్ ట్రస్ట్‌లు, మతపరమైన సంస్థలు, వృత్తిపరమైన సంస్థలకు సంబంధించి, ఆదాయపన్ను రిటర్నుల దాఖలు గడువును కేంద్రం పొడిగించనుంది. ఈ సంస్థలు ఐటీఆర్-7 దాఖలు చేసేందుకు అక్టోబర్ 31 గడువు కాగా, ఒక నెల అదనంగా నవంబర్ 30 వరకు గడువు ఇచ్చింది. 2022-23 సంవత్సరానికి సంబంధించి ఆడిట్ రిపోర్టులు సమర్పించేందుకు ఫండ్, ట్రస్ట్, ఇన్‌స్టిట్యూషన్, యూనివర్సిటీ లేదా విద్యా సంస్థలు, మెడికల్ ఇన్‌స్టిట్యూషన్లకు నవంబర్ 30 వరకు గడవును పొడిగించారు. ఈ మేరకు ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) ప్రకటన విడుదల చేసింది.

జాబ్ పాయింట్

ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో 350 నావిక్, యాంత్రిక్ పోస్టులు

ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌లో 01/2024 బ్యాచ్ ప్రవేశాలకు సంబంధించి ఇండియన్ కోస్ట్‌గార్డ్ నావిక్(డొమెస్టిక్ బ్రాంచ్,జనరల్ డ్యూటీ), యాంత్రిక్ పోస్టుల భర్తీకి పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 350
» **పోస్టుల వివరాలు:** నావిక్(జనరల్ డ్యూటీ)-260, నావిక్(డొమెస్టిక్ బ్రాంచ్)-30, యాంత్రిక్(మెకానికల్)-25, యాంత్రిక్(ఎలక్ట్రికల్)-20, యాంత్రిక్(ఎలక్ట్రానిక్స్) -15.
» **అర్హత:** పదో తరగతి, 10+2(మ్యాథ్స్-ఫిజిక్స్), డిప్లొమా(ఎలక్ట్రికల్/మెకానికల్ /ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్(రేడియో/పవర్)ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నావిక్ పోస్టులకు బేసిక్ పే రూ. 21,700, యాంత్రిక్ పోస్టులకు బేసిక్ పే రూ. 29,200.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, అసెస్‌మెంట్/అడాప్టబిలిటీ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.09.2023
» **వెబ్‌సైట్:** https://joinindiancoast-guard.gov.in

ఏపీ జెన్‌కోలో 26 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్-ఏపీ జెన్‌కో పరిధిలోని థర్మల్ పవర్ ప్లాంట్లలో ఒప్పంద ప్రాతిపదికన మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 26
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి మొదటి శ్రేణిలో ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 31.08.2023 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.25,000 చెల్లిస్తారు.
» **ఎంపిక:** ఎమ్మెస్సీలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పని ప్రదేశాలు:** ఇబ్రహీంపట్నం, కృష్ణా జిల్లా/ వీవీ రెడ్డి నగర్, వైఎస్సార్ కడప జిల్లా/నెలటూర్, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా/ఎంసీఎల్ కోల్‌మైన్స్, తాల్చేర్, ఒడిశా/ఎస్‌సీసీఎల్ కోల్ మైన్స్,ఇల్లందు, మణుగూరు, తెలంగాణ.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్‌కాపీని చీఫ్ జనరల్ మేనేజర్ (అడ్మినిస్ట్రేషన్), మూడో అంతస్తు, ఏపీజెన్‌కో చిరునామకు పంపించాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.09.2023
» **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 30.09.2023.
» **వెబ్‌సైట్:** https://apgenco.gov.in

కోల్ ఇండియా లిమిటెడ్, కోల్‌కతాలో 560 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

కోల్‌కతాలోని కోల్ ఇండియా లిమిటెడ్(సీఐఎల్), కార్పొరేట్ హెడ్‌క్వార్టర్స్.. మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 560
» **విభాగాల వారీగా ఖాళీలు:** మైనింగ్-351, సివిల్-172, జియాలజీ-37.
» **అర్హత:** డిగ్రీ(మైనింగ్/సివిల్ ఇంజనీరింగ్), ఎమ్మెస్సీ/ఎంఈ, ఎంటెక్ (జియాలజీ/అప్లైడ్ జియాలజీ)/జియోఫిజిక్స్/అప్లైడ్ జియోఫిజిక్స్) ఉత్తీర్ణతతో పాటు గేట్-2023లో అర్హత సాధించి ఉండాలి. » **వయసు:** 31.08.2023 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి రూ.1,60,000
» **ఎంపిక విధానం:** గేట్-2023 స్కోర్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**12.10.2023
» **వెబ్‌సైట్:** https://www.coalindia.in

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 95 నాన్ టీచింగ్ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్/డిప్యుటేషన్ ప్రాతిపదికన గ్రూప్-ఎ, బి, సి నాన్-ఫ్యాకల్టీ, ఇతర అకడమిక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 95
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ రిజిస్ట్రార్(డిప్యుటేషన్)-01, అసిస్టెంట్ లైబ్రేరియన్ -04, అసిస్టెంట్ రిజిస్ట్రార్-02, సెక్షన్ ఆఫీసర్-02, అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్ /ఎలక్ట్రికల్)-02, సెక్యూరిటీ ఆఫీసర్-02, సీనియర్ అసిస్టెంట్-02, ప్రొఫెషనల్ అసిస్టెంట్-01, జూనియర్ ఇంజనీర్(సివిల్ /ఎలక్ట్రికల్)-08, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ -01, జూనియర్ ప్రొఫెషనల్ అసిస్టెంట్-02, స్టాటిస్టికల్ అసిస్టెంట్-01, ఆఫీస్ అసిస్టెంట్-10, లైబ్రరీ అసిస్టెంట్-04, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్-44, హిందీ టైపిస్ట్-01, ల్యాబొరేటరీ అటెండెంట్-08.
» **అర్హత:** సంబంధిత విభాగంలో 10+2, డిగ్రీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ, నెట్/స్లెట్/సెట్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ట్రేడ్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.09.2023
» **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 06.10.2023.
» **వెబ్‌సైట్:** https://uohyd.ac.in

ఎస్‌బీఐలో పీఓ కొలువులు

» రెండు వేల పీఓ పోస్ట్‌ల భర్తీకి ప్రకటన
» డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు
» మూడంచెల ఎంపిక విధానం
» వేతన శ్రేణి రూ.36,000-రూ.63,840

బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు బ్యాంకింగ్ రంగంలో అద్భుత అవకాశం స్వాగతం పలుకుతోంది! దేశంలో అతి పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. రెండు వేల ప్రొబేషనరీ ఆఫీసర్(పీవో) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది! మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ పీఓ పోస్టులకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణతోపాటు పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..

ఎస్‌బీఐ.. క్లరికల్ కేడర్, పీఓ, స్పెషలిస్ట్ ఆఫీసర్స్ తదితర పోస్టుల భర్తీకి క్రమం తప్పకుండా నోటిఫికేషన్లు విడుదల చేస్తోంది. ఇదే క్రమంలో తాజాగా 2023కు సంబంధించి ప్రొబేషనరీ ఆఫీసర్స్ పోస్టులకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించింది. ఇప్పటికే ఆయా బ్యాంకు ఉద్యోగాలకు, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారు అదే ప్రిపరేషన్‌తో ఎస్‌బీఐ పీఓ పోస్ట్‌లకు కూడా పోటీ పడొచ్చు.

రెండు వేల పోస్ట్‌లు

ఎస్‌బీఐ తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం రెండు వేల పీవో పోస్ట్‌లను భర్తీ చేయనుంది. ఇందులో జనరల్ కేటగిరీకి 810 పోస్టులు,ఓబీసీ అభ్యర్థులకు 540, ఎస్సీలకు 300, ఎస్టీలకు 150, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 200పోస్ట్‌లను రిజర్వ్ చేశారు.

అర్హత

2023, డిసెంబర్ 31 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిసెంబర్ 31లోపు తమ కోర్సు ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

వయసు

- ఏప్రిల్ 1, 2023 నాటికి 21-30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ వర్గాలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.
- **వేతనం:** బేసిక్ పే: రూ.41,960(వేతన శ్రేణి రూ.36,000-రూ.63,840)

మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఎస్‌బీఐ పీవో పోస్టుల భర్తీకి మూడు దశల్లో ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తోంది.

అవి.. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ.

వంద మార్కులకు ప్రిలిమినరీ

నియామక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమినరీ రాత పరీక్షను 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు-30 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 35 ప్రశ్నలు-35 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులు.. ఇలా మొత్తం 100 మార్కులు-100 ప్రశ్నలకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 60 నిమిషాలు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది. పరీక్షకు అందుబాటులో ఉండే సమయం ఒక గంట.

తదుపరి దశ మెయిన్

ఎంపిక ప్రక్రియలో రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్. తొలి దశ ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు 10 మందిని చొప్పున మెయిన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్షను ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్ పరీక్ష 200 మార్కులకు; ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై డిస్క్రిప్టివ్ టెస్ట్ 50 మార్కులకు ఉంటుంది. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలు-50 మార్కులకు, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ 30 ప్రశ్నలు-50 మార్కులకు,జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-60 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 35ప్రశ్నలు-40 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 180 నిమిషాలు.



డిస్క్రిప్టివ్ టెస్ట్

మెయిన్‌లో భాగంగానే ప్రత్యేకంగా ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై డిస్క్రిప్టివ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఇది 50 మార్కులకు ఉంటుంది. ఈ పరీక్షలో లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్ ఉంటాయి. 30 నిమిషాల వ్యవధిలో కంప్యూటర్ ఆధారంగా సమాధానాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

నెగెటివ్ మార్కింగ్

ఆబ్జెక్టివ్ విధానంలో జరిగే ప్రిలిమ్స్, మెయిన్స్ ఎగ్జామ్స్‌లో నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4వ వంతు మార్కును తగ్గిస్తారు.

చివరగా సైకోమెట్రిక్ టెస్ట్

మొత్తం ఎంపిక ప్రక్రియలో చివరి దశ సైకోమెట్రిక్ టెస్ట్. ఇందులో భాగంగా గ్రూప్ ఎక్సర్‌సైజ్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. మెయిన్ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని చొప్పున(1:3 నిష్పత్తిలో) తుది దశకు ఎంపిక చేస్తారు. మొత్తం 50 మార్కులకు నిర్వహించే చివరి దశ ఎంపిక ప్రక్రియలో గ్రూప్ ఎక్సర్‌సైజ్‌కు 20 మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 మార్కులు ఉంటాయి.

గ్రూప్ ఎక్సర్‌సైజ్

గ్రూప్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా అభ్యర్థులను వేర్వేరు బృందాలుగా విభజిస్తారు. ఒక్కో బృందంలో గరిష్ఠంగా అయిదుగురు అభ్యర్థులు ఉండేలా చూస్తారు. ఇలా బృందాలుగా విభజించాక.. నిర్దిష్టంగా ఒక అంశాన్ని పేర్కొని.. దానికి అభ్యర్థుల అభిప్రాయం లేదా సమాధానాన్ని అడుగుతారు. సామాజిక అంశాలపై అవగాహన, టీమ్ స్కిల్స్ వంటి వాటిని పరిశీలిస్తారు.

పర్సనల్ ఇంటర్వ్యూ

గ్రూప్ ఎక్సర్‌సైజ్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా.. పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూలో బ్యాంకింగ్ నాలెడ్జ్, బ్యాంకింగ్ రంగంలో కెరీర్‌పై ఆసక్తిని పరిశీలిస్తారు.

వెయిటేజీ విధానం

తుది విజేతల ఎంపికలో ఎస్‌బీఐ వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తోంది. మెయిన్ పరీక్షలో పొందిన మార్కులకు 75 శాతం; చివరి దశలోని గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభకు 25 శాతం వెయిటేజీ ఇస్తోంది. ఇలా మొత్తం వంద శాతానికి అభ్యర్థులు పొందిన మార్కులను క్రోడీకరించి.. తుది విజేతలను నిర్ణయిస్తుంది.

సిలబస్‌పై పట్టుతో సక్సెస్

రీజనింగ్

ఈ విభాగంలో మంచి మార్కుల కోసం ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. విశ్లేషణ సామర్థ్యం, తార్కికత్వం పెంచుకునే విధంగా కృషి చేయాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్ అంశాల్లో పరిపూర్ణమైన అవగాహన పొందాలి.

డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్

అభ్యర్థులు ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన మరో విభాగం.. డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్. ఇందులో రాణించడానికి కాలిక్యులేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలి. టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలలోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్

ఈ విభాగానికి సంబంధించిన అంశాలను మరింత ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. ఇటీవల కాలంలో జాతీయ ఆర్థిక రంగంలో మార్పులు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇందులో రాణించేందుకు.. బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

అర్థమెటిక్ అంశాలపై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

గ్రూప్ ఎక్సర్‌సైజ్, ఇంటర్వ్యూ

ఈ ప్రక్రియలో విజయం సాధించడానికి ఇంగ్లిష్ వ్యాకరణం, వాక్య నిర్మాణంపై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు సామాజిక పరిణామాలపై పట్టుండాలి. ఇందుకోసం దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర జనరల్ ఎస్సే పుస్తకాలు అనుసరించడం ఉపయుక్తంగా ఉంటుంది.

అనుసంధానం చేసుకుంటూ

పీఓ పోస్ట్‌ల అభ్యర్థులు ప్రిలిమ్స్, మెయిన్స్‌లోని ఉమ్మడి అంశాలను గుర్తించాలి. ముఖ్యంగా రెండు దశల్లోనూ ఉన్న ఇంగ్లిష్, రీజనింగ్‌కు కామన్ ప్రిపరేషన్ దృక్పథం ఎంతో మేలు చేస్తుంది. ఈ విభాగాలు ఒకే విధంగా ఉన్నప్పటికీ.. మెయిన్‌లో క్లిష్టత స్థాయి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మెయిన్ పరీక్ష కోణంలోనే ప్రిపరేషన్ సాగిస్తే.. ప్రిలిమ్స్‌లో సులువుగా నెగ్గడమే కాకుండా.. ఒకే సమయంలో రెండింటికీ సన్నద్ధత లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:**సెప్టెంబర్27, 2023
- **ప్రిలిమినరీ పరీక్ష(ఆన్‌లైన్) తేదీలు:** నవంబర్‌లో
- **మెయిన్ ఎగ్జామినేషన్:** డిసెంబర్ లేదా 2024 జనవరిలో
- **సైకోమెట్రిక్ టెస్ట్:**2024 జనవరి/ఫిబ్రవరి నెలలో
- **తుది ఫలితాల వెల్లడి:** 2024 ఫిబ్రవరి/మార్చి నెలలో
- **వివరాలకు వెబ్‌సైట్:** https://bank.sbi/careers, https://www.sbi.co.in/careers

క్లుప్తంగా...

రూ.9.17 కోట్లతో గుండ్లకమ్మ గేట్ల మరమ్మతులు

సాక్షి, అమరావతి: గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పిల్ వే గేట్ల మరమ్మతులు, కొత్త గేట్ల ఏర్పాటుకు రూ.9.17 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. స్పిల్ వే 12 గేట్లలో పూర్తిగా దెబ్బతిన్న గేట్ల స్థానంలో కొత్త గేట్లు, పాక్షికంగా దెబ్బతిన్న గేట్లకు మరమ్మతు చేయడంతోపాటు కొత్త వైర్ రోప్స్, స్టాప్‌లాగ్ గేట్లు, గ్యాంట్రీ క్రేన్‌లను ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. ఈ మేరకు జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లాలో మద్దిపాడు మండలం చిన్నమల్లవరం వద్ద గుండ్లకమ్మ నదిపై గుండ్లకమ్మ ప్రాజెక్టును ప్రభుత్వం నిర్మించింది. తుప్పుపట్టడం వల్ల కొన్ని గేట్లు దెబ్బతిన్నాయి. గతేడాది గుండ్లకమ్మకు వచ్చిన భారీ వరదలకు ఒక గేటు దెబ్బతింది. గుండ్లకమ్మ ప్రాజెక్టును ఇటీవల పబ్లిక్ వర్క్స్ వర్క్‌షాప్ జనరల్ సూపరింటెండెంట్ తనిఖీ చేసి.. స్పిల్ వే గేట్ల పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా గుండ్లకమ్మ ప్రాజెక్టు భద్రతకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

చంద్రబాబు అరెస్టు తీరుల్లో లోపాలన్నే ఖండించాం

జనసేనకు మళ్లీ గ్లాసు గుర్తు!



[illegible]

అక్రమాలపై [illegible]

[illegible]

రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో భారీగా పెరుగుదల

- నాలుగేళ్లలో రూ.3,74,369 కోట్లు పెరుగుదల
- ప్రస్తుత ధరల ప్రకారం 2022-23 రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.11,65,179 కోట్లు
- నాలుగేళ్లలో తలసరి ఆదాయం రూ. 65,487 పెరుగుదల
- 2022-23లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 2,19,518
- ఆర్‌బీఐ వెల్లడి.. రాష్ట్రాలవారీగా గణాంకాలతో నివేదిక

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన చర్యలతో రాష్ట్రంలో వ్యవసాయం, తయారీ, రియల్ ఎస్టేట్ తదితర అన్ని రంగాల్లో కార్యకలాపాలు వేగంగా పెరుగుతున్నాయి. తద్వారా రాష్ట్ర స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం భారీగా పెరుగుతున్నాయి. గత నాలుగేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.3,74,369 కోట్లు పెరిగింది. అలాగే రాష్ట్ర తలసరి ఆదాయం గత నాలుగేళ్లలో 65,487 రూపాయలు పెరిగింది. ఆర్‌బీఐ మంగళవారం విడుదల చేసిన గణాంకాలు ఈ వివరాలు వెల్లడించాయి. ప్రస్తుత ధరల ప్రకారం దేశ ఆర్థిక వ్యవస్థపై రాష్ట్రాల వారీగా గణాంకాలను ఆర్‌బీఐ ఈ నివేదికలో వెల్లడించింది. గత నాలుగేళ్లుగా వ్యవసాయం, తయారీ రంగం, రియల్ ఎస్టేట్ తదితర రంగాల ఆర్థిక కార్యకలాపాల ద్వారా రాష్ట్ర స్థూల ఉత్పత్తికి విలువ జోడించినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.7,90,810 కోట్లు ఉండగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.11,65,179 కోట్లకు పెరిగినట్లు తెలిపింది. ముఖ్యంగా 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి రాష్ట్రంలో వ్యవసాయ రంగం కార్యకలాపాల విలువ భారీగా పెరుగుతున్నట్లు పేర్కొంది. 2018-19లో ప్రస్తుత ధరల ప్రకారం వ్యవసాయ ఆర్థిక కార్యకలాపాల నికర విలువ రూ.2,61,448 కోట్లు ఉందని, ఈ విలువ ప్రతి ఏటా పెరుగుతూ 2022-23లో రూ.4,16,441 కోట్లకు చేరిందని వివరించింది. అలాగే తయారీ రంగం ఆర్థిక కార్యకలాపాల విలువ 2018-19లో రూ. 67,393 కోట్లు ఉండగా 2022-23కి రూ.89,180 కోట్లకు పెరిగింది. నిర్మాణ రంగం ఆర్థిక కార్యకలాపాల విలువ 2018-19లో రూ.56,106 కోట్లు ఉండగా 2022-23 నాటికి రూ.76,694 కోట్లకు పెరిగింది. రియల్ ఎస్టేట్, యాజమాన్యం, నివాసం, వృత్తిపరమైన సేవల ఆర్థిక కార్యకలాపాల విలువ 2018-19లో రూ.58,147 కోట్లు ఉండగా 2022-23కి రూ.82,775 కోట్లకు పెరిగినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. రాష్ట్రంలో తలసరి ఆదాయం కూడా గత నాలుగేళ్లుగా పెరుగుతూనే ఉంది.



ప్రస్తుత ధరల ప్రకారం 2019-20 నుంచి 2022-23 వరకు రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదల

ఆర్థిక సంవత్సరం	రాష్ట్ర స్థూల ఉత్పత్తి (రూ.కోట్లలో)
2019 - 20	8,28,033
2020 - 21	8,50,594
2021 - 22	10,06,285
2022 - 23	11,65,179

ప్రస్తుత ధరల ప్రకారం 2019-20 నుంచి 2022-23 వరకు రాష్ట్ర తలసరి ఆదాయం పెరుగుదల

ఆర్థిక సంవత్సరం	తలసరి ఆదాయం (రూపాయల్లో)
2019-20	1,60,341
2020-21	1,63,746
2021-22	1,92,587
2022-23	2,19,518

2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత ధరల ప్రకారం తొలిసారిగా రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2 లక్షలు దాటింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,54,031 ఉండగా 2022-23కి రూ. 2,19,518 రూపాయలకు పెరిగిందని ఆర్‌బీఐ పేర్కొంది.

రూరల్ రోడ్ల పనుల నాణ్యత భేష్

- ఏపీ రూరల్ రోడ్డు ప్రాజెక్టుపై ఏఐఐబీ బృందం సంతృప్తి
- ఉత్తమ ప్రాజెక్టుగా కితాబు



సాక్షి, అమరావతి: ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) సహాయంతో చేపట్టిన ఏపీ రూరల్ రోడ్డు ప్రాజెక్టు పనుల నాణ్యతపై ఆ బ్యాంకు ప్రతినిధి బృందం పూర్తి సంతృప్తిని వ్యక్తం చేసింది. తమ బ్యాంకు సహాయంతో చేపట్టిన ఉత్తమ ప్రాజెక్టుగా కితాబిచ్చింది. ఈ మేరకు బ్యాంకు ఇంప్లిమెంటేషన్ సపోర్టు మిషన్ బృందం 5 రోజులపాటు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఏపీ రూరల్ రోడ్డు ప్రాజెక్టు పనులు జరుగుతున్న ప్రాంతాల్లో పర్యటించింది. జిల్లా స్థాయి పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లతో సమావేశమై పనుల ప్రగతిని, నాణ్యతను పరిశీలించింది. తదనంతరం మంగళవారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డితో ఈ బృందం సమావేశమైంది. రాష్ట్రంలో జరుగుతున్న ఏపీ రూరల్ రోడ్డు ప్రాజెక్టు పనుల ప్రగతిని వివరించి పనులపై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేయడంతోపాటు తమ బ్యాంకు ఆర్థిక సహాయంతో జరుగుతున్న గ్రామీణ రహదారి పనుల్లో నాణ్యతతో కూడిన ఒక ఉత్తమ ప్రాజెక్టుగా కితాబిచ్చింది.

రూ.5,026 కోట్లతో పనులు

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గ్రామీణ ఆవాసాలకు మెరుగైన రహదారి సౌకర్యాలను కల్పించడంతోపాటు పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లో దెబ్బతిన్న గ్రామీణ రహదారుల మరమ్మతుల కోసం ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు రుణ సహాయంతో ఏపీ రూరల్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. మొత్తం ప్రాజెక్టు విలువ రూ.5,026 కోట్లు కాగా.. ఏఐఐబీ రూ.3,418 కోట్లను రుణంగా అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.1,608 కోట్లను సమకూరుస్తోంది. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 3,665 పనులు చేపట్టి 7,213 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులు చేపట్టారు. ఇప్పటికే కాంపొనెంట్-1ఏ కింద 6,215 కిలోమీటర్ల పొడవున 3,231 పనులు చేపట్టగా.. ఇప్పటికే 2,450 కి.మీ. పొడవు గల 1,201 పనులు పూర్తయ్యాయి. మరో 3,765 కి.మీ. పొడవు గల 2,030 పనులు ప్రగతిలో ఉన్నాయి. కాంపొనెంట్-1బీ కింద 364 కి.మీ. పొడవు గల 142 పనులు చేపట్టగా.. వివిధ దశల్లో ప్రగతిలో ఉన్నట్టు పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లు వివరించారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్, పంచాయతీరాజ్ ఈఎన్‌సీ బాలూనాయక్, ఏఐఐబీ ప్రతినిధి బృందం లీడర్ ఫర్హద్ అహ్మద్, సీనియర్ కన్సల్టెంట్ అశోక్‌కుమార్, పర్యావరణ, సోషల్ ఎక్స్‌పర్ట్ శివ, ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్ ప్రదీప్, ట్రాన్స్‌పోర్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అసోసియేట్ తాషిక్ పాల్గొన్నారు.

జనసేనకు మళ్లీ గ్లాసు గుర్తు

- ఈసీ కేటాయించినట్లు ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ ప్రకటన
- తమకు సమాచారం రాలేదన్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం

సాక్షి, అమరావతి: కేంద్ర ఎన్నికల సంఘం జనసేన పార్టీకి మళ్లీ గ్లాస్ గుర్తును కేటాయించిందని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'జనసేన పార్టీకి ఎన్నికల గుర్తుగా మరోసారి గ్లాస్‌ను కేటాయించినందుకు ఎన్నికల సంఘానికి కృతజ్ఞతలు. గత సార్వత్రిక ఎన్నికల్లో జనసేన అభ్యర్థులు గ్లాస్ గుర్తుతో ఏపీలో 137 స్థానాలు, తెలంగాణలో 7 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేశారు. ఇప్పుడు ప్రజలకు సేవ చేయడానికి జనసేన అభ్యర్థులు సన్నద్ధమైన తరుణంలో జనసేనకు గ్లాస్ గుర్తును కేంద్ర ఎన్నికల సంఘం కేటాయించడం చాలా సంతోషదాయకం. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాలు, కేంద్ర ఎన్నికల సంఘంలోని అధికారులు, సిబ్బందికి పేరుపేరునా నా తరఫున, జనసేన పార్టీ తరఫున కృతజ్ఞతలు' అంటూ ఆ ప్రకటనలో పవన్ పేర్కొన్నారు. కాగా, జనసేన పార్టీకి గ్లాస్ గుర్తు కేటాయింపునకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం నుంచి మంగళవారం సాయంత్రం వరకు తమకు ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయ వర్గాలు తెలిపాయి. 2019లో తొలిసారి పోటీ చేస్తున్న జనసేనకు కేంద్ర ఎన్నికల సంఘం గ్లాస్ గుర్తును కేటాయించింది. కానీ ఆ పార్టీ ఈసీ నిబంధనల ప్రకారం అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 6 శాతం ఓట్లను, 2 సీట్లను కూడా గెలవలేకపోయింది. దీంతో జనసేనకు కేటాయించిన గ్లాస్ గుర్తును కేంద్రం ఎన్నికల సంఘం తొలగించింది. ఆ గుర్తును ఇండిపెండెంట్‌గా పోటీ చేసే వారికి కేటాయించే 'ఫ్రీ సింబల్స్' కేటగిరిలో చేర్చింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం తమ పార్టీకి మళ్లీ గ్లాస్ గుర్తును కేటాయించినట్టు పవన్ తాజాగా ప్రకటించారు.

తల్లిని సజీవదహనం చేసిన తనయుడు

- మద్యానికి డబ్బులు ఇవ్వలేదని పెట్రోల్ పోసి తగలబెట్టాడు
- అనంతపురం జిల్లాలో ఘటన



మృతురాలు సుజాతమ్మ (ఫైల్)

కంబదూరు: నవమాసాలు మోసి.. జన్మనిచ్చి.. కంటికి రెప్పలా కాపాడి.. పెంచి పెద్ద చేసిన కన్నతల్లినే ఓ కుమారుడు పెట్రోల్ పోసి సజీవదహనం చేశాడు. ఈ ఘటన అనంతపురం జిల్లా కంబదూరులో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కంబదూరులోని ఓబయ్య కాలనీకి చెందిన ఈడిగ గోపీనాథ్, సుజాతమ్మ(59) దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలు ఇద్దరికీ పెళ్లిళ్లు కావడంతోపాటు ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇంటర్ చదివిన కుమారుడు ప్రణీత్ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. తాగుడుకు బానిసైన అతను ఉద్యోగం మానేసి స్వగ్రామం చేరుకున్నాడు. రోజూ మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని తల్లిదండ్రులను హింసించేవాడు. సోమవారం కూడా మద్యం తాగడానికి డబ్బు ఇవ్వాలని అనారోగ్యంతో మంచంలో పడుకుని ఉన్న తల్లి సుజాతమ్మను అడిగాడు. ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో ఆగ్రహంతో తల్లిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. చుట్టుపక్కలవారు మంటలను గమనించి సుజాతమ్మ భర్త గోపీనాథ్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చేలోపే పూర్తిగా కాలిపోయిన సుజాతమ్మ మృతి చెందింది. ఘటనాస్థలాన్ని కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి నిందితుడు ప్రణీత్‌ను అరెస్ట్ చేశారు.

కూతురిని వేధించొద్దన్నందుకు కత్తితో దాడి

ప్రకాశం జిల్లా సింగరాయకొండలో ఘటన

సింగరాయకొండ: తన కూతుర్ని వేధించొద్దన్నందుకు ఓ తండ్రిపై ఇద్దరు యువకులు కత్తితో దాడికి పాల్పడిన ఘటన ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండల కేంద్రంలోని భైరాగిమాన్యంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. భైరాగిమాన్యంలోని బికారి రోడ్‌లో నివసిస్తున్న షేక్ సుభాని వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇతని కూతురు ఇంటర్ పూర్తి చేసి ఇంటివద్ద ఉంటోంది. వీరి ఇంటికి సమీపంలో బజ్జా మహేష్, చదలవాడ సదానందం నివసిస్తున్నారు. సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో సుభాని కుమార్తె, ఆమె స్నేహితురాలు కలిసి సుభానీ ఇంటి నుంచి పక్కవీధిలోకి వెళ్తుండగా మహేష్, సదానందం ఇద్దరూ వారిని ఉద్దేశించి విజిల్ వేశారు. ఇది గమనించిన సుభానీ వారి వద్దకు వెళ్లి ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహం చెందిన మహేష్ తన జేబులో ఉన్న చిన్న కత్తి తీసి సుభానీపై దాడి చేసి ఆరుచోట్ల గాయపరిచాడు. వెంటనే యువకులిద్దరూ అక్కడి నుంచి పారిపోయారు. మహేష్ భరత్ స్వగ్రామం ఉలవపాడు మండలం కృష్ణాపురం. మహేష్ తమిళనాడు రాష్ట్రం సేలంలో బీటెక్ చదువుతున్నాడు. సదానందం ఆటోడ్రైవర్‌గాను, మాంసం దుకాణంలో పనిచేస్తున్నాడు. ఇతనిపై రౌడీషీట్‌కూడా ఉంది. సుభానీపై దాడి చేసే సమయంలో నిందితులు మద్యం మత్తులో ఉన్నారని పోలీసులు తెలిపారు. హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.